
BALA CHELIMI

BALA

SEP | SEP 2026



₹40

సెప్టెంబర్ - 2026

PRGI Regn. No. 52828/1992

# బాల చెలిమి

పిల్లల వికాస పత్రిక

# BALA CHELIMI

Telugu Children's Monthly Magazine


సంపుటి : 35 • సంచిక : 12



SEPTEMBER - 2026

Editor : **Er. VEDAKUMAR MANIKONDA**

A PUBLICATION OF **CHILDREN'S EDUCATIONAL ACADEMY,** HYDERABAD, TELANGANA






## SEPTEMBER 2026

Oxford Grammar School students depicting India's rich cultural tapestry through the regional traditional attire of Indian states on the occasion of the 77th Republic Day celebrations.

Oxford Grammar High School
#Street No. 13, Himayathnagar, Hyderabad
Ph : 040 2763 6214, +91 99590 20512
www.oxfordgrammarschool.com

ogs FOUNDATIONAL STAGE

45 YEARS OF MERITORIOUS PERFORMANCE

| Sun | Mon | Tue | Wed | Thu | Fri | Sat |
|---|---|---|---|---|---|---|
| | | 1 | 2 | 3 | 4 | 5 |
| 6 | 7 | 8 | 9 | 10 | 11 | 12 |
| 13 | 14 | 15 | 16 | 17 | 18 | 19 |
| 20 | 21 | 22 | 23 | 24 | 25 | 26 |
| 27 | 28 | 29 | 30 | | | |
| | | | | | | |

**Important Dates**

4 Sept - Krishna Janmashtami
14 Sept - Vinayaka Chavithi
25 Sept - Ganesh Visarjan

NOTES :


Unity in Diversity.

Printed at : Deccan Press, Azamabad, Hyderabad-20, Ph : 90599 50055

# బాలచెలిమి

పిల్లల వికాస పత్రిక


| సంపుటి: Volume: 35 | సంచిక : Issue : 12 | హైదరాబాద్ Hyderabad | సెప్టెంబర్ September | పేజీలు Pages 52 | రూ. ₹. 40 |
|---|---|---|---|---|---|














## లోపలి పేజీల్లో.......




| | | |
|---|---|---|
| బాల్యం... జీవితపు అమూల్యమైన వరం.... | మణికొండ వేదకుమార్ .. | 5 |
| ఆధునిక అనస్థిషియా పయనీర్ సర్ జేమ్స్‌యంగ్ సింప్సన్ (సైంటిస్ట్) | జుగాష్‌విలి | 6 |
| అద్భుతాల భాష (అంతర్జాతీయ అనువాద దినోత్సవం) | డా. నీరజ అమరవాది | 7 |
| పిల్లలు భద్రం (పాట)... | రేడియమ్ | 8 |
| రాణీ గైడిన్‌ల్యూ | షిరోన్-256 | 9 |
| రెండు ఏకాక్షరాలతో మొదలు... (అక్షరం) | చొక్కాపు వెంకటరమణ | 10 |
| పొదుపే సంపద (కథ) | మల్లారపు నాగార్జున | 11 |
| అప్పుల్ దేరా... పప్పుల్ దేరా! (పాట)... | గంగదేవు యాదయ్య | 12 |
| కోతి నేర్పిన గుణపాఠం (కథ) | నరాల భార్గవి | 13 |
| కాంతి - నీడలు - ప్రతిబింబాలు (ఆట).. | శ్రీమతి మీనాస్వామినాథన్ | 14 |
| బంగారు మర్రి - 16 (సీరియల్) | పైడిమర్రి రామకృష్ణ | 15 |
| వేమన పద్యం | | 16 |
| 200 సంవత్సరాల తర్వాత మానవ లోకం (కథ) | నూనె శ్రీనిధి | 17 |
| నీచులకు ఆశ్రయమిస్తే... | పంచతంత్ర కథ | 18 |
| తెలంగాణ చారిత్రక పర్యాటకం శాతవాహనుల కాలంలో దేవాలయాలు | దేశరాజు శ్యాంసుందర్‌రావు - స్థపతి | 19 |
| మంటల్లో చల్లదనం (సైన్స్) | డాక్టర్ మహీధర నళినీ మోహన్ | 20 |
| ఆటవిడుపు (లఘునాటిక) | డా. సమ్మెట విజయ | 21 |
| తండ్రి నీల్స్ బోర్ సిద్ధాంతాన్ని సవరించినకుమారుడు ఆగే బోర్ (సైన్స్ వెన్నెల-23) ... | డా. నాగసూరి వేణుగోపాల్ | 23 |
| ధాన్యాలు - సిరిధాన్యాలు - ఎండుఫలాలు | 'ఆరోగ్యం-విజ్ఞానం' పుస్తకం నుండి.. | 24 |
| కానుగ చెట్టు (చెట్టు - చేమ) | కోమటిరెడ్డి బుచ్చిరెడ్డి | 25 |
| టీచర్స్ డే (కార్టూన్) | జుగాష్ విలి | 26 |
| వీసా సంక్షోభం నుంచి విజయ శిఖరానికి (స్పోర్ట్స్) | బాలచెలిమి డెస్క్ | 28 |
| గురువుకు దండం (కథ) | పెరుమాళ్ళ ఆనంద్ | 29 |
| పదాల మేడ-4 (పజిల్) | మాదారపు వాణిశ్రీ | 30 |
| స్నేహం కోసం (అనువాద కథ) | అనిల్ బత్తుల | 31 |
| సామెతలు | బాలచెలిమి డెస్క్ | 32 |
| అదిగో అదిగో మా బడి (పాట)... | వెల్మజాల నర్సింహ | 32 |

| | | |
|---|---|---|
| ఊహించని విజయం (కథ) | సింహాచలం అమిత్ సూర్య | 33 |
| జలియన్ వాలా బాగ్ దురంతానికి కదిలిపోయిన బాల భగత్‌సింగ్ (చరిత్ర కథలు-3... | బాల కథా సౌరభం | 34 |
| వేయిన్నర సంవత్సరాల ఆర్థిక పరిస్థితులు (చరిత్ర పాఠాలు-18) | డా. ద్యావనపల్లి సత్యనారాయణ | 35 |
| నేర్చుకుందామా | | 36 |
| కలం-చెలిమి | | 36 |
| చదువు విలువ (కథ) | బి. మనోహరి | 37 |
| ఫిబోనాకి శ్రేణి 10 సంఖ్యల మొత్తము (మాథ్స్ ట్రిక్స్) | అంకెల మామయ్య చంద్రయ్య | 38 |
| చెలిమి క్లబ్ | బాలచెలిమి డెస్క్ | 38 |
| పర్యావరణ పరిరక్షణకు గ్రీన్ టెక్నాలజీ (విద్య) | లత | 39 |
| పల్లెకు పోదాం (పాట)... | ఆవుల చక్రపాణి యాదవ్ | 40 |
| చీమ - మిడత (పిల్లల కథల్లో సైన్స్-8) | కె శ్రీకృష్ణ సాయి | 41 |
| గురువు గారి కర్తవ్య బోధ (కథ) | సంగనభట్ల చిన్న రామకిష్టయ్య | 43 |
| బాల రచయితలకు సాహిత్య అకాడమి ఆహ్వానం | | 44 |
| భారత ఆర్థిక వ్యవస్థలో నౌకాశ్రయాల పాత్ర (జి. కె.) | బాలచెలిమి డెస్క్ | 45 |
| గడ్డిలో దాగి... గగనంలో మెరిసే బెంగాల్ ఫ్లోరికన్ (నేచర్) | సచిన్ కోత్వాల్ | 46 |
| చివరి మార్కు (కథ)... | ఎన్. నిహాన్ | 47 |
| ముదుమాల్ విద్యార్థులకు జ్ఞానవెలుగు -'బాలచెలిమి గ్రంథాలయం' | శ్రీ జనార్ధన్ రెడ్డి | 48 |
| సమాచారం | బాలచెలిమి డెస్క్ | 49 |
| సూర్యగమన రహస్యాలను తెలిపే ముదుమాల్ శిలలు | | 49 |
| అభినయానికి చిరునామా... 'షావుకారు' జానకి (వ్యక్తిత్వం) | సువేగా | 50 |


# చెలిమి లేఖలు

ఆర్యా మణికొండ గారు,

మీ 'బాలచెలిమి' సంచికను ఒకచోట చూడగానే, ఒకనాటి బాలమిత్ర, చందమామ, బొమ్మరిల్లు వంటి అనేక బాలల పత్రికలు వెంటనే గుర్తుకొచ్చాయి. నేటి తరంలో పఠనాసక్తి తగ్గిపోతూ, ఎన్నో బాలల పత్రికలు కనుమరుగై పోతున్న ఈ కాలంలో కూడా బాలల కోసం మీరు నిరంతరంగా చేస్తున్న కృషికి ముందుగా బాలచెలిమి మాస పత్రిక సంపాదకులు శ్రీ మణికొండ వేదకుమార్ గారికి కృతజ్ఞతాపూర్వక ధన్యవాదాలు.

బాల రచయితలు, బాల రచయిత్రులను ప్రోత్సహిస్తూ, బాలల్లోని ప్రతిభను, నైపుణ్యాలను పెంపొందించడంలో 'బాలచెలిమి'కి ఒక ప్రత్యేక స్థానం ఉందని నేను మనసారా భావిస్తున్నాను. ఇలాంటి 'బాలచెలిమి' మాసపత్రిక సమాజంలో కొనసాగడం ఎంతో అవసరం. ఇటువంటి పత్రికను కాపాడుకొని, భావితరాలకు అందించాల్సిన బాధ్యత మనందరిపైనా ఉందని ఈ పోస్టుకార్డు ద్వారా మీకు తెలియజేస్తున్నాను.


**- శ్రీశైలం,** మసాబ్ ట్యాంక్, హైదరాబాద్

పిల్లల్లో పఠనాసక్తి, సృజనాత్మకత, భాషా నైపుణ్యాలు, విజ్ఞాన జిజ్ఞాసను పెంపొందిస్తూ, కథలు, పాటలు, ప్రకృతి--విజ్ఞాన విశేషాలతో తెలుగు భాషకు ప్రాధాన్యమిస్తూ విలువైన బాలసాహిత్యాన్ని అందిస్తున్న 'బాలచెలిమి' మాసపత్రిక సంపాదకులకు హృదయపూర్వక అభినందనలు.

**- వశిష్ఠ,** వరంగల్

*Cover Picture :*
THE MAGIC OF
INNOCENT PLAY

బొమ్మలు:
కూరెళ్ల శ్రీనివాస్,
m : 98495 43728




సంపాదకులు : మణికొండ వేదకుమార్

BALA CHELIMI
**"CHANDRAM"** 3-6-712/2, St. No. 12,
Himayatnagar, Hyderabad - 500 029.
e-mail : edit. chelimi@gmail. com, www. balachelimi. com
Mob: 98480 44713

# బాల్యం... జీవితపు అమూల్యమైన వరం

పిల్లలూ...

బాల్యం... మనిషి జీవితంలో మళ్లీ తిరిగి రాని అత్యంత అందమైన కాలం. కల్మషం తెలియని మనసు, కళ్ల నిండా కుతూహలం, ప్రతి చిన్న విషయాన్నీ ఆశ్చర్యంగా చూసే చూపు, చిన్న ఆనందానికే మనసారా నవ్వగల స్వభావం – ఇవన్నీ బాల్యానికే సొంతమైన అపురూపమైన సంపదలు.

ఈ నెల 'బాలచెలిమి' ముఖచిత్రంలోని చిన్నారిని చూడగానే మన బాల్యపు జ్ఞాపకాలు ఒక్కసారిగా మనసులో మెదులుతాయి. నీటిలో ఆడుకుంటూ, తన చుట్టూ ఉన్న ప్రపంచాన్నే మరిచిపోయి, తనదైన ఆనందలోకంలో విహరిస్తున్న ఆ చిన్నారి ముఖంలో కనిపించే సహజమైన సంతోషం – బాల్యపు అమాయకత్వానికి అందమైన ప్రతిబింబం.

వాన పడితే బయటకు పరుగెత్తడం... నీటి గుంటల్లో కాళ్లు పెట్టి ఆడుకోవడం... కాగితపు పడవలు చేసి ప్రవాహంలో వదలడం... మట్టితో బొమ్మలు చేయడం... చెట్లెక్కడం... సీతాకోకచిలుకల వెంట పరుగెత్తడం... స్నేహితులతో ఆటల్లో మునిగిపోవడం... ఇవన్నీ చిన్నవిగా కనిపించినా, పిల్లల మనసులో జీవితాంతం నిలిచిపోయే గొప్ప జ్ఞాపకాలు. బాల్యం అంటే కేవలం చదువు, మార్కులు, పరీక్షలు, ర్యాంకులు మాత్రమే కాదు. ఆట కూడా బాల్యమే. ప్రకృతిని ఆస్వాదించడం బాల్యమే. స్నేహం బాల్యమే.

నేటి కాలంలో పిల్లల జీవితం వేగంగా మారుతోంది. చదువుతోపాటు సాంకేతికత, మొబైల్ ఫోన్లు, డిజిటల్ ప్రపంచం వారి రోజువారీ జీవితంలో భాగమవుతున్నాయి. ఈ మార్పుల మధ్య పిల్లలకు ప్రకృతితో గడిపే సమయం, స్వేచ్ఛగా ఆడుకునే అవకాశం, తాతయ్య–అమ్మమ్మల కథలు వినే అనుభవం, కుటుంబ సభ్యులతో కలిసి నవ్వుకునే సందర్భాలు తగ్గిపోకుండా చూడాల్సిన బాధ్యత మనందరిదీ.

పిల్లలకు మనం అందించగల గొప్ప బహుమతి ఖరీదైన వస్తువులు మాత్రమే కాదు. మన సమయం, ప్రేమ, ఆప్యాయత, ప్రోత్సాహం, వారి మాటలను ఓపికగా వినడం, స్వేచ్ఛగా ఆలోచించే అవకాశం ఇవ్వడం – ఇవే వారి వ్యక్తిత్వాన్ని తీర్చిదిద్దే నిజమైన సంపదలు.

ప్రతి చిన్నారిలో ఒక ప్రత్యేకమైన ప్రపంచం ఉంటుంది. వారి ప్రశ్నలను అడ్డుకోకుండా ప్రోత్సహిద్దాం. వారి కలలకు రెక్కలు తొడుగుదాం. ప్రకృతిని పరిచయం చేద్దాం. పుస్తకాలతో స్నేహం చేయిద్దాం. మన భాష, సంస్కృతి, మానవీయ విలువల పట్ల ప్రేమను పెంచుదాం. అదే సమయంలో వారు తమ బాల్యాన్ని బాల్యంగానే ఆస్వాదించే స్వేచ్ఛను కూడా ఇద్దాం.

ఎందుకంటే, బాల్యంలో పొందిన ప్రేమ, అనుభవాలు, స్నేహాలు, చిన్న చిన్న సంతోషాలే రేపటి వ్యక్తిత్వానికి బలమైన పునాదులు. పెద్దయ్యాక మనం సంపాదించిన ఎన్నో విజయాల మధ్య కూడా మనసు తిరిగి వెతుక్కునేది ఆ బాల్యపు మధుర జ్ఞాపకాలనే.

బాల్యం భవిష్యత్తుకు సిద్ధమయ్యే కాలం మాత్రమే కాదు – అది స్వయంగా ఒక అందమైన జీవితం. ఆ అమాయకత్వాన్ని కాపాడుదాం... ఆ కుతూహలాన్ని ప్రోత్సహిద్దాం... ఆ చిరునవ్వును నిలబెట్టుదాం... ప్రతి చిన్నారికీ ఆనందంగా జీవించే బాల్యాన్ని అందిద్దాం.

అదే 'బాలచెలిమి' ఆకాంక్ష... అదే మనందరి బాధ్యత.



మీ

వేదకుమార్.యం


(మణికొండ వేదకుమార్)

ఎడిటర్ బాలచెలిమి



# ఆధునిక అనస్థిషియా పయనీర్
# సర్ జేమ్స్‌యంగ్ సింప్సన్

సర్ జేమ్స్ యంగ్ సింప్సన్ స్కాటిష్ వైద్యుడు. శస్త్ర చికిత్సలు, ప్రసవ సమయంలో రోగుల నొప్పిని తగ్గించడానికి క్లోరోఫామ్‌ను మత్తుమందుగా వైద్యరంగంలో వినియోగంలోకి తీసుకురావడంలో కీలక పాత్ర వహించారు. సర్ జేమ్స్ 1811 జూన్ 7న బాత్‌గేట్ స్కాట్లాండ్‌లో జన్మించారు. సింప్సన్ కుటుంబం స్థితిపరులు కాకపోయినప్పటికీ జేమ్స్‌లోని తెలివి తేటలను గుర్తించిన కుటుంబ సభ్యులు మంచి చదువు చెప్పించాలని నిర్ణయించుకున్నారు. ఆయనను ఎడిన్‌బరో విశ్వవిద్యాలయంలో చదివించారు. కష్టపడి చదివి వైద్యుడయ్యాడు. అప్పట్లో యిప్పటిలా సమర్థ వంతమైన మత్తు మందులు అందుబాటులో లేవు. ఆపరేషన్ సమయంలో రోగులు తీవ్రమైన నొప్పిని భరించాల్సి వచ్చేది. ఈ బాధలను చూసిన జేమ్స్ ఎంతో బాధ పడేవాడు. ముఖ్యంగా ప్రసవ సమయంలో స్త్రీలు అనుభవిస్తున్న నొప్పి ఆయనను కలత పెట్టింది. తీవ్రమైన ప్రభావానికి గురి చేసింది. రోగుల నొప్పిని ఎలా తగ్గించాలనే ప్రశ్న కొత్త మార్గాల అన్వేషణకు పురికొల్పింది.



మత్తు కలిగించే వివిధ పదార్థాలపై ప్రయోగాలు చేసాడు. 1847 నవంబర్ 4న ఆయన తన యిద్దరు సహచరులతో కలిసి క్లోరోఫామ్ ప్రభావాన్ని స్వయంగా పరీక్షించారు. కొద్దిపాటి క్లోరోఫామ్‌ను పీల్చిన తరువాత ముగ్గురు స్పృహ కోల్పోయారు. స్పృహ వచ్చిన తర్వాత సింప్సన్ క్లోరోఫామ్‌కు బలమైన మత్తు కలిగించే లక్షణం ఉందని గుర్తించారు. ప్రసవం, ఇతర శస్త్ర చికిత్సల సమయంలో నొప్పి తగ్గించేందుకు క్లోరోఫామ్‌ను ఉపయోగించడం వైద్యరంగంలో మత్తు మందుల వినియోగానికి కొత్తదారి చూపింది. వైద్యరంగంలో యిదొక ముఖ్యమైన ఘట్టంగా మిగిలింది. సింప్సన్ ప్రసూతివైద్యం, స్త్రీ వైద్యం రంగాల అభివృద్ధికి కూడా విశేషంగా కృషి చేసారు. కొత్త వైద్య పద్ధతులు, పరికరాలపై పరిశోధనలు చేశారు. వైద్య శాస్త్రంతో పాటు పురావస్తు, ఇతర శాస్త్రీయ అంశాలపై కూడా జేమ్స్‌కు ఆసక్తి వుండేది.

ఎడిన్‌బరో విశ్వవిద్యాలయంలో ప్రసూతి శాస్త్ర ప్రొఫెసర్‌గా పని చేసారు. క్లోరోఫామ్‌ను ఆయన స్వయంగా కనిపెట్టలేదు. కాని వైద్య రంగంలో దాని వినియోగాన్ని స్థిరపరిచింది జేమ్స్ ప్రధాన కృషి మాత్రమే. 1866లో ఆయనకు Baronet బిరుదు లభించింది. SIR బిరుదు కూడా లభించింది. జేమ్స్ వైద్య రంగానికి సంబంధించిన అనేక గ్రంథాలు రాసారు. ఎడిన్‌బర్గ్‌లోని రాయల్ కాలేజి ఆఫ్ సర్జన్స్ లైబ్రరీలో సింప్సన్ పేపర్స్ (1847 ఈథర్, క్లోరోఫామ్ ఉపయోగం, ప్రసూతిలో అనస్థిషియా పై ఉత్తరాలు పత్రాలు) భద్రపరచబడి ఉన్నాయి. Archaeological Essays of the Late Sir James Y. Simpson రెండు సంపుటాలు 1871లో మరణానంతరం ప్రచురించారు. ఇది పురావస్తు, చారిత్రక వ్యాసాల సంకలనం. మనిషి బాధను తగ్గించేందుకు విజ్ఞానాన్ని ఉపయోగించిన గొప్ప వైద్యుడు సర్ జేమ్స్ యంగ్ సింప్సన్ 1870లో మరణించారు.

– జుగాష్‌విలి
బాలచెలిమి డెస్క్, m : 83094 52998




హాయ్ పిల్లలూ ఎలా ఉన్నారు! మీరు స్కూల్లో కొత్త పాఠాలతో పాటు కొత్త కొత్త భాషలను కూడా నేర్చుకుంటున్నారా. మీరు ఇంట్లో మీ మాతృభాష తెలుగో, హిందీనో లేక తమిళం అలా ఏదో ఒక భాష మాట్లాడుతూ ఉంటారు. కానీ స్కూల్‌కి వెళ్లగానే తప్పని సరిగా ఇంగ్లీషు నేర్చుకుంటారు. మొదట్లో మీకు ఆ భాష అర్థంకాక పోయినా బొమ్మలతోనో, మీకు తెలిసిన భాషలో అనువాదం చేస్తూనో నేర్పిస్తారు కదా. అలాగే అవసరాన్ని బట్టి ఇతర భాషలను నేర్చుకుంటాము. మన భారతదేశంలోనే 23 భాషలు మాట్లాడే ప్రజలు ఉన్నారు. మన రాష్ట్రం దాటి వేరే రాష్ట్రానికి వెళ్తే, వారి భాష నేర్చుకోవలసి వస్తుంది. దాని వల్ల రకరకాల రాష్ట్రాలకి తల్లిదండ్రులు ఉద్యోగరీత్యా వెళ్లిన పిల్లలకు చాలా భాషలు వస్తాయి. ఒకటి కంటె ఎక్కువ భాషలు మాట్లాడగలిగే చిన్నారుల మెదడు చాలా చురుగ్గా పని చేస్తుందట. జ్ఞాపకశక్తి కూడా పెరుగుతుందట. కొంత మంది రెండు భాషలు కలిపి మాట్లాడడం మీరు ఎప్పుడైనా విన్నారా!. నిత్యజీవితంలో మనం తెలుగు మాట్లాడుతూనే మధ్యలో ఇంగ్లీష్, హిందీ పదాలు వాడుతూనే ఉంటాం. ఒకే సమయంలో రెండుమూడు భాషలు మాట్లాడడాన్ని 'జగ్లింగ్' అంటారు. ఇలా చాలా భాషలు మాట్లాడే పిల్లలకి 'మల్టీటాస్కింగ్ స్కిల్స్' ఉంటాయట. అంతేకాదు వేగంగా, వరుసగా రెండు లేదా అంతకంటె ఎక్కువ పనులు (టాస్క్ స్విచింగ్) చేయగల సామర్థ్యం ఉంటుందట. ఒక భాషలో వచ్చిన మంచి సినిమాలను అనువాద సినిమాలుగా చూస్తూ, వాటిని ఆదరిస్తున్నాము. ఆ భాషలోని నటులని కూడా మనం ఇష్టపడుతూ ఉంటాం. బహుభాషా పరిజ్ఞానంతో చేసే అనువాదాలకు సాహిత్యంలో కూడా ఎంతో ఆదరణ ఉంది. ఉత్తమ అనువాదాలకు పురస్కారాలను కూడా ఇస్తారు.

"To have another language is to possess a second soul". - Charlemagne

మన దేశ ప్రధానులలో చాలా మంది రెండు కన్నా ఎక్కువ భాషలు మాట్లాడగలిగేవారు. మాజీ ప్రధాని పి. వి. నరసింహారావు గారికి తెలుగుతో సహా 17భాషలలో ప్రావీణ్యం ఉంది. విదేశాలకు వెళ్లినప్పుడు వారి భాషలో మాట్లాడి ఆ దేశ ప్రజలకు ఆనందాశ్చర్యాలకు లోను చేసేవారట. ప్రపంచంలో సుమారు 7,117 భాషలను మాట్లాడే ప్రజలు ఉన్నారు. ఒకరి భాషా, సాహిత్యం, సంస్కృతి తెలుసుకోవడానికి అనువాదాలు చాల ఉపయోగపడతాయి. మొదట అనువదింపబడిన గ్రంథం బైబిల్ అని మీకు తెలుసా. 'సెయింట్ జెరోమ్' బైబిల్‌ని హిబ్రూ భాష నుండి లాటిన్ భాషలోకి అనువదించాడట. సెప్టెంబర్ 30 ఆయన అమరత్వం పొందిన దినం. మొదటి అనువాదకుడిని గౌరవించుకుంటూ 1991 నుండి సెప్టెంబర్ 30న అనువాద దినోత్సవాన్ని(International Translation day) జరుపుకుంటున్నాము.

అభివృద్ధి, నాగరికతల పెరుగుదల, రాష్ట్రాలు, దేశాల మధ్య విస్తరిస్తున్న సంబంధాలు, ప్రపంచాన్నే కుగ్రామంగా

మార్చేసిన అంతర్జాల ప్రభంజన నేపథ్యంలో విదేశీ, స్వదేశీ భాషల పట్ల అవగాహనకు అనువాదం అనేది చాలా అవసరమైన ప్రక్రియ. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో వివిధ భాష సమూహాల మధ్య సమాచార వారధికి, సమన్వయానికి, దేశాలు దగ్గరవడానికి, పరస్పర సహకారాలకు, ప్రపంచశాంతి, జీవన భద్రతకు అనువాద ప్రక్రియ చోదకశక్తిగా పని చేస్తుంది. ఐక్యరాజ్య సమితి తన కార్యకలాపాలను నిర్వహించడానికి అరబిక్, చైనీస్, ఇంగ్లీష్, ఫ్రెంచ్, రష్యన్, స్పానిష్, జర్మన్ భాషలను అధికార భాషలుగా గుర్తించింది. అనువాదకులకు ఎన్నో ఉద్యోగావకాశాలు కూడా ఉన్నాయి. అనువాదకులు కేవలం భాషా పదాలనే అనువదించరు. అనువాద భాషలోని భాషా మర్యాదలను, సాంప్రదాయాలను తెలుసుకొని మూల భాషలోని భావం చెడకుండా అనువదిస్తారు. అనువాదాల ప్రాముఖ్యతను గుర్తించే ఇంటర్నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ ట్రాన్స్‌లేషన్, అమెరికన్ ట్రాన్స్‌లేటర్స్ అసోసియేషన్‌లు UNOతో కలిసి ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. ప్రతి సంవత్సరం ఒక థీమ్‌తో ఈ ఉత్సవాన్ని నిర్వహిస్తారు. 2026 సంవత్సరానికి థీమ్ "Translation and Indigenous languages". అనువాద దినోత్సవంలో మనందరం పాలుపంచుకుందాం.

అందులో భాగంగా

1. ఏదైనా ఒక అనువాద రచనను చదువుదాం.
2. కొత్త భాషను నేర్చుకునే ప్రయత్నం చేద్దాం.
3. అనువాద చలనచిత్రాలను చూద్దాం.
4. అనువాదకులకు అభినందలను తెలియజేద్దాం.
5. వర్క్‌షాప్స్, సెమినార్లు పెట్టుకొని అనువాద సమస్యలను, అవసరాలను, ఉపాధి అవకాశాల గురించి చర్చించుకుందాం.

రచన చేయడం కత్తి మీద సాము చేయడమనుకుంటే, అనువాదం రెండు కత్తులతో సాము చేయడం. అనువాదం నిత్య అవసరం. నిత్య నూతనం.

పిల్లలూ మీరు స్కూల్లో కానీ చుట్టుపక్కల గానీ ఏదైనా కొత్త భాష వినిపిస్తే నేర్చుకోవడానికి, అర్థం చేసుకోవడానికి ప్రయత్నించండి. చిన్నతనంలో భాషను సులభంగా నేర్చుకోవచ్చు.

"Translation is not a matter of words only. It is a matter of making intelligible whole culture".

– డా. నీరజ అమరవాది
m : 9849160055

# పిల్లలు భద్రం

– రేడియమ్
m : 9291527757

అదిగో పిల్లి
ఇదిగో పిల్లి
గల్లి గల్లి లో
పిల్లి పిల్లి
ఎలుకలు భద్రం!



అదిగో కుక్క
ఇదిగో కుక్క
ఇంటింటిలో
గల్లి గల్లిలో
కుక్కలు కుక్కలు
దొంగలు భద్రం!



బడి బాటలో
ఆటో, కార్లు
స్కూటర్, రిక్షాలు
వస్తూ పోతూ జర–
పిల్లలు భద్రం!



# రాణీ గైడిన్‌ల్యూ

## స్వేచ్ఛా యోధురాలు, ప్రతిఘటనకు ప్రతీక

రాణీ గైడిన్‌ల్యూ (1915 జనవరి 26 - 1993 ఫిబ్రవరి 17) నాగా నాయకురాలు, స్వాతంత్ర్య సమరయోధురాలు.

నాగా సమాజాన్ని ప్రక్షాళించడానికి, బ్రిటీష్ పాలనను వ్యతిరేకించడానికి మతపరమైన హెరాకా ఉద్యమంలో 13 సంవత్సరాల వయస్సులో గైడిన్ ల్యూ చేరారు. బ్రిటీష్‌కు వ్యతిరేకంగా జెలియాంగ్రాంగ్ ప్రజలను సమీకరించిన ఆమె నాయకత్వం ప్రతిఘటనకు చిహ్నంగా, ప్రజలకు స్ఫూర్తిగా నిలిచింది.




పదహారు సంవత్సరాల చిరు వయస్సులో 1932లో రాణీ గైడిన్‌ల్యూను బ్రిటీష్ వారు అరెస్టు చేసి జీవిత ఖైదు విధించారు. భారత దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తరువాత 1947లో ఆమె విడుదల అయ్యారు. రాజకీయ ఖైదీలలో ఆమె అతి పిన్న వయస్కురాలు, ఎక్కువ కాలం జైలులో గడిపారు. జైలు నుంచి విడుదలైన తరువాత సామాజిక సేవ, విద్య, దేశీయ సంప్రదాయాలను కాపాడటానికి గైడిన్ ల్యూ తన జీవితాన్ని అంకితం చేశారు. ఈశాన్య భారత సామాజిక-సాంస్కృతిక కృషిలో ఆమె ముఖ్య వ్యక్తిగా మారారు.

పద్మ భూషణ్ (1982) సహా అనేక అవార్డులు రాణీ గైడిన్‌ల్యూను వరించాయి. ఆమె గౌరవార్థం అస్సాంలోని సిల్చార్‌లో ఆమె విగ్రహంతో పార్కును రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఆమె గౌరవార్థం భారత ప్రభుత్వం 1996లో ఒక తపాలా బిళ్లను, 2015లో స్మారక నాణాన్ని విడుదల చేసింది.

భారత దేశ స్వాతంత్ర్యం కోసం ఆమె చేసిన పోరాటం, సాహసం అచంచలమైన ఆమె స్ఫూర్తికి చిహ్నంగా మిగిలిపోయాయి.

– 'షీరోస్-256
ఇన్‌స్పైరింగ్ వుమెన్ ఫ్రమ్ ఇండియా' నుండి....

### మీకు తెలుసా?

గైడిన్‌ల్యూను 'పర్వతాల కుమార్తె'గా నెహ్రూ అభివర్ణించారు, ధైర్యానికి 'రాణి' అనే బిరుదును ఆమెకు అందించారు.

# అక్షరాలతో ఆటలు

## రెండు ఏకాక్షరాలతో మొదలు...

ప్రతి పదానికి ముందు రెండు ఒకే రకం అక్షరాలు.


తమాషా చూడండి

| | |
|---|---|
| గగనం | శిశిరం |
| మమత | వివిధ |
| తాతాజీ | జేజేలు |
| బాబాయి | పాపాయి |
| రారాజు | వేవేలు |
| లేలేత | దాదాపు |
| శశకం | లలన |
| పాపాలు | కాకాలు |
| తతంగం | తూతూ మంత్రం |
| డూడూ బసవన్న | హాహాకారం |

- చొక్కాపు వెంకటరమణ
రచయిత, కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత
(తానా 'తెలుగు తేజం' పుస్తకం నుండి...)
m: 92465 20050

కథ

# పొదుపే సంపద



కార్వేటినగరం అనే గ్రామంలో చెంచయ్య అనే కష్టపడి పనిచేసే రైతు ఉండేవాడు. అతనికి ఇద్దరు కొడుకులు. పెద్దోడు పేరు ఆజాద్, చిన్నోడు పేరు అన్వేష్. ఇద్దరికీ పెద్దగా చదువు రాకపోయినా వ్యవసాయం చేసుకుంటూ జీవించేవారు. కాలం గడిచింది. చెంచయ్య ఇద్దరికీ పెళ్లిళ్లు చేశాడు. కొత్త కోడళ్ళు ఇంటికి రావడంతో ఆ ఇల్లు నవ్వులతో, సందడితో కళకళలాడింది. మొదట్లో అందరూ ఎంతో ప్రేమగా ఉండేవారు. కానీ రోజులు గడిచేకొద్దీ చిన్న చిన్న మాటలు పెద్ద గొడవలుగా మారాయి. పొలం పనులు, వంట పనులు, ఇంటి పనుల దగ్గర మొదలైన గొడవలు ఊరి పెద్దమనుషులు జోక్యం చేసుకున్నా లాభం లేకపోయింది. చివరకు కుటుంబం విడిపోవడానికి దారి తీశాయి. చెంచయ్య చాలా బాధపడ్డాడు. అయినా పిల్లలు సుఖంగా ఉండాలని తన దగ్గరున్న ఆస్తిని మూడు భాగాలుగా చేసి, ఇద్దరు కొడుకులకు మూడెకరాల చొప్పున భూమి పంచిపెట్టాడు. తన పోషణార్థం మూడెకరాలు ఉంచుకున్నాడు. ఆజాద్ చాలా జాగ్రత్తగా ఉండేవాడు.

"అవసరానికి మాత్రమే ఖర్చు పెట్టాలి" అని అనుకునేవాడు. పొలంలో వచ్చిన ఆదాయాన్ని ఆచితూచి వాడేవాడు. మిగిలిన డబ్బును పోస్టాఫీసులో దాచుకునేవాడు. గ్రామంలో కొందరు అతన్ని "పిసినారి" అని ఎగతాళి చేసేవారు. కానీ ఆజాద్ ఎవరి మాటలు పట్టించుకోలేదు.

అతను తన పిల్లలకు కూడా చిన్నప్పటి నుంచే మంచి అలవాట్లు నేర్పించాడు. "డబ్బు విలువ తెలుసుకోవాలి. కష్టపడి చదివితేనే భవిష్యత్తు బాగుంటుంది" అని చెప్పేవాడు. పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాడు. పిల్లలు కూడా తండ్రి మాట విని బాగా చదివారు. మంచి మార్కులతో పరీక్షల్లో ఉత్తీర్ణులై, మంచి ఉద్యోగాలు సంపాదించారు. ఆజాద్‌కుటుంబం ఆనందంగా, గౌరవంగా జీవించింది. అన్వేష్ మాత్రం భిన్నంగా ఉండేవాడు.

"డబ్బు వచ్చిందే ఖర్చు పెట్టడానికి!" అని అనుకునేవాడు. వచ్చిన ఆదాయంతో పాటు అప్పులు కూడా చేసి విలాసంగా జీవించేవాడు. విందులు, వినోదాలు, జల్సాగా తిరుగుళ్లు డబ్బు మంచినీళ్లలా ఖర్చు చేసేవాడు. గ్రామస్తులు అతని డాబు దర్పం చూసి ఈర్ష్యపడే వారు.

తన పిల్లలను ఖరీదైన ప్రైవేట్ స్కూల్లో చేర్పించాడు. "ఇంగ్లీష్ చదువులే గొప్ప" అని అందరికీ చెప్పుకునేవాడు. పిల్లలు అడిగినంత పాకెట్ మనీ ఇచ్చేవాడు. కానీ బాధ్యత, కష్టం, డబ్బు విలువ మాత్రం నేర్పలేదు. పిల్లలు చదువుపై శ్రద్ధ పెట్టకుండా తన లాగే జులాయిగా తిరగడానికి అలవాటు పడ్డారు.

కొన్ని సంవత్సరాలు గడిచాయి. ఒక రోజు అన్వేష్ పరిస్థితి చాలా దారుణంగా మారింది. అప్పులు పెరిగి పోయాయి. పొలాలు అమ్ముకోవాల్సి వచ్చింది. పిల్లలు పరీక్షల్లో ఫెయిలై ఉద్యోగాలు లేక నిరుద్యోగులుగా ఇంట్లోనే ఉండిపోయారు. అన్వేష్‌కు తన తప్పు అర్థమైంది.

చేతులు కాలాక ఆకులు పట్టుకున్నట్లు ఇక ఆజాద్ మాత్రం కష్టపడి పనిచేస్తూ, పొదుపుగా జీవిస్తూ ముందుకు సాగాడు. దాచుకున్న డబ్బుతో మరికొన్ని పొలాలు కొనుగోలు చేశాడు. పిల్లలను మంచి చదువులు చదివించి ఉన్నత స్థితికి చేర్చాడు. ఇంట్లో అందరూ హాయిగా జీవించారు.

ఒక రోజు అన్వేష్ అన్నయ్య దగ్గరకు వచ్చి బాధగా అన్నాడు.. "అన్నయ్యా! నేను సంపాదించినదంతా వృథా చేశాను. పిల్లలకు డబ్బు ఇచ్చాను కానీ బాధ్యత నేర్పలేదు. నువ్వు బాధ్యతతో పాటు పొదుపు కూడా నేర్పి, మంచి భవిష్యత్తు ఇచ్చావు."

ఆజాద్ నవ్వుతూ చెప్పాడు.. "డబ్బు సంపాదించడం గొప్ప కాదు తమ్ముడూ... దాన్ని సరిగ్గా ఉపయోగించడం, కొంత పొదుపు చేయడం, పిల్లలకు మంచి విలువలు నేర్పడం చేయాలి."


అప్పటి నుంచి అన్వేష్ కూడా కష్టపడి పని చేస్తూ పొదుపు చేయడం ప్రారంభించాడు. తన పిల్లలకు బాధ్యతగా జీవించడం నేర్పించాడు.


– మల్లారపు నాగార్జున
తిరుపతి.
9398000686.


పాట

# అప్పల్ దేరా.. పప్పల్ దేరా!

అప్పల్ దేరా.. పప్పల్ దేరా!
ఆలూ భుజియా.. సేమ్యా దేరా!
మురుకుల్.. పుట్నాల్.. పేలాల్ దేరా!
గారెల్.. బూరెల్.. గర్జెల్ దేరా!
పకోడీ.. జిలేబి.. బోండం దేరా!
సమోస.. హల్వా.. కచోరి దేరా!
బజ్జీల్.. మిర్చీల్.. కలకాన్ దేరా!
నేను దింటరా.. నిన్ను దంతరా..!




– గంగదేవు యాదయ్య
ఉయ్యాలా జంపాలా
m : 90591 12105



చందదారులుగా చేరండి!

బాల చెలిమి

చందదారులను చేర్పించండి!

SCAN & PAY

'యం. వేదకుమార్ సంపాదకత్వంలో వెలువడుతున్న 'బాల చెలిమి' పిల్లల మాసపత్రిక బాలబాలికలకు చేరడంలో తల్లిదండ్రుల, ఉపాధ్యాయ, పాఠశాల నిర్వాహకుల, మేధావుల అమూల్య సహకారాన్ని కోరుతున్నాం. చందదారులుగా చేరడంతోపాటు తమకు తెలిసినవారిని చందదారులుగా చేర్పించాల్సిందిగా అభ్యర్థిస్తున్నాం.

**మా చిరునామా :**

BALA CHELIMI
"CHANDRAM" 3-6-712/2,
St. No. 12, Himayatnagar
Hyderabad - 500 029.
Mob: 9030626288
E-mail:desk. chelimi@gmail. com,
www. balachelimi. com

**చందా వివరాలు :**

| | |
|---|---|
| విడి ప్రతి | : రూ. 40 |
| వార్షిక చందా | : రూ. 400 |
| 2 సం॥లకు | : రూ. 750 |


'బాల చెలిమి' పేరిట నగదు, చెక్ లేదా ఆన్‌లైన్ రూపంలో చందామొత్తం చెల్లించవచ్చు.

**ACCOUNT DETAILS :**

| | |
|---|---|
| Bank Name | : Canara Bank |
| A/C No. | : 30101010003714 |
| Branch | : Ashoknagar, HYDERABAD. |
| IFSC Code | : CNRB0013010 |

కథ

# కోతి నేర్పిన గుణపాఠం



ఒక దట్టమైన అడవిలో కోతి ఉండేది. అది తెలివి గలది. అడవికి జనాలు స్వార్థంతో చెట్లను నరికేస్తూ, కలపను అమ్ముకుంటున్నారు. కోతి ఇదంతా చూస్తూనే ఉంది. రోజులు గడిచేకొద్దీ అడవి పలచబడింది. కోతికి తినడానికి పండ్లు దొరకడం కష్టమైంది. ఇలాగైతే మనం బ్రతకడం ఎలా? అని అది ఆలోచించసాగింది.

ఒకరోజు చిన్న పిల్లవాడు చేతిలో గొడ్డలి పట్టుకుని అడవికి వెళతాడు. చిన్న చెట్టును నరకడానికి సిద్ధమయ్యాడు. అది చూసిన కోతి ఆ అబ్బాయి దగ్గరకు వెళ్లి, ఇలా అన్నది. బాబు! అంత చిన్న చెట్టును ఎందుకు నరుకుతున్నావు? అని కోతి అడిగింది.

ఏయ్! నీకెందుకు ఇవన్నీ? నువ్వు కోతివి, కోతిలా ఉండు అంటూ గొడ్డలితో బెదిరించాడు.

కోతి మనసు బాధపడింది.

కొన్నిరోజులకు చెట్లు లేకపోవడంతో అడవిలో వేడి పెరిగిపోయింది. జంతువులకు గాలి పీల్చుకోవడానికి కష్టమైంది. కోతి ఒక గట్టి నిర్ణయానికి వచ్చింది.

అడవిలోని జంతువులు, పక్షులను పిలిచి ఒక సమావేశాన్ని ఏర్పాటు చేసింది. మనుషులు చెట్లను నరికేస్తు అడవిని నాశనం చేస్తున్నారు. మనం ఇలాగే ఉంటే.. త్వరలోనే మన జాతి మొత్తం అంతరించి పోతుంది. మనం బతకాలంటే మనుషులను అడవిలోకి రానివ్వకూడదు. దీనికోసం మనం ఒక ఉపాయం చేయాలి. మనుషులు నరికేసిన ప్రతి చోట మనం కొత్త మొక్కలు నాటాలి, అడవిని మళ్లీ పచ్చదనంతో నింపాలి. అప్పుడు మనకు స్వచ్ఛమైన గాలి, ఆహారం, వర్షాలు వస్తాయి. అలాగే, మనుషులు అడవిలోకి రాకుండా దట్టమైన ముళ్లకంపలను నాటాలి అని నిర్ణయించు కున్నాయి. నరికిన చోటల్లా విత్తనాలు చల్లి, మొక్కలు నాటాయి. కొద్ది రోజుల్లోనే అడవి మళ్లీ పచ్చని వనంగా మారింది.

కొన్ని రోజుల తర్వాత మనుషులు అడవికి వెళ్లారు. జంతువులన్నీ గుంపుగా వచ్చి వారి ముందు నిలబడ్డాయి.

“మనుషుల్లారా! మీ స్వార్థం కోసం మీరు చేసిన తప్పును, మేము సవరించుకున్నాం. ఈ చెట్లను మేమే నాటాం.. ఇకనైనా మారండి అని జంతువులు అన్నాయి.

ఆ రోజు నుంచి మనుషులు మారారు. తమ ఊరిలో చెట్లను నాటడం, పర్యావరణాన్ని కాపాడుకోవడం ప్రారంభించారు.


– నరాల భార్గవి
10వ తరగతి
జిపఉపా, బక్రిచెప్యాల
m : 9704171858
గైడ్ టీచర్ : వర్కోలు లక్ష్మయ్య
m : 97048 65816

# కాంతి - నీడలు - ప్రతిబింబాలు

## 1 నీడలు కదులుతాయి


శరీరావయవాలతోను, చేతులతోను రకరకాలుగా నీడలు ఏర్పడేలా చేయండి. నీడల నేర్పరచిన శరీర భాగాలను కదిపి వాటితో పాటుగా నీడలూ కదలటాన్ని గమనించమనండి.



## 2 కాంతి దూరం, కోణాన్ని బట్టి నీడ మారుతుంది

మనుషులు, స్తంభాలు చెట్లు మొ|| వాటి నీడలను రోజులోని వేరు వేరు సమయాల్లో పరిశీలించండి. నీడల ఆకారం, పరిమాణం మారుతుంది.

### రోజులో వేరు వేరు సమయాల్లో




ఏ సమయంలో నీడ పొడవుగా ఉంటుంది? ఏ సమయంలో పొట్టిగా ఉంది? ఎందుకు?

### కృత్రిమ కాంతితో ప్రయోగం

కాంతికి దగ్గరగా ఉంటే నీడ పెద్దగా ఉంటుంది.



కాంతికి దూరంగా ఉంటే నీడ చిన్నగా ఉంటుంది.




## 3 నీడలకు ఆకారం ఉంటుంది

గోడమీద గాని, నేలమీద గాని ఒకరి నీడ బాహ్యరేఖను గీయండి. ఇది వారి ఆకృతిని పోలి ఉందా? భిన్నంగా ఉందా? పరిశీలించండి?



### కాంతికి దగ్గరగా - దూరంగా, గోడకు దగ్గరగా - దూరంగా




### గమనించండి!

- ☛ నేను కదిలితే నా నీడ ఎందుకు కదులుతుంది?
- ☛ కాంతికి దగ్గరగా వెళ్ళితే నా నీడకు ఏమవుతుంది?
- ☛ కాంతి కోణం మారితే నీడ ఎలా మారుతుంది?




– శ్రీమతి మీనాస్వామినాథన్
'పిల్లలకు ఆటలు–పాటలు' పుస్తకం నుండి

సీరియల్-16

# బంగారు మర్రి

**(బాలలకోసం ఆధునిక సాహస నవల)**



(గత సంచిక తరువాయి...)

డ్రోన్ కెమేరాకు నాదర్‌గుల్‌లో మగ పులి శ్రీకృష్ణ మందిరం పక్క సందులో కనిపించింది. అది ఆకలితో ఉంది. కనిపించిన కోళ్లను, బాతుల్ని కూడా వదలకుండా తినసాగింది. కాట్రాజు తన పరివారంతో రావిర్యాల నుంచి నాదర్ గుల్ వైపు వెళ్లారు. డ్రోన్ కెమెరా మగపులిని వెంబడిస్తూనే ఉంది. అటవీశాఖ సిబ్బంది పెద్దపెద్ద స్క్రీన్‌ల మీద పులి సంచారం గమనిస్తున్నారు.

పులి కదలికలు గమనిస్తూనే ఉన్నారు. డ్రోన్ కెమెరా శబ్దాలకు పులి భయపడి అటు ఇటు పరిగెత్త సాగింది. డ్రోన్ శబ్దం పులికి అసాధారణంగా ఉంది. పులి సహజంగా వాటి పర్యావరణంలో వినే శబ్దాలకు అలవాటు పడతాయి. కానీ, డ్రోన్ శబ్దం వాటికి అసాధారణంగా, అనిశ్చితి, అపరిచితంగా ఉండటంతో భయంతో నలుదిక్కులా పరిగెత్తింది.

డ్రోన్ కెమెరాలో పులి కదలికలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. అది శ్రీకృష్ణ మందిరం చుట్టూతా ఉన్న సందుల్లో తిరగసాగింది. చింటూ ఇల్లు కూడా శ్రీకృష్ణ మందిరం సందులోనే ఉంది. పులి చింటూ వాళ్ళ ఇంటి పక్కన ఉన్న పశువుల కొట్టంలో లేగ దూడను అందుకోపోయింది. లేగ దూడ భయంతో అటూ ఇటూ పరిగెత్త సాగింది. ఇంతలో డ్రోన్ కెమెరా పులి మీదుగా పెద్ద శబ్దం చేస్తూ వెళ్ళింది. ఇదంతా స్క్రీన్ మీద ఫారెస్ట్ అధికారులు, ఇతర సిబ్బంది గమనిస్తూనే ఉన్నారు. కాట్రాజు, అతని బృందం శ్రీకృష్ణ మందిరం దగ్గరకు చేరుకున్నారు. అంతా చేతిలో ఆయుధాలతో సిద్ధంగా ఉన్నారు. పులి భయంకరంగా గాండ్రిస్తూ లేగదూడను వదిలి పరిగెత్తింది. కాట్రాజు పులిని చూసాడు. వెంటనే బృందంతో పులి వెంట పడ్డాడు. డ్రోన్ శబ్దానికి భయపడ్డ పులి పరిగెత్తి పక్కనే ఉన్న చింటూ ఇంటి పెరట్లోని దాన్యం స్టోర్ రూంలోకి దూరింది. ఇదంతా ఇంటి కిటికీ లోంచి గమనిస్తున్న చింటూ వంటింటి గది తలుపు తీసి తల బయటకు పెట్టి చూశాడు. పులి గాండ్రింపు స్టోర్ రూం లోంచి పెద్దగా వినిపించసాగింది. చింటూ తల్లిదండ్రులు ఇది గమనించి చింటూని వంటగది తలుపులు మూసి లోనికి రమ్మన్నారు. డ్రోన్ కెమేరా చింటూ ఇంటి చుట్టూ పెద్ద శబ్దం చేస్తూ తిరగసాగింది. పారెస్ట్ అధికారులు పెద్ద స్క్రీన్ మీద ఇదంతా గమనిస్తున్నారు. కాట్రాజు బృందం చింటూ ఇంటి ముందుకు చేరింది. కానీ పులి ఎటునుంచి దాడి చేస్తుందోనని వెంటనే గేటులోంచి లోనికి పోలేదు. టీవీ మీడియా ఇదంతా

ప్రత్యక్ష ప్రసారం చేయసాగింది. కాత్రాజు ధైర్యసాహసాలు చింటూకి గుర్తొచ్చాయి.

చింటూ వంటగది తలుపు తీసి ధైర్యంగా పెరట్లోని ధాన్యం నిలువ చేసే గదివైపు పరుగుతీసి గదితలుపులు మూసేశాడు. దాంతో పులి గదిలో బంధించబడింది. కాత్రాజు బృందం చింటూ ఇంటి పెరట్లోకి చేరింది. కాత్రాజుని చూసిన చింటూ "అంకుల్ యు ఆర్ మై ఫాన్. మీరు పులిని ధైర్యంగా ఎదుర్కొని బంధించటం టీవీలో చూశాను. యు ఆర్ గ్రేట్!" అన్నాడు. "అది సరే! మగ పులి మీ ఇంట్లోకి దూరింది. ఇక్కడేం చేస్తున్నావు!" కంగారుగా అడిగాడు కాత్రాజు. "పులి ఈ స్టోర్ రూంలో ఉంది అంకుల్!" అన్నాడు చింటూ.


తల్లిదండ్రులు రాంబాబు, పావని పరుగున బయటికి వచ్చారు. ఇదంతా డ్రోన్ కెమెరా పెద్ద పెద్ద స్క్రీన్‌ల మీద చూపెడుతూనే ఉంది. అన్ని టీవీ ఛానల్స్‌లో ప్రత్యక్షంగా అటవీ అధికారులతో పాటు ప్రభుత్వం ప్రజలు ఉత్కంఠతో గమనిస్తూనే ఉన్నారు చూస్తూనే ఉన్నారు. విషయం తెలుసుకున్న కాత్రాజు చింటూని ఎత్తుకొని ముద్దు పెట్టుకుని అభినందించాడు. చింటూ ధైర్య సాహసాలను ఫారెస్ట్ అధికారులందరూ కొనియాడారు. కాత్రాజు స్టోర్ రూమ్ కిటికీలోంచి పెద్దగా గాండ్రిస్తున్న పులిని చూసి పక్కనే ఉన్న నిదుణులతో మత్తుమందు బుల్లెట్లు పులిపై ప్రయోగించమని చెప్పాడు. వెంటనే ఒక నిపుణుడు వెళ్లి తన తుపాకీతో పులిని మత్తుమందు బుల్లెట్‌తో కాల్చాడు. పులి వెంటనే మత్తెక్కి పడుకుంది అటవీ సిబ్బంది పులిని బోనులోకి ఎక్కించారు. కాత్రాజుతో సహా ప్రజలందరూ పెద్దగా చప్పట్లు కొడుతూ చింటూ ని అభినందించారు. ఇదంతా టీవీలలో ప్రత్యక్షంగా చూస్తున్న చింటూ బడిలోని మాస్టారు, తోటి విద్యార్థులు చింటూ ధైర్య సాహసాల్ని మెచ్చుకున్నారు– ఆడపులిని ధైర్యంగా బంధించిన కాత్రాజుకు, మగ పులిని భయపడకుండా బంధించిన చింటూని ప్రభుత్వం తలో ఐదు లక్షలు బహుమతిగా అందించి ఘనంగా సత్కరించింది. అంతేకాదు, ధైర్యసాహసాల్ని ప్రదర్శించినందుకు కాత్రాజుకు ప్రమోషన్, చింటూకి చదువుకున్నంత వరకు ఉచిత విద్య అందిస్తామని ప్రభుత్వం తెలిపింది. బోనులో బంధించిన??

మగ పులిని వెంటనే వైద్య పరీక్షల కోసం పంపించారు. ఆ తర్వాత తన మిత్రుడు మగ పులిని వెతుక్కుంటూ వచ్చిన ఆడ పులి నీ అటవీ సిబ్బంది జాగ్రత్తగా అడవిలో వదిలారు. పులి నేరుగా బంగారు మర్రిని చేరుకుంది. అక్కడ ఎప్పటిలా సమావేశమైన మృగరాజు సింహం, ఎలుగుబంటి, ఏనుగు, కోతి పరుగున వెళ్లి ప్రేమతో, ఆనందంతో పులిరాజు శరీరాన్ని నాకాయి. ఆ వెంటనే తన మిత్రుడు పులి రాజుని క్షేమంగా అడవికి చేర్చినందుకు 'బంగారు మర్రి'కి జంతువులు, పక్షులు కృతజ్ఞతలు తెలుపుకున్నాయి.

(సమాప్తం)

– పైడిమర్రి రామకృష్ణ
m : 92475 64699

## వేమన పద్యం



కల్ల నిజములెల్ల గరళ కంఠుడెరుగు
నీరు పల్లమెరుగు నిజంగాను
తల్లి తానెరుగును తనయుని జన్మంబు
విశ్వదాభిరామ వినురవేమ!

తాత్పర్యం : నీరు పల్లమెరుగును.
సత్యము అసత్యము భగవంతుడు తెలుసుకొనును.
తనయుని పుట్టుక తల్లికి మాత్రమే తెలుసును.

కథ

# 200 సంవత్సరాల తర్వాత మానవ లోకం

అనగనగా ఒక పట్నంలో, డింపు అనే ఒక అమ్మాయి ఉండేది. ఈమె పుట్టిన తర్వాత 10 సంవత్సరాలకు ఈమెకి ఒక తమ్ముడు పుట్టాడు. ఆ తమ్ముడు పేరు చింపు. డింపుకి చదువు అంటే చాలా ఇష్టం డింపు ని వాళ్ళ తమ్ముడు చింపు చాలా బాగా చూసుకునేవాడు. డింపు కోసం తన ప్రాణం అయినా ఇచ్చేవాడు. డింపు చింపుల అమ్మానాన్న చిన్నప్పుడే రోడ్డు ప్రమాదంలో చనిపోవడం వల్ల, డింపు తమ్ముణ్ణి తన కొడుకు లాగా చూసుకునేది. చింపు కూడా డింపుని అక్కలోనే అమ్మని చూసుకున్నాడు, డింపు అమ్మానాన్న లేకున్నా వాళ్ళ కలలని తీర్చాలని అనుకుంది. డింపు కన్న కల నెరవేరడానికి ఎన్నో కష్టాలు పడి పడరాని పాట్లు పడి డాక్టర్ ఉద్యోగం సాధించింది. డింపుకి ఎప్పుడు ఒక కల చింపు ఒక పెద్ద సైంటిస్ట్ కావాలని. చింపుకి ఆకల నెరవేర్చడం ఒక కల. ఎన్నో రోజులకి సైంటిస్ట్ అయ్యే అవకాశం వచ్చింది. కొన్నింటిపై పరిశోధనలు చేస్తున్నాడు ఎంత చేసినా అసలు ప్రయోజనం లేదు. ఎన్నో ఆటంకులు ఎన్నో కష్టాలు. చిన్న వయసులోనే అమ్మ నాన్న చనిపోయిన అక్క అన్ని మంచి చెడులు చెప్పి పెంచింది. అమ్మ అవసరం వస్తే అమ్మలా, నాన్న అవసరం వస్తే నాన్నల, చింపుని తన కొడుకుల పెంచింది. వాళ్ల అమ్మ నాన్నలు రోడ్డు ప్రమాదంలో చనిపోయారు. అందుకని వాళ్ళ అమ్మానాన్నల ఆత్మ శాంతించాలని. ఒక ఆలోచన వేశాడు, ఆలోచన ఎలా ఉందంటే మానవులకి రోడ్డు ప్రమాదం జరగకుండా ఎంతో ఉపయోగపడుతుంది. అది ఏమిటంటేరా!

గాలిలో నడిచే బండి, అది చూస్తే చాలా బరువు తక్కువ, మన బరువుని కూడా మోసే విధంగా ఉంది. అది ఏ వయసు వాళ్ళయినా ఉపయోగించవచ్చు. చూడడానికి సహజ మోటార్ బండి లాగా ఉన్న దీని విలువ ఎన్నో రెట్లు పెరిగింది. దాన్ని తీసుకొచ్చాక అసలు ఊహించనంత డబ్బు గౌరవం చింపుకి వచ్చింది. అలాగే అమ్మానాన్నల ఆత్మ శాంతించింది. అక్క కన్న కల కూడా నెరవేరింది. అక్కకలే తన కలగా మార్చుకున్న చింపుకల కూడా నెరవేరింది.

– నూనె శ్రీనిధి
పదవ తరగతి, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల
ఏరుగట్ల. నిజామాబాద్ జిల్లా.
గైడ్ టీచర్ : ప్రవీణ్ శర్మ
m : 95535 76697



# నీచులకు ఆశ్రయమిస్తే...



భాగీరథి నది ఒడ్డున ఒక పెద్ద జువ్వి చెట్టు వుంది. దాని తొర్రలో 'జరద్గవము' అనే ముసలి గ్రద్ద నివాసం వుండేది. దానికి కళ్ళు కనిపించవు. ఆహారం సంపాదించుకోవడం కష్టమయ్యేది. ఆ చెట్టు పై వుండే రకరకాల పక్షులు తాము తెచ్చుకున్న ఆహారం నుంచి కొంత గ్రద్దకు పెట్టేవి.

ఒక రోజు దీర్ఘకర్ణము అను పిల్లి ఆ పక్షి పిల్లలను తినడానికి చప్పుడు చేయకుండా ఆ చెట్టు పైకి చేరింది. దానిని చూసి పక్షి పిల్లలు భయంతో అరిచాయి.

ఆ అరుపులు విన్న గ్రద్ద ఎవరో వచ్చారని గ్రహించి 'ఎవరక్కడ' అని గట్టిగా అరిచింది. పిల్లి భయపడింది. తప్పించుకునే అవకాశం లేదు అని వినయంగా 'అయ్యా నా పేరు దీర్ఘకర్ణుడు. మీ దర్శనం కోసం వచ్చాను' అన్నది. గ్రద్ద కోపంగా 'ఓ మార్జాలమా! వెంటనే యిక్కడి నుండి పారిపోలేదంటే చచ్చిపోతావు' అని బెదిరించింది.

పిల్లి గద్దతో 'పిల్లి జాతిలో పుట్టినా నేను ప్రతి రోజూ గంగానదిలో స్నానం చేసి, కేవలం శాఖాహారం తింటున్నాను. మాంసాహారం మానేసాను. చాంద్రాయణం వ్రతం చేస్తున్నాను. మీరు పెద్దలు. ధర్మాత్ములు. మీ దగ్గర ధర్మశాస్త్ర విశేషాలు తెలుసుకోవాలని వచ్చాను. నన్ను నమ్మండి' అన్నది.

గ్రద్ద పిల్లిని నమ్మింది. సరే నీ యిష్టం వచ్చినప్పుడు రావచ్చు, పోవచ్చు అన్నది. పిల్లి గ్రద్దతో స్నేహంగా ఉంటూ చివరికి తొర్రలోనే గ్రద్దతో వుండటం మొదలు పెట్టింది. కొన్ని రోజుల తర్వాత ప్రతిరోజు చెట్టు పైకి వెళ్ళి పక్షి పిల్లలను చంపి తొర్రలోకి తెచ్చుకుని తింటుండేది.

కొన్ని రోజుల తర్వాత తమ పిల్లలు కనిపించక పక్షులు కలవరపడ్డాయి. వెదకటం మొదలు పెట్టాయి. విషయం అర్థమై పిల్లి పారిపోయింది.

పిల్లల కోసం వెతుకుతూ తొర్ర వద్దకు వచ్చాయి. తొర్రలో పక్షుల ఎముకలు చూసి గ్రద్దయే తమ పిల్లలను చంపి తింటున్నదని అనుకున్నాయి. కోపంతో గ్రద్దను తమ ముక్కులతో, గోళ్లతో రక్కి రక్కి దానిని చంపేసాయి.

“చెడ్డ వాళ్ళకి ఆశ్రయమిచ్చి, స్నేహం చేస్తే చివరికి ప్రాణాలకే ముప్పు వస్తుందని” అనుకుంటూ గ్రద్ద ప్రాణాలు విడిచింది.

**సేకరణ: అమరావతి**




## తెలంగాణ చారిత్రక పర్యాటకం

# శాతవాహనుల కాలంలో దేవాలయాలు

శాతవాహనుల కాలం తెలంగాణ చరిత్రలో ఒక ముఖ్యమైన అధ్యాయం. సా.పూ.శ 1వ శతాబ్దం నుండి సా.శ. 2వ శతాబ్దం వరకు, వీరు దక్షిణ భారతంలో విస్తారమైన సామ్రాజ్యాన్ని స్థాపించారు. ఈ ప్రాంతం వీరి రాజకీయ, సాంస్కృతిక కార్యకలాపాలకు ముఖ్య కేంద్రంగా నిలిచింది. ఈ కాలంలో బౌద్ధమతంతో పాటు వైదిక, బ్రాహ్మణ మత సాంప్రదాయాలు కూడా అభివృద్ధి చెందాయి. ముఖ్యంగా దేవాలయ నిర్మాణ దశలోనే అభివృద్ధి చెందినట్లు పురావస్తు ఆధారాలు తెలియజేస్తున్నాయి. మౌర్యుల అనంతరం సా.పూ.శ. 2వ శతాబ్దలంలో తెలంగాణ ప్రాంతాన్ని శాతవాహనులకు పూర్వము పాలించిన స్థానిక రాజులు నరణ, గోబద, సమగోప, కంవాయస వంటి పేర్లు, కోటి లింగాల ప్రాంతంలో లభించిన నాణేలు తెలియజేస్తున్నాయి. వీరి తర్వాత కోటిలింగాల ప్రాంతాన్ని రాజధానిగా చేసుకొని పరిపాలన ప్రారంభించిన శాతవాహన వంశస్థాపకుడు చిముకుడు, తర్వాత శాతకర్ణి-1, హాలుడు, గౌతమీపుత్ర శాతకర్ణి, వాశిష్టీపుత్ర వులమావి, యజ్ఞశ్రీ, శాతకర్ణి ప్రముఖ పాలకులుగా నిలిచారు. వీరి కాలంలో కూడా వైదిక మతానికి విశేషమైన ప్రాధాన్యం లభించింది. నాగనిక నాణేఘడ్ శాసనం ప్రకారం అనేక యాగాలు నిర్వహించినట్లు, తర్వాత రోజులు అశ్వమేధ, రాజసూయ వంటి యాగాలు చేసినట్లు చరిత్ర చెబుతుంది. నాసిక్ గుహ శాసనంలో గౌతమీ పుత్ర శాతకర్ణిని శ్రీరాముడు, కేశవుడు, అర్జునుడు, భీమసేనుడు వంటి పురాణ పేర్లతో పోల్చడం నాటి మతపరమైన భావజాలానికి ప్రతీక. శాతవాహన రాజు హాలుడు రచించిన గాథాసప్తశతిలో చండిక, పశుపతి, గౌరి, రుద్రుడు, పార్వతి, లక్ష్మీ, నారాయణుడు వంటి దేవతలకు అంకితమైన దేవాలయాల ప్రస్తావనలు కన్పిస్తాయి. నేటి వనపర్తి జిల్లాలోని బ్రిడ్జి రంగాపూర్, సంగారెడ్డి జిల్లాలోని కొండాపూర్, నాగర్‌కర్నూలు జిల్లాలోని సోమశిల ప్రాంతాల్లో ఇటుకలతో నిర్మించిన దేవాలయ కట్టడాలు, పురావస్తు ఆధారాలను ఇవి తెలంగాణ ప్రాచీన దేవాలయ సంప్రదాయానికి తొలి చారిత్రక సాక్ష్యాలను అందిస్తున్నాయి. 1980 ప్రాంతంలో పురావస్తు త్రవ్వకాలలో కృష్ణానదికి అభిముఖంగా నిర్మించిన చతురస్రాకారపు దేవాలయం బ్రిడ్జి రంగాపూర్‌లో వెలుగు చూసింది. ఇటుకలతో నిర్మించిన ఈ కట్టడం బయటి కొలతలు సుమారు 13 × 13 అడుగులు, లోపలి కొలతలు 7.3 × 7.3 అడుగులతో సరళమైన అధిష్ఠానం కల దేవాలయం గోడలు, ఉపానం, పద్మజగతి, కుముదుకం వంటి అలంకార లక్షణాలు కన్పిస్తాయి. ఈ దేవాలయంలో ఉపయోగించిన పెద్ద ఇటుకలు సుమారు 18 × 10 అంగుళాల పొడవు వెడల్పులతో 4 అంగుళాల మందము పరిమాణంలో ఉన్నాయి. ఈ దేవాలయం సాధారణ చతురస్రాకారం గర్భగృహం, మధ్యలో భూమి ఉపరితలంలో శివలింగాన్ని ఏర్పాటు చేసిన గుంత ఆనవాళ్ళు ఈ ఆలయం శైవదేవాలయమని తెలుస్తుంది. దేవాలయ ప్రధాన ద్వారం కృష్ణానదికి సమీపంలో అభిముఖంగా ఉండటం, నదీవరదల కారణంగా దేవాలయ పై భాగాలు పూర్తిగా ఆనవాళ్ళను కోల్పోయినాయి. ఇక్కడ లభించిన నలుపు, ఎరుపు, ఎర్రని మెరుగు మట్టి పాత్రలు పురావస్తు ఆధారాలను అందిస్తున్నాయి. రంగాపూర్‌లోని ఈ దేవాలయం తెలుగు రాష్ట్రాల్లోనే కాకుండా, భారత దేశంలో ఇప్పటి వరకు గుర్తించబడిన ప్రాచీన శైవ దేవాలయాల్లో ఒకటిగా పరిగణించబడుతుంది. తెలంగాణా ప్రాంతపు దేవాలయ నిర్మాణ కళాపరిణామాన్ని అర్థం చేసుకోవడానికి పురావస్తు, చారిత్రక ప్రాముఖ్యతను గుర్తించాలి. అలాగే నాగర్ కర్నూలు జిల్లా కొల్హాపూర్ మండలంలోని సోమశిలలో శ్రీశైల డ్యాం నిర్మాణం కారణంగా ముంపు దేవాలయాల తరలింపు, మరియు పునర్నిర్మాణం కోసం పునాదులు త్రవ్వుతున్న సమయంలో 18×10×4 పొడవు, వెడల్పు, మందం అంగుళాలు గల ఇటుకలతో మరో చతురస్రాకార శైవ దేవాలయ గోడల ఆనవాళ్ళు లభించాయి. అదే విధంగా సంగారెడ్డి జిల్లా కొండాపూర్‌లో నిర్వహించిన పురావస్తు త్రవ్వకాల్లో శాతవాహన కాలంలో తెలంగాణ ప్రాంతంలో దేవాలయ నిర్మాణ సంప్రదాయానికి పునాది వేసిన కాలంగా, నిర్మాణంలో కూడా వివిధ నిర్మాణ పద్ధతులు ప్రయోగించబడినట్లు, ఇక్కడి పురావస్తు ఆనవాళ్ళు, ఈ ప్రాంతపు దేవాలయ వాస్తు శిల్ప పరిణామ క్రమాన్ని అర్థం చేసుకోవడానికి ఆధారాలను అందిస్తున్నాయి. నాటి నుండి వివిధ రాజవంశాల పాలనల్లో నేటి వరకు కూడా ఎంతో చారిత్రక నేపథ్యమున్న తెలంగాణ ప్రాంతంలో, సుమారు 500లకు పైగా దేవాలయాలు, అందులో 100కు పైగా చారిత్రక దేవాలయాలు గత కాలపు దేవాలయ శిల్ప కళలను మనకు తెలియజేస్తున్నాయి. ఇక్కడ చాళుక్యుల కాలంలో ఆరంభమైన పటిష్ఠమైన రాతితో కట్టిన దేవాలయ నిర్మాణాలు, ప్రత్యేకించి కాకతీయుల కాలంలో స్వర్ణయుగంగా వెలుగొందిదనే చెప్పాలి. ఎందుకంటే కాకతీయుల శిల్పకళా వైభవానికి ప్రతీకగా చెప్పుకొనే కట్టడాల జాబితాలో ప్రస్తుతానికి రెండు తెలుగు రాష్ట్రాలలో ఒకటిగా సగర్వంగా మన కళ్ళ ముందు నిలిచి వుంది. రామప్ప దేవాలయం ప్రత్యేకించి తెలంగాణ ప్రాచీన, చారిత్రక దేవాలయాల గూర్చి సమగ్ర సమాచారాన్ని అందించే పుస్తకాలు కొన్ని మాత్రమే ఉన్నాయి. దక్షిణ భారత దేశ శిల్పకళ - ఆలయాలు (Art & Architecture of South India), భారతదేశ శిల్పకళ - ఆలయాలు (Indian Art & Architecture), ఉమ్మడి ఆంధ్రప్రదేశ్, శిల్పకళ - ఆలయాలు (Art & Architecture) అనే పుస్తకాలలో తెలంగాణా దేవాలయాల గూర్చి ప్రాథమిక సంక్షిప్త సమాచారం ఉంది. అలాగే ప్రత్యేకించి తెలంగాణాను పరిపాలించిన రాజుల కాలంలో నిర్మించిన ఆయా కాలపు (చాళుక్యులు, కాకతీయ, తదితర) దేవాలయాలపై పుస్తకాలున్నాయి. ఇంకా ఉమ్మడి జిల్లాలకు సంబంధించినవి కొన్నింటిపైనే ప్రముఖ చరిత్రకారులు వ్రాసినవి అందుబాటులో ఉన్నాయి. అయితే 1972లో యం. రాధాక్రిష్ణశర్మగారు పరిశోధనాత్మకంగా వ్రాసిన Chalukya & Kakatiya, ఈ మధ్యన 2024లో ప్రముఖ స్థపతి ఈమని శివనాగిరెడ్డి గారు వ్రాసిన Temples of Telangana - Thorugh the Ages అనే పుస్తకాలలో తెలంగాణ ప్రాంతంలోని దేవాలయ ఆరంభ, పరిణామక్రమ, వికాసదశలు నాటి నుండి నేటి వరకు సాంకేతిక, చారిత్రక కోణంలో సమగ్ర సమాచారాన్ని అందిస్తున్నాయి. ఈ పుస్తకాన్ని వారసత్వ శాఖ, తెలంగాణ, తెలంగాణ ప్రభుత్వం ప్రచురించింది.

– దేశరాజు శ్యాంసుందర్‌రావు – స్థపతి
m : 9010051177

# మంటల్లో చల్లదనం



కొవ్వొత్తి మంట తాలూకు మధ్య భాగంలో చల్లగా ఉంటుందని చెబితే, బహుశా మీరు నమ్మరు. మంటలో వేలుపెట్టి చూస్తే చుర్రుమంటుందే తప్ప ఆ చల్లదనం తెలియదు. అది తెలుసు కోవాలంటే ఒక పద్ధతి ఉంది.

కొవ్వొత్తిలో మైనం నేరుగా మండుతుందని చాలా మంది అనుకుంటూ ఉంటారు. కాని అది సరికాదు. నిజానికి మైనం ఆవిరి అయి, ఆ ఆవిరి మండుతుంది. మైనం ఆవిరి అవడానికి వేడి కావాలి. అగ్గిపుల్ల గీసి, కొవ్వొత్తిని వెలిగించగానే వత్తి అంటుకుంటుంది. ఆ వేడి వల్ల దగ్గలో ఉన్న మైనం కరుగుతుంది. కరిగిన మైనం వత్తి తాలూకు పోగులలోనుంచి "కేశికాక్రియ" వల్ల పైకి లేస్తుంది. ఆ కరిగిన మైనం మండుతుంది. కొవ్వొత్తి మండటానికి ఇంత తతంగం ఉంది.

వత్తికీ మంటకీ మధ్య కొద్దిగా నల్లని ఖాళీస్థలం ఉండటం మీరు గమనించే ఉంటారు. ఈ స్థలంలో పైకి లేస్తున్న మైనం ఆవిరి మాత్రమే ఉంటుంది. ఆక్సిజన్ అందకపోవడం వల్ల ఆ ఆవిరి మండదు. ఆ ఆవిరి విస్తరించి, గాలిలోని ఆక్సిజన్‌తో కలిసి మండినప్పుడే మనకి మంట కనిపిస్తుంది. మంట వెలుపలి భాగాన ఆక్సిజన్ పుష్కలంగా లభించడం వల్ల మైనం ఆవిరి అంతా పూర్తిగా మండుతుంది. కాని మంట మధ్య భాగంలో తగినంత ఆక్సిజన్ లభించక పోవడం వల్ల అక్కడ ఆవిరి పూర్తిగా తగలబడక, కొంత మిగిలిపోతుంది. అలా తగలబడని ఆవిరే మసి రూపంలో బయటకి వస్తుంది. మంట మధ్యలో మైనం ఆవిరి పూర్తిగా దహనం కాక పోవడం వల్ల అక్కడ వేడి కాస్త తక్కువ. (మంట వెలుపలి భాగంతో పోలిస్తే మంట మధ్యలో వేడి తక్కువ అనే తప్ప, అక్కడ బొత్తిగా చల్లగా ఉంటుందని నా ఉద్దేశం కాదు.)

ఈ విషయాన్ని ప్రత్యక్షంగా చూడదలచుకుంటే మందులేని ఒక అగ్గిపుల్లని కొవ్వొత్తి మంటలో ఒకటి రెండు సెకనుల పాటు ఉంచి, తీసేసి చూడండి. ఆ పుల్ల రెండు చోట్ల బాగా కాలినట్లు, మధ్యలో కాలకుండా మిగిలి పోయినట్లూ కనిపిస్తుంది. మంట వెలుపలి అంచులు తగిలిన చోట పుల్ల బాగా కాలింది. మంట మధ్యలో

ఉన్న భాగం కాలకుండా మిగిలి పోయింది. ఇదే విషయాన్ని మరో లాగా కూడా చూడవచ్చు. పాత పోస్టుకార్డు తీసుకుని దానిని చటుక్కున వత్తికి సెంటీమీటరు ఎత్తులో పెట్టి, ఒక క్షణం ఉంచి, తీసేసి చూడు. కార్డు మీద నల్లగా కాలిన వలయమూ, ఆ వలయం మధ్యలో కాలకుండా మిగిలిపోయిన స్థలమూ కనిపిస్తాయి.

– డాక్టర్ మహీధర నళినీ మోహన్

'ప్రతి ఇంటా ప్రయోగశాల' నుండి

లఘు నాటిక



# ఆటవిడుపు

**పాత్రలు: విపిన్, అఖిల్, ప్రధానోపాధ్యాయులు, లలిత టీచర్, సలీమా, లహరి, జాన్సన్, రోహాన్**

## దృశ్యం- 1

(ఆరో తరగతి గదిలోకి ప్రధాన ఉపాధ్యాయులు, లలిత టీచర్ వచ్చారు)

పిల్లలు : గుడ్ మార్నింగ్ సార్... శుభోదయం టీచర్ (అందరూ నిలబడ్డారు)

ప్ర.ఉ.: పిల్లలూ మీరంతా మంచి నడవడిక కలిగి ఉండాలి. మంచి అలవాట్లను అలవరచుకోవాలి. క్రమశిక్షణతో మెలగాలి. చుట్టు పక్కల ఉండే పాఠశాలలన్నింటిలోనూ చదువులో ఆటలలో అన్ని పోటీలలో మీరు పోటీపడుతూ పాల్గొని మన పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలి. ఒకే నా

పిల్లలు : ఓ కే సార్

ప్ర.ఉ.: గుడ్ కారీ ఆన్ (బయటకు వెళ్తారు)

ల. టీచర్: అందరూ కూర్చోండి. పిల్లలు మానసికంగా శారీరకంగా ఎదగాలంటే ఆటలు ఆడటం ఎంతో అవసరం. ఆటల వల్ల ఉత్సాహంగా ఉంటూ చదువుపై దృష్టి పెడతారు. మీరంతా అలా ఉత్సాహంగా ఉండడానికి సిద్ధమేనా!

అందరూ : ఓ తప్పకుండా... బాగా చదువుతాం. ఆటలెన్నో ఆడుతాం... బడిపేరు నిలబెడతాం టీచర్

ల. టీచర్ : సరే మీకోసం ఒక శుభవార్తను తెచ్చాను. తెలుసా?

లహరి : మిటి టీచర్?

ల. టీచర్ : ఏమై ఉంటుంది? ఊహించి చెప్పండి

విపిన్ : బడికి సెలవా?

సలీమ: పిక్ నిక్!

ల. టీచర్ : కాదు

రోహాన్ : పండుగా?

జాన్సన్ : పార్టీ

ల. టీచర్ : ఊహూ అయితే నేనే చెప్పేస్తున్నా...

సుజాత: ప్లీజ్ టీచర్ చెప్పండి టీచర్

ల. టీచర్ : సరే సరే నేనే చెప్పేస్తున్న మీకందరికీ ఇష్టమైన ఆటల పోటీలు... స్పోర్ట్స్ డే సందర్భంగా మీకు వివిధ ఆటల్లో పోటీలు నిర్వహించబోతున్నారు"

అందరూ : హే ఆటల పోటీలు (అందరూ ఒక్కసారిగా లేచి చప్పట్లతో అరుస్తారు)

ల. టీచర్ : మూడు రోజులు ఆటలపోటీలు జరుగుతాయి గెలిచిన వారికి బహుమతులు ఇస్తారు. ఎక్కువ బహుమతులు వచ్చిన వారికి ఛాంపియన్ షిప్ ట్రోఫీ ఇస్తారు. ఐదవ తరగతి బాలబాలికలకు పరుగు పందాలు, ఖోఖో, హైజంప్ మొదలైన ఆటలున్నాయి.

మీరంతా ప్రాక్టీస్ చేసి రెడీగా ఉండండి.

(టీచర్ బోర్డు మీద రాస్తుంటే పిల్లలు మాట్లాడుకుంటారు.)

లహరి : ఆటలంటే అందరికీ మస్త్ ఇష్టం కదా!ఎప్పుడు ఆటలుంటే ఎంత బాగుంటది. విపిన్ : చదువు వుండాలే ఆటలు వుండాలే

సలీమ : కరెక్ట్ నీకు యే ఆట ఇష్టం

విపిన్ : క్రికెట్ నీకు

సలీమ : ఖో ఖో

ల. టీచర్ : (పిల్లల వైపు తిరిగి) రాసుకోకుండా ఏం మాట్లాడుతున్నారు?

సలీమ : సారీ టీచర్

ల. టీచర్ : సరే నాకు అర్థమైంది మీ మనసంతా ఆటలతో నిండి పోయింది. మీకు ఆట విడుపు కావాలి కదా

రోహన్ : అంటే?

ల. టీచర్ : మీరు రోజూ చేసే దానికి కొంచం భిన్నంగా మనకు నచ్చినట్లు సరదాగా గడిపే సమయం. సరే ఆటల గురించి మాట్లాడుకుందామా? కాదు మనం ఇక్కడే ఆటలు ఆడి చూపించాలి అది యే ఆటో మిగతా వారు చెప్పాలి ఒకే నా!

అందరూ : హే.. ఒకే టీచర్

ల. టీచర్ : సరే రెండు గ్రూపులుగా కూర్చోండి మధ్యలో చూపించడానికి స్థలం వదలండి

(నిమిషంలో బెంచీలు జరిపి రెండు గ్రూప్స్ కూర్చొంటాయి)

ల. టీచర్ : ఇది అఖిల్ గ్రూప్ ఇది సలీమా గ్రూప్ ఒక్కొక్క గ్రూప్ నుంచి ఒకరు కానీ మీ గ్రూప్ వాళ్ళు ఇద్దరు ముగ్గురు వచ్చి యాక్షన్‌లో చూపాలి అది కొత్త, పాత యే ఆటైన కావచ్చు ఎవరు గుర్తు పడితే వారికి పాయింట్. ముందు అఖిల్ గ్రూప్

అఖిల్ గ్రూప్ :(గుస గుసలాడి ఒకరి కళ్ళు మూస్తారు మిగతావారు దాక్కుంటారు.)

సలీమ గ్రూప్: దాగుడుమూతలాట

ల. టీచర్ : కరెక్ట్ పాయింట్ మీకు ఇప్పుడు సలీమ గ్రూప్

సలీమ గ్రూప్: (గుస గుసలాడి ఇద్దరు కూర్చొంటారు కారమ్స్ అడచుతున్నట్లు)

అఖిల్ గ్రూప్ : కారం బోర్డ్

లలిత టీచర్: పాయింట్ మీకు ఒకే సలీమ గ్రూప్

సలీమ గ్రూప్: (గుస గుసలాడి ఒకరు వైట్ లిఫ్ట్ చేస్తూన్నట్లు చూపిస్తారు)

అఖిల్ గ్రూప్ : వెయిట్ లిఫ్ట్

ల. టీచర్ : ఎంత కరెక్ట్‌గా చెబుతున్నారో ఇద్దరికీ ఈక్వల్ పాయింట్స్ అఖిల్ గ్రూప్

అఖిల్ గ్రూప్ : (ఒకరటు ఒకరిటు కూర్చొని చుట్టూ ఇంకొకరు తిరుగుతారు)

సలీమ గ్రూప్: మాకు తెలుసు ఖోఖో (ఎగురుతారు)

ల. టీచర్ : సూపర్

సలీమ గ్రూప్: (బాట్ కొడుతూ ఒకరు అవతల బాల్ పొంటుకి రుద్ది బౌల్ చేస్తూ ఒకరు)

అఖిల్ గ్రూప్ : హే మా ఫేవరేట్ గేమ్ క్రికెట్

ల. టీచర్ : ఇది చెప్పకుండా ఉంటారా

అఖిల్ గ్రూప్ : (ఇద్దరు ఎదురెదురుగా కూర్చొని క్వీన్స్ పెడుతుంటారు కదుపుతుంటారు)

సలీమ గ్రూప్: చెస్ అదే చదరంగం

ల. టీచర్ : ఇద్దరూ విన్నర్స్ కానీ నేను నేను చూపించింది కరెక్ట్‌గా చెప్పిన వారు ఫైనల్ విన్నర్స్.. పిల్లలూ రండి ఒకరు కళ్ళు మూయండి అని చేత్తో ఎదురుగా ఒక్కొక్కరినీ చూపిస్తూ ఈ ఆటకొక పాటుంది అది ఎవరు చెప్తే వాళ్ళే విన్నర్స్.

సలీమ గ్రూప్ : వీరి వీరి గుమ్మడి పండు వీరి పేరేమి ఇదే కదా టీచర్

లలిత టీచర్ : అదే కానీ పూర్తిగా చెప్పాలి

సలీమ గ్రూప్ : వీరి వీరి గుమ్మడి పండు వీరి పేరేమి పిల్లి వచ్చే ఎలుకా భద్రం – పిల్లి వచ్చే ఎలుకా భద్రం (ఆలోచిస్తుంది)

అఖిల్ గ్రూప్ : టీచర్ మేం చెప్తాం

ల. టీచర్ : చెప్పండి

అఖిల్ గ్రూప్ : వీరి వీరి గుమ్మడి పండు వీరి పేరేమి
పిల్లి వచ్చే ఎలుకా భద్రం
ఎక్కడి దొంగలు అక్కడే
గప్ చుప్ సాంబార్ బుడ్డీ...

అందరూ : వీరి వీరి గుమ్మడి పండు వీరి పేరేమి
పిల్లి వచ్చే ఎలుకా భద్రం
ఎక్కడి దొంగలు అక్కడే
గప్ చుప్ సాంబార్ బుడ్డీ...
(చప్పట్లు కొడుతూ పెద్దగా నవ్వుతారు)

ల. టీచర్ : ఆటల గురించి బాగానే చెప్పారు కానీ అసలు ఆటల వల్ల శారీరక దారుఢ్యం కలుగుతుంది. మీలో క్రీడా నైపుణ్యం పెరుగుతుంది. మీ తప్పుల్ని అధిగమించగలుగుతారు. ఏకాగ్రత పెరుగుతుంది. అందువల్ల అందరూ ఆటలలో పాల్గొనాలి. ఆటలు శ్రద్ధగా ఆడాలి! గెలిచినా ఓడినా ముందు పాల్గొనటం ముఖ్యం. (గంట మోగుతుంది) మీ వంతు ప్రయత్నం చేయండి సరేనా All the best. మీకు ఇష్ట మైన ఆటలు ఆడాక చదువు కూడా అంతే ఇష్టంగా చదవండి సరేనా.

అందరూ : ఒకే టీచర్ థాంక్యూ టీచర్ (అందరూ కలిసి చేతులు కలిపి పైకి ఎత్తుతారు)


ల. టీచర్ : ఆటవిడుపు నచ్చిందా

అందరూ : ఎస్ టీచర్ బై టీచర్

– డా. సమ్మెట విజయ
m: 99898 20215

# తండ్రి నీల్స్ బోర్ సిద్ధాంతాన్ని సవరించినకుమారుడు ఆగే బోర్

అప్పటి పాలకుల కోరికననుసరించి భూకేంద్రక సిద్ధాంతాన్ని రుజువు చేయాలని టైకోబ్రాహి పరిశీలనలు క్రోడీకరించడం ప్రారంభించారు. సూర్యగ్రహణం, చంద్రగ్రహణం వంటి సందర్భాలలో మాత్రమే కొన్ని పరిశీలనలు వీలుపడతాయి, కనుక ఆయన కొన్ని సంవత్సరాలు పాటు ఈ పని చేశారు అయితే చివరి దశలో విశ్లేషించక ముందే మరణించారు. తర్వాత ఆయన శిష్యుడు కెప్లర్ ఈ వివరాలను తీసుకుని సూర్య కేంద్రక సిద్ధాంతాన్ని ప్రతిపాదించి, సైన్స్ పరంగా భూకేంద్రక సిద్ధాంతానికి చరమగీతం పాడారు. ప్రకృతి కొనసాగే విధానం అంటే సైన్సు పద్ధతి అనేది పాలకుల ఇష్టం లేదా అంతవరకు నమ్మిన విశ్వాసాలాధారంగా ఉండదు, నడవదు. కొత్త పరిశీలనలు వచ్చి చేరినప్పుడు, అంతవరకు రాజ్యం చేసిన సిద్ధాంతాలు తప్పుకోవచ్చు లేదా మార్పుకు గురి కావచ్చు. శాస్త్రీయ అభినివేశం లేదా సైంటిఫిక్ టెంపర్ మెంట్ అంటే ఇదే. తండ్రి కొడుకులు నీల్స్ బోర్ (Niels Bohr), ఆగే బోర్ (Aage Bohr) మధ్య సంభవించిన ఇలాంటి సందర్భమొకటి ఫిజిక్స్ చరిత్రలో తారసపడుతుంది. తండ్రి నీల్స్ బోర్ (1885-1962) 1922లో నోబెల్ బహుమతి వస్తే,కుమారుడు ఆగే బోర్ (1922-2019)కు 1975లో అదే బహుమతి లభించింది. ఇద్దరికీ ఫిజిక్స్ లోనే ఈ బహుమతులు తండ్రికి 37 ఏళ్ల వయసులో రాగా,కుమారుడికి 53 సం.కు లభించాయి. పదార్థం అంతర్గత నిర్మాణం సంబంధించి శోధన మొదలైనప్పుడు అందుబాటులోకి వచ్చిన సమాచారం ఆధారంగా వివరించడానికి ప్రయత్నాలు జరిగాయి. ఇందులో భాగంగానే సిద్ధాంతాలు తయారయ్యాయి. జార్జ్ గమావ్ (George Gamow) అణుకేంద్రక నిర్మాణం గురించి వివరించడానికి 'లిక్విడ్ డ్రాప్ మోడల్' (the liquid drop model)ను 1929లో ప్రతిపాదించారు. న్యూక్లియర్ రియాక్షన్స్ అలాగే న్యూక్లియర్ ఫిషన్ జరిగే విధానం వివరించడానికి అణువుగా నీల్స్ బోర్, జాన్ ఆర్చీ బాల్డ్ వీలర్ (John Archibald Wheeler) ఈ మోడల్‌ను మరింతగా మెరుగుపరచి, విస్తృతం చేశారు. తర్వాత శాస్త్రవేత్త కార్ల్ ఫ్రిడ్రిచ్ వోన్ వైజ్ శాకర్ (Carl Friedrich von Weizscker) ఈ మోడల్ ఆధారంగా అణుకేంద్రకంలోని బంధనశక్తి కూడా లెక్కగట్టారు. మరి ఈ లిక్విడ్ డ్రాప్ మోడల్ వివరించిందేమిటి? ఈ సిద్ధాంతం ప్రకారం దీనిని నొక్కడానికి సాధ్యం కాదు, దాని మొత్తం ద్రవ్యరాశి దాదాపు స్థిరంగా ఉంటుంది. దాని ఆకారం కూడా మంచి వక్రతతో కూడి ఉంటుందని కూడా భావించారు. అలాగే అణుకేంద్రకంలో దృఢంగా, స్వల్పదూరంలో మాత్రమే పని చేసే బలాలుంటాయనీ; దానితో ద్రవ బిందువులోని అణువుల్లాగా అవి అమరి ఉంటాయని ప్రతిపాదించారు. అలాగే అణుకేంద్రకంలో ఉండే వాటి మధ్య చర్యలు తక్కువగా ఉండి, అణు ఉపరితలం తలతన్యతతో ఉండేలా దోహద పడతాయి. ఈ లిక్విడ్ డ్రాప్ మోడల్ కొంతకాలం భౌతిక శాస్త్రాన్ని, తద్వారా రసాయన శాస్త్ర ప్రగతిని బాగానే నిర్దేశించింది.




నీల్స్ బోర్‌కు నోబెల్ బహుమతి వచ్చిన 1922లో జన్మించిన ఆగే బోర్ మహాశయుడు బెన్ మెటల్ సన్ (Ben Mottelson), జేమ్స్ రెయిన్ వాటర్ (James Rainwater)తో కలిసి గమనించిన విషయాలు అప్పటికి స్థిరపడిన లిక్విడ్ డ్రాప్ భావనలను విభేదించడం ప్రారంభించాయి. 1940 నుంచి మొదలైన ఈ సందేహాలు 1950 ప్రాంతానికి మరో దిశలో ప్రయాణించడం మొదలయ్యాయి. అణుకేంద్రకం లోని వెలుపలి ప్రాంతంలో ఉన్న ప్రోటాన్లు, న్యూట్రాన్లు ప్రత్యేక మార్గాలలో ప్రవర్తించడం వల్ల, అలాగే వాటి లోపల వాటితో చర్య జరపడం వల్ల ఉపరితలం వక్రత స్థిరంగా ఉండకుండా, మార్పుకు లోనవు తుందని ప్రతిపాదించారు. లిక్విడ్ డ్రాప్ మోడల్ ధర్మాలను కొన్ని కలిగి ఉంటూనే, తన కర్పర స్వభావం (orbital behavior) కూడా కలిగి ప్రవర్తిస్తుందని కూడా ఈ ముగ్గురు శాస్త్రవేత్తలు వివరించారు. అంటే అణుకేంద్రక ఉపరితలం పూర్తి వక్రతతో కాకుండా అస్థిరతతో మార్పులకు లోనవుతూ డైనమిక్‌గా ఉంటుందని భావం. ఈ విషయాలు ప్రతిపాదించిన ఆగే బోర్, బెన్ మెటల్ సన్, జేమ్స్ రెయిన్ వాటర్ ముగ్గురు శాస్త్రవేత్తల బృందానికి 1975లో భౌతిక శాస్త్రంలో నోబెల్ బహుమతి లభించింది. ఇప్పటికీ ఈ సిద్ధాంతమే న్యూక్లియర్ ఫిజిక్స్‌ను అర్థం చేసుకోవడానికి, వివిధ న్యూక్లియర్ చర్యలను వివరించడానికి కీలకంగా ఉపయోగ పడుతోంది.

తండ్రి నీల్స్ బోర్ 1936లో ప్రతిపాదించిన సిద్ధాంతాన్ని ఆగే బోర్ పూర్తిగా విభేదించలేదు; కానీ, క్వాంటం ఫిజిక్స్ ధర్మాలను కూడా జోడించి ఆ భావనను మరింత మెరుగుపరిచారు. ఈ సవరింపులతో అణుకేంద్రక స్థిరత్వాన్ని వివరించడమే కాకుండా; ఆరిపోయే నక్షత్రాలలో అంతర్గతంగా జరిగే భారయుత మూలకాలు విచ్ఛిన్నమయ్యే రీతిని కూడా విడమర్చి చెప్పినట్టయ్యింది. నిజానికి కొన్నికుటుంబాలకు చెందిన రెండు తరాల శాస్త్రవేత్తల కృషి కారణంగానే ఈ భౌతికశాస్త్ర విభాగం అభివృద్ధి చెందిందని చెప్పడం అతిశయోక్తి కాదు.

- డా. నాగసూరి వేణుగోపాల్
ఆకాశవాణి విశ్రాంత సంచాలకులు,
ప్రముఖ సైన్స్ రచయిత
m : 9440732 392

# ధాన్యాలు సిరిధాన్యాలు ఎండుఫలాలు

సంపూర్ణ ఆరోగ్యానికి
సంపూర్ణ ఆహారం



సిరిధాన్యాలు తింటే
ఆరోగ్యం,
శక్తి, దీర్ఘాయువు
మన సొంతం



## సిరిధాన్యాల ప్రయోజనాలు

- పీచు పదార్థం ఎక్కువ
- జీర్ణక్రియకు మంచిది
- బరువు తగ్గడానికి సహాయపడుతుంది
- చెడు కొలెస్ట్రాల్ తగ్గిస్తుంది
- రక్తంలో చక్కెర నియంత్రిస్తుంది
- అనేక ఔషద గుణాలు కలిగి ఉంటుంది

## సిరిధాన్యాలు ఎందుకు తినాలి?

- అతి పురాతనమైన ఆహార పదార్థాలు
- బియ్యం, గోధుమల కన్నా ఎక్కువ పోషకాలతో నిండి వుంటాయి.
- శరీరానికి శక్తినిస్తాయి.
- వ్యాధులను దూరం చేస్తాయి.
- ప్రకృతి ప్రసాదించిన ఆరోగ్య భాండాగారం

## సిరి ధాన్యాలు 9 రకాలు : పేర్లు & శాస్త్రీయ నామాలు

1 కొర్రలు
Foxtail Millet

Setaria italica

2 ఊదలు
Barnyard Millet

Echinochloa esculenta

3 అరికెలు
Kodo Millet

Paspalum Scrobiculatum

4 సామలు
Little Millet

Panicum sumatrense

5 అండు కొర్రలు
(గోధుమ టాప్ మిల్లెట్)
Brown Top Millet

Urochloa ramosa

6 సజ్జలు
Pearl Millet

Pennisetum glaucum

7 రాగులు
Finger Millet

Eleusine coracana


8 వారిగ/వరగులు
Proso Millet

panicum miliaceum

9 జొన్నలు
Sorghum

sorghum bicolor

## ఎండు ఫలాలు



## సమతుల్య ఆహారం - ఆరోగ్యానికి బాట

నిత్యం వ్యాయామం

యోగ ధ్యానం



తగినంత నీరు

సరైన నిద్ర

– 'ఆరోగ్యం-విజ్ఞానం' పుస్తకం నుండి..





# కానుగ చెట్టు

హాయ్ బాలలు బాగున్నారా! పంద్రాగస్టున జండా వందనం బాగా చేశారా.. ఆటలాడి పాటలు పాడారు కదూ!.. బహుమతులు కూడా గెలుపొందారనుకుంట! ప్రతి నెల బాల చెలిమి చదువుతున్నారు కదా! ఈ నెల బాల చెలిమి సంచికలో మనం “కానుగ చెట్టు” గురించి ఎన్నో విషయాలు తెలుసుకుందాం. సరేనా! మనకు అన్ని కాలాలతో పాటు అన్ని చోట్ల కనిపించే సాధారణమైన చెట్టు కానుగ చెట్టు. ఇది “ఫాబెసి”కుటుంబానికి చెందిన ఒక ముఖ్యమైన వృక్షం. ఇది పర్యావరణ రక్షణకు మరియు ఆయుర్వేద పరంగా బహుళ ప్రయోజనాలు కలిగిన చెట్టు. దీనిని సంస్కృతంలో “కరంజ” అని కూడా పిలుస్తారు. కానుగ చెట్టు మధ్యస్థ పరిమాణంలో పెరిగుతూ పచ్చగా కనిపించే కానుగ చెట్టు ఎల్లప్పుడూ అందరికీ చల్లని నీడనిస్తుంది. కానుగ వృక్షాలు ఆకర్షణీయమైన తెలుపు, నీలం, గులాబీ రంగుల మిశ్రమంతో పూలు విరగబూస్తాయి. కానుగ గింజల నుండి నూనెతో పాటు బయో డీజిల్ లభిస్తుంది. కానుగ “పాపిలినేసియా”కుటుంబానికి చెందిన తరువు. దీని శాస్త్రీయ నామం “పొంగమియా పిన్నాట”. ఎన్నో ఔషధ గుణాలు కలిగిన కానుగ చెట్టు ఆసియాలోని అత్యుష్ణ మండల ప్రాంతంలో ఎక్కువగా పెరుగుతుంది. మన ఇండియాతో పాటు చైనా, జపాన్, మలేషియా, ఆస్ట్రేలియా, పసిఫిక్ ప్రాంతాలలో కానుగ వృక్షాలు బాగా పెరుగుతాయి. వీటిని రోడ్ల కిరుప్రక్కల నీడ కోసం బాగా పెంచుతారు. ఖాళీగా ఉన్న వీధులలో కూడా సులువుగా వీటిని పెంచవచ్చు. తక్కువ కాలవ్యవదిలో వేగంగా పెరుగుతూ మనుషులతో పాటు పక్షులకు, జంతువులకు మంచి నీడనిస్తాయి. దీని ఆకులు ఎల్లప్పుడూ ఆకుపచ్చగా, ఆకర్షణీయంగా కనిపిస్తాయి. కానుగ కాయలు బాదం గింజలను పోలి ఉంటాయి. సంతానం కోసం కానుగ చెట్లను పూజించినట్లు మహాభారతంలో ప్రస్తావన ఉంది.


### కానుగ చెట్టు వల్ల ఉపయోగాలు:

ప్రకృతి పరంగా పచ్చగా కనిపించే కానుగ చెట్ల వల్ల ఎన్నో ఉపయోగాలున్నాయి.


- కానుగ ఆకుల రసంతో కడుపు నొప్పి, డయేరియా, దగ్గు తదితర సమస్యలను నివారించవచ్చు.
- కానుగ వేళ్లను పేస్ట్‌గా మార్చి చర్మంపై రాస్తే గడ్డలు పగిలి ఉపశమనం కలుగుతుంది.
- కానుగ గింజలను దిర్శన గింజలను కలిపి చూర్ణం చేసి తేనె, నెయ్యి కలిపి వాడితే అన్ని రకాల ఉపయోగం ఉంటుంది.
- కానుగ గింజల చూర్ణంలో తేనే, నెయ్యి, పంచదార కలిపి తీసుకుంటే రక్తస్రావం ఆగిపోతుంది.
- కానుగ ఆకులు బియ్యం గంజిలో వేసి తాగితే వాంతులు తగ్గుతాయి.
- కానుగ చెట్టు పుల్లలతో వేప పుల్లల మాదిరిగా దంతాలు కూడా తోముకోవచ్చు. దీనితో దంత ధావనం జరిగి నాలుక మీద ఉండే రుచి గ్రహక గ్రంధులు ఉద్దీపన చెందుతాయి.
- కానుగ ఆకులను మెత్తగా నూరి నువ్వుల నూనె, వేయించిన గోధుమపిండి, ఆవు నెయ్యి మిశ్రమం వాడితే సుఖ విరోచన మౌతుంది.
- మొండి చర్మవ్యాధులు, పుండ్లు మరియు గజ్జి నివారణకు కానుగ నూనె బాగా ఉపయోగపడుతుంది.
- కీళ్ల నొప్పులు, వాత నొప్పులను తగ్గించడానికి కానుగ ఆకులు, నూనెను బాగా ఉపయోగిస్తారు.
- కానుగ చెట్ల పువ్వులను రక్తస్రావం, ఫైల్స్ చికిత్సకు ఉపయోగిస్తారు.

ఇవండీ... కానుగ చెట్టు విశేషాలు. పిల్లలూ... మరెందుకు ఆలస్యం? మీరు కూడా బడిలో పుట్టినరోజు సందర్భంగా ఒక కానుగ మొక్కైనా నాటండి. సకల జీవరాశికి నీడనివ్వండి.

– కోమటిరెడ్డి బుచ్చిరెడ్డి
m : 9441561655



టీచర్స్ డే
కథ : జుగాష్విలి
బొమ్మలు:
గోపి : తాతయ్యా! రేపు మా స్కూల్లో టీచర్స్ డే సెలబ్రేషన్స్ ఉన్నాయి.
తాతయ్య : అంటే ఏమిటి గోపి?
గోపి : భారతరత్న డా॥ సర్వేపల్లి రాధాకృష్ణన్ పుట్టిన రోజు సెప్టెంబర్ 5న ప్రతి సంవత్సరం ఉపాధ్యాయ దినోత్సవం జరుపుకుంటున్నాం. ఆ రోజు మా టీచర్స్‌ను సన్మానించి, పూజిస్తాం.
తాతయ్య : అలాగా! సర్వేపల్లి రాధాకృష్ణన్ గురించి ఏం తెలుసు? ఆ రోజే టీచర్స్ డే ఎందుకు జరుపుకుంటున్నారు.
గోపి : రాధాకృష్ణన్ మన రెండవ రాష్ట్రపతి. మంచి ఉపాధ్యాయుడు. ఆ గౌరవంతోనే తన పుట్టిన రోజున ఈ గురు పూజోత్సవాలు.
తాతయ్య : అంతేకాదు. డా. సర్వేపల్లి గొప్ప తత్వవేత్త. విద్యావేత్త. విద్యను ఉద్యోగ సాధనంగానే కాకుండా సమాజాన్ని తీర్చిదిద్దే శక్తిగా చూసారు.
గోపి : ఆయన గొప్ప రచయిత అని మా సార్ చెప్పారు.
తాతయ్య : అవును. ముఖ్యంగా భారతీయ సంస్కృతి, మానవ విలువలు, ఆధ్యాత్మిక జీవితం గురించి రాసారు. ఆయన పుస్తకాలు మనిషి ఎలా ఆలోచించాలి, ఎలా జీవించాలి అనే ప్రశ్నలకు సమాధానాలు వెతుకుతాయి.
గోపి : ఏం పుస్తకాలు రాసారు తాతయ్యా?
తాతయ్య : ఇండియన్ ఫిలాసఫీ, ద హిందూ వ్యూ ఆఫ్ వెస్టన్ థాట్, రికవరీ ఆఫ్ ఫెయిత్ వంటి అనేక పుస్తకాలు రాసారు. ఆదర్శవాదం, నైతికతా, విశ్వాసాలు, వివిధ భావనలు, ఆలోచనా ధోరణులు, మనిషి అంతరంగ విలువలు గురించి తన రచనల్లో చర్చించారు.
Recovery of Faith
Indian Philosophy


తాతయ్య : ఇంతకీ రేపు మీ స్కూల్లో ఏం చేస్తున్నారు?
గోపి : ప్రేయర్ కాగానే రాధాకృష్ణణ్ గురించి, టీచర్స్ డే గురించి అతిధులు ప్రసంగిస్తారు. పాటలు, కవితా పఠనం, నృత్యాలు ఉంటాయి. తర్వాత టీచర్స్‌ను పూలదండలతో సత్కరించి బహుమతులు యిస్తాం. మాకు చాక్లెట్స్, బిస్కట్స్ పంచుతారు.
తాతయ్య : మరి... నువ్వేం చేయబోతున్నావ్?
గోపి : పూల బోకే యిస్తాను. ఫ్రూట్స్ తీసుకెళ్తాను. ప్రజంటేషన్ ఏమివ్వాలో తెలియడం లేదు. రవి,కుమార్, శేషు చాలా ఖరీదైన బహుమతులు తెస్తున్నారట.
తాతయ్య : ఖరీదైన బహుమతుల కంటే టీచర్స్ పట్ల ప్రేమ, గౌరవం, కృతజ్ఞత, మీలోని సృజనాత్మకత వారిని సంతోషపెడతాయి.
గోపి : నేనేం చేస్తే బావుంటుందో చెప్పు తాతయ్యా.
తాతయ్య : బొకేలు కొనడం కాదు. మన పెరట్లోని పూలతో నువ్వే చెయ్యి. పూసలు, ముత్యాలు, చెమికిలు అంటించు. గ్రీటింగ్ కార్డూ నీ చేతి రాతతో నువ్వే చెయ్యి.
గోపి : ఐడియా చెప్పు తాతయ్యా.
తాతయ్య : మంచి రంగు పేపరు బోర్డు మీద చెట్టు బొమ్మ గీసి, ఆకుల మధ్య హార్ట్ షేప్‌లో రంగుల పేపర్లను కట్‌చేసి అంటించు వాటి మీద ప్రేమ, జ్ఞానం, సహనం, ప్రోత్సాహం వంటి పదాలు రాయి. కాండంలో మాస్టారి చిత్రం గీయి. కింద మా భవిష్యత్తుకు మార్గదర్శి మీరే.. మీకు ధన్యవాదాలు అని రాసి సంతకం చెయ్. ఇలాంటివెన్నో చేయొచ్చురా అబ్బాయ్.
గోపి : థాంక్యూ... థాంక్యూ తాతయ్యా!

స్పోర్ట్స్

# వీసా సంక్షోభం నుంచి విజయ శిఖరానికి




చదరంగం ప్రపంచంలో భారత సంతతికి చెందిన ఇద్దరు బాలమేధావులు సరికొత్త చరిత్ర సృష్టించారు. 17 ఏళ్ల శ్రేయస్ రాయల్, 11 ఏళ్ల బోధనా శివానందన్ 2026 బ్రిటిష్ చెస్ ఛాంపియన్‌షిప్‌లో వరుసగా ఓపెన్, మహిళల టైటిళ్లను గెలుచుకొని బ్రిటన్‌లో అత్యంత పిన్న వయస్కులైన ఛాంపియన్లుగా నిలిచారు. బెంగళూరులో జన్మించిన శ్రేయస్ మూడేళ్ల వయసులో కుటుంబంతో కలిసి బ్రిటన్‌కు వెళ్లాడు. 2018లో అతని తండ్రి ఉద్యోగ వీసా గడువు ముగియడంతో కుటుంబం బ్రిటన్‌ను విడిచి వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. అయితే శ్రేయస్‌లోని అసాధారణ చెస్ ప్రతిభను గుర్తించిన బ్రిటిష్ ప్రభుత్వం, కుటుంబం అక్కడే కొనసాగేందుకు అనుమతించింది. ఒకప్పుడు దేశం నుంచి వెళ్లిపోవాల్సి వస్తుందేమోనని ఆందోళన చెందిన ఆ బాలుడే నేడు బ్రిటిష్ చెస్ ఛాంపియన్‌గా ఎదగడం విశేషం. 2024లో కేవలం 15 ఏళ్ల వయసులో బ్రిటన్ చరిత్రలో అత్యంత పిన్న వయస్కుడైన గ్రాండ్‌మాస్టర్‌గా శ్రేయస్ రికార్డు నెలకొల్పాడు. తాజాగా జరిగిన బ్రిటిష్ ఛాంపియన్‌షిప్‌లో తొమ్మిది రౌండ్లలో 7.5 పాయింట్లు సాధించి, ఓటమి ఎరుగని ఆటగాడిగా టైటిల్‌ను కైవసం చేసుకున్నాడు.

భారతీయ మూలాలున్న లండన్ బాలిక బోధనా శివానందన్ కూడా అద్భుతమైన ఆటతీరుతో ఆకట్టుకుంది. మహిళల విభాగంలో ర్యాపిడ్ ప్లేఆఫ్‌లో త్రిషా కన్యామరాలను ఓడించి, కేవలం 11 ఏళ్లకే బ్రిటిష్ మహిళల చెస్ ఛాంపియన్‌గా నిలిచింది. ప్రధాన పోటీలో గ్రాండ్ మాస్టర్ అమీత్ ఘాసీపై ఆమె సాధించిన విజయం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. శ్రేయస్, బోధనా విజయాలు వయసు ప్రతిభకు అడ్డుకాదని నిరూపిస్తున్నాయి. పట్టుదల, క్రమశిక్షణ, కుటుంబ ప్రోత్సాహం ఉంటే చిన్నారులు ప్రపంచస్థాయి విజయాలను అందుకోగలరని వీరిద్దరూ చాటిచెప్పారు. భారతీయ మూలాలను గర్వంగా నిలబెడుతూ, బ్రిటిష్ చెస్‌కు సరికొత్త భవిష్యత్తును అందిస్తున్న ఈ బాలమేధావులు నేటి చిన్నారులకు నిజమైన స్ఫూర్తిదాయక నక్షత్రాలు.

– బాలచెలిమి డెస్క్





రచన, బొమ్మలు : చింతల శ్రీనివాస్ గుప్త
నిజామాబాద్, M: 94400 37125



కథ

# గురువుకు దండం




రెండు రోజుల నుండి రాజు స్కూల్లో మౌనంగా ఉంటున్నాడు. ముఖమంతా పీక్కుపోయింది. ఎందుకురా అలా ఉన్నావని దోస్తులు అడిగితే ఏమీ లేదన్నట్లుగా సమాధానం. బడిలో విద్యార్థులంతా 25వ తేది నాడు టూర్‌కు వెళ్తున్నామని ముచ్చట్లలో మునిగిపోయారు. రాజు ఎప్పుడు కూడా హుషారుగా ఉండేవాడు. ఈ రెండు రోజుల నుండే నవ్వడం మానేశాడు. సాయంత్రం బడి వదలగానే పిల్లలంతా ఆడుకుంటూ పాడుకుంటూ ఇళ్లకు వెళ్లిపోయారు. రాజు మౌనంగా ఇంటికి చేరుకున్నాడు.

రాజు వాళ్ళ నాన్న బయట నుండి ఇంట్లోకి రాగానే. "నాన్న మా బడిలో టూర్‌కు వెళ్తున్నారు". అని చెప్పి. హెచ్.ఎమ్. సార్ డబ్బులు తీసుకురమ్మన్నాడు.

అని చెప్పగానే "టూర్ వద్దు ఏమొద్దు ఈ సంవత్సరం వర్షాలు లేక పంటలు పోయినయి" అని చెప్పి మళ్ళీ వెంటనే వాళ్ళ నాన్న బయటికి వెళ్ళిపోయాడు.

రెండు రోజుల నుండి రాజు అన్నం కూడా తినడం లేదు. తినమని వాళ్ళ అమ్మ బ్రతిమిలాడింది. అన్నం ముట్టుకోలేదు. తన క్లాస్ వాళ్ళందరూ వెళ్తున్నారు. తాను ఒక్కడినే వెళ్లడం లేదని రాజుకు దిగులు. వాళ్ల బడిలో తెలుగు బోధించేది కరుణాకర్ సార్. పిల్లలంతా ఆయన చుట్టే ఎప్పుడు ఉంటారు. పిల్లలందరికీ ఆయనంటే ఇష్టం. రాజును దగ్గరకు పిలిచి ఏమిటని? అట్లా ఎందుకు ఉన్నావని అడిగేసరికి కళ్లలో కన్నీళ్ళే వస్తున్నాయి. సరే నీ బాధ అర్థమైంది. ఇక ఊరుకోవోయ్

రాజు నేను ఉన్నాను కదా... ఆ డబ్బు నేనే ఇస్తాను. సరేనా... "నువ్వు టూర్‌కు వచ్చేద్దువులే" అని భుజం తట్టాడు.

రాజు వాళ్ళ తరగతిలో కూడా అందరూ కలిసి ప్రతి ఒక్కరు 100 రూపాయలు రాజు కోసం తీసుకురావాలని అనుకున్నారు. ఆ క్లాసులో 20 మంది వరకు విద్యార్థులు ఉన్నారు. రాజును ఎలాగైనా తీసుకెళ్లుదాం అనుకున్నారు.

ఇంటికి రాగానే రాజు వాళ్ళ అమ్మ తన కొడుకుని చూసుకొని, తిండి తినక బక్క చిక్కిపోయినవు కొడకా అని ఏడ్చుకుంటూ రెండు వేల రూపాయలను ఊళ్లో బదులుగా తెచ్చాను. మళ్లీ నెల రోజుల్లో ఇస్తానని చెప్పి తెచ్చాను. ఏదైనా కూలి పనికి పోయి అప్పు తీర్చేస్తాను.

నువ్వు మాత్రం ఇక టూర్‌కు వెళ్లొచ్చు కొడకా అని ఆ రెండు వేలు చేతిలో పెట్టింది. అందరి పిల్లల లెక్క సంతోషంగా ఉండు. నువ్వు అన్నం తినకపోతే నేను తింటానా? అంటూ తల్లి ఏడ్చింది. తల్లి ప్రేమను చూసి రాజు కూడా ఏడ్చాడు. అప్పుడు అన్నం వడ్డించగానే తిన్నాడు.

బస్సు ఉదయం ఆరు గంటలకే బళ్ళోకి వచ్చింది. ఒక్కొక్కరుగా బస్సు ఎక్కి సీట్లలో కూర్చున్నారు. రాజు ఇంకా రాలేదని అందరూ ఎదిరి చూస్తున్నారు. రాజు దూరం నుండి నడుచుకుంటూ బ్యాగ్ భుజాన వేసుకుని వస్తున్నాడు. అందరి ముఖాల్లో వెలుగులు నిండాయి.

బస్సు స్టార్ట్ అయింది. పిల్లలకేరింతలు, పాటలు ప్రారంభమయ్యాయి.

మొదటిరోజు నాగార్జునసాగర్, నాగార్జునకొండ, విద్యుత్ ఉత్పత్తి కేంద్రం రెండో రోజు కొలనుపాక జైన దేవాలయం, వేయి స్తంభాల గుడి, రామప్ప మూడో రోజు కూడా ప్రాముఖ్యత

కలిగిన ప్రదేశాలను దర్శించారు.

కరుణాకర్ సార్ టూర్‌కి వెళ్లే ముందే చెప్పాడు నోట్బుక్, పెన్ను తెచ్చుకుని అన్ని అంశాలు జాగ్రత్తగా రాసుకోమని ఆ తరువాత వ్యాసరచన, క్విజ్ పోటీలు నిర్వహిస్తానని చెప్పాడు. ఆసక్తి ఉన్నవాళ్లు నోట్స్‌లో రాసుకున్నారు.

స్కూల్‌కు వచ్చిన మూడు రోజుల తర్వాత ఆ రెండు పోటీలను సార్ నిర్వహించాడు. రెండు పోటీల్లో కూడా రాజు ప్రథమంగా నిలిచి బహుమతి గెలుచుకున్నాడు. ప్రతి శనివారం కరుణాకర్ సార్ క్విజ్ నిర్వహిస్తుంటాడు. పిల్లలంతా శనివారం ఎప్పుడొస్తుందా అని ఎదిరి చూస్తుంటారు.

రాజు రాష్ట్రంలో ఎక్కడ క్విజ్ పోటీ నిర్వహించినా ఆ పోటీలో తప్పక పాల్గొంటాడు. పాఠశాల లైబ్రరీలో ఉన్న ఎన్నెన్నో పుస్తకాలను చదివి జనరల్ నాలెడ్జ్ ప్రశ్నలు రాసుకునే వాడు.

జిల్లాస్థాయిలో కమలమ్మ స్మారక క్విజ్ పోటీలు ఉన్నాయని కరుణాకర్ సార్ రాజును పిలిచి వెళ్లి పాల్గొనమని చెప్పాడు. సరే సార్ అని నల్లగొండకు వెళ్లి పోటీలో పాల్గొన్నాడు. ఐదువేల రూపాయల ప్రథమ బహుమతి కూడా గెలుచుకున్నాడు. రాష్ట్రస్థాయిలో మరొక క్విజ్ పోటీలో పాల్గొని ఆరువేల రూపాయలు గెలుచుకున్నాడు. రాజు తను గెలుపొంది తెచ్చుకున్న డబ్బులో రెండు వేల రూపాయలు తీసుకుని తనకు ఇష్టమైన జి. కె. బుక్స్, స్టోరీ బుక్స్, విజ్ఞాన సంబంధమైన పుస్తకాలు కొనుక్కుని ఇంటికి వచ్చాడు. మిగిలిన డబ్బులు వాళ్ల అమ్మ చేతిలో పెట్టాడు.

అమ్మ ముఖంలో కొండంత సంతోషాన్ని చూశాడు. కొడుకుని చూసి తల్లి గర్వపడింది.

రాజు తను చదువుకున్న స్కూలు ముందు నుంచే కార్లో, వాళ్ళ ఇంటికి వెళ్తున్నాడు. తాను చదువుకున్న రోజులన్నింటినీ గుర్తుతెచ్చుకున్నాడు. ప్రతి శనివారం బడిలో నిర్వహించే క్విజ్ పోటీలు, బాలసభలు గుర్తొచ్చాయి. ఎంతోమంది జీవితాలను తీర్చిదిద్దిన కరుణాకర్ సార్ అంటే ఆనాటి పిల్లలకే కాదు, ఊరందరూ ఇష్టపడేవాళ్లు.

ఇప్పుడు రాజు ఊరు గర్వపడే పెద్ద ఆఫీసర్ అయ్యాడు.

రాజు ఇంట్లోవాళ్ళ అమ్మ నాన్నల ఫోటోలతో పాటు తన గురువు కరుణాకర్ సార్ ఫోటో కూడా ఉంది.

– పెరుమాళ్ళ ఆనంద్
m : 9985389506



# పదాల మేడ-4




| | | | | | |
|---|---|---|---|---|---|
| 1 | | | 5 | | |
| 3 | | | 2 | | 12 |
| 4 | 6 | 8 | | | |
| | | | | 9 | |
| 7 | | | | | |
| 11 | | | | 10 | |

**అడ్డం:**

1) ఎండాకాలం (5)
2) సీతారాముల సంతానంలో ఒకరు (3)
3) శునకం.. వాడుక భాషలో (2)
4) భూమి (3)
9) పంటను రక్షించే గోడ (2)
10) గొంతు (2)
11) నూనె తయారీ యంత్రం (3)



**నిలువు:**

1) తెల్లవారుజాము (3)
5) కాలం నిరంతరం సాగిపోయే ప్రక్రియ (4)
6) అమృతం (2), 7) మోసం (2)
8) కాంతివంతంగా మెరవటం (4)
9) ముల్లు (3)
12) వినికిడి లోపం.. తలకిందులుగా (3)

– మాదారపు వాణిశ్రీ
హన్మకొండ
m : 9247286668

# స్నేహం కోసం

## బోరిస్ జకోదర్



ఒకానొక సముద్రంలో ఒక చిన్న ఎండ్రకాయ నివసిస్తూ ఉండేది. ఆ సముద్రాన్ని అందరూ 'నీలి సముద్రం' అని పిలిచేవారు. కాని ఎండ్రకాయకు మాత్రం సముద్రం ఎప్పుడూ బూడిద రంగులోనే కనిపించేది. అందరూ నీలి సముద్రం అని ఎందుకు పిలుస్తున్నారో అర్థమయ్యేది కాదు. ఈ చిన్న ఎండ్రకాయకు కవచం ఉండేది. కాదు.



"ఎలాగైనా ఓ కవచం సంపాదించుకో. అది నిన్ను కాపాడుతుంది" చెప్పింది మామ ఎండ్రకాయ.

మామ చెప్పినట్లు ఎండ్రకాయ కవచం కోసం ఎంతో ప్రయత్నించి చివరికి ఒకటి సంపాదించింది. కాని తనకి సముద్రం బూడిద రంగులో కనిపిస్తుందని దిగులుగా ఉండేది. డాల్ఫిన్ వచ్చి "నీవు ఒంటరిగా వున్నావు కాబట్టి నీకు సముద్రం బూడిద రంగులో కనిపిస్తుంది. నిజమైన స్నేహితుడ్ని సంపాదించుకోగలిగితే, సముద్రం నీకూ నీలంగా కనిపిస్తుంది. అప్పుడు నీవు ఆనందంగా వుంటావు" అంది.

ఎండ్రకాయ స్నేహితుని కోసం వేట మొదలెట్టింది. కొన్ని చేపలయితే ఎండ్రకాయని అసలు పట్టించుకోలేదు. కొన్ని సముద్రజీవులు ఎండ్రకాయని తినేయాలని చూశాయి. వెతికి వెతికి చివరికి నిరాశ చెందింది. ఎండ్రకాయకి ఇంతలో ఎవరో బాధతో పాట పాడుతున్నట్లు వినిపించింది. తిరిగిచూస్తే అందమైన ఎర్రటి సముద్రపు రోజా కనపడింది. ఎండ్రకాయ తనని పరిచయం చేసుకుని, ఎందుకు బాధగా వున్నావని అడిగింది.

రోజా ఇలా అంది, "నాకు సముద్రం బూడిదవర్ణంలో కనిపిస్తుంది. అది నీలంగా కనిపించాలంటే ఓ నిజమైన స్నేహితుడు కావాలి".

ఎండ్రకాయ కూడా తన కథంతా చెప్పింది. తర్వాత రోజాని తన వీపుపై ఎక్కించుకుంది. ఇద్దరూ కలిసి స్నేహితుల కోసం వెతకసాగారు.

‘స్కార్‌లెట్ సిటీ’ అనే సముద్రంలో స్నేహితులు దొరుకుతారని చెప్పింది రోజా. సరేనని అక్కడికి ప్రయాణం ప్రారంభించారు. రోజా, ఎండ్రకాయ వీపు మీద కూర్చుని సముద్రం అంతా చూస్తూ, కేరింతలు కొడుతూ ఆనందించింది. దారిలో వాళ్ళకి మామ ఎండ్రకాయ కనిపించింది.

స్కార్‌లెట్ సిటీకి వెళ్ళే దారిలో ‘మిస్ట్రస్ సి’ అనే ఆక్టోపస్ ఉంది. అది ఎన్నో ఎండ్రకాయల్ని తినేసింది, జాగ్రత్త అని చెప్పింది. స్కార్‌లెట్ సిటీ అనేది ఏడవ సముద్రం. ఆరు సముద్రాలు దాటిన తర్వాతే దాన్ని చేరుతామని చెప్పింది మామ ఎండ్రకాయ.

“సరే, ధన్యవాదాలు” అంది చిన్న ఎండ్రకాయ.

అలా ఎండ్రకాయ, రోజా ఆరు సముద్రాలూ దాటాయి. దారిలో ఒకరి జీవితంలో సంగతులు మరొకరితో పంచుకున్నారు, నవ్వుకున్నారు, తిట్టుకున్నారు, కొట్టుకున్నారు. జాగ్రత్తగా ప్రవేశించారు. అలా ప్రయాణించారు. చివరికి ఏడవ సముద్రంలోకి ‘మిస్ట్రస్ సి’ ఆక్టోపస్ వీళ్ళను చూసింది. తన పొడవాటి తొండాలతో వీళ్ళను బంధించింది. రోజా తన నోటిని తెరచి వరసగా పదునైన బాణాలను సంధించింది. అవి గుచ్చుకొని ఆక్టోపస్ బాధతో విలవిలలాడుతూ, అక్కడ నుండి పారిపోయింది.

“నాకు ఏ స్నేహితుడు అక్కర్లేదు నువ్వు తప్ప” అన్న మాటలు ఎండ్రకాయ, రోజా నోటి నుండి ఒకేసారి ఊడిపడ్డాయి.

ఆ తర్వాత చూస్తే, అప్పుడు వాళ్ళకు సముద్రం అంతా నీలంగా కనిపించింది.

వాళ్ళు ఇప్పటికీ నిజమైన స్నేహితులుగా, కష్టసుఖాలు పంచుకుంటూ ఆనందంగా జీవిస్తున్నారు.

చిన్నారులూ! మీ నిజమైన స్నేహితుల పేర్లు చెప్పండి.

స్వేచ్ఛానువాదం : **అనిల్ బత్తుల**
m : 81792 73971
ఇంగ్లిష్ : ది లిటిల్ స్పారో
రచయిత : మాక్సిం గోర్కి
ఇంగ్లీష్ అనువాదం : రాబర్ట్ డాగ్లిష్

## సామెతలు

- అగ్గి చూపితే వెన్న అడక్కుండా కరిగిపోతుంది.
- ఆ గొడ్డు మంచిదయితే ఆ ఊళ్ళోనే అమ్ముడు పోతుంది.
- ఇవ్వాళ గుర్రాన్ని ఎక్కడవెందుకు? రేపు గాడిదనెక్కడమెందుకు?
- ఎముకలేని నాలుక ఏమైనా పలుకుతుంది.
- ఏరు దాటే వరకు ఎంగన్న ఏరు దాటక సింగన్న.
- ఓపని వారికి వద్దన్న వారే తల్లిదండ్రులు.
- కందెన వేయని బందకి కావలసినంత సంగీతం.
- కాలం పోతుంది మాట నిలుస్తుంది.
- కీడెంచి మేలెంచాలి.
- కుండల దుమ్ము రోకళ్లతో దులిపినట్లు.

– బాలచెలిమి డెస్క్

## అదిగో అదిగో మా బడి!




అదిగో అదిగో మా బడి
విజ్ఞానాన్ని పంచే గుడి!
పచ్చని చెట్లతో ప్రహరీ,
చదువుల పంటల రాబడి!

బడి గంట మోగిందో సరి,
గుండెల్లో ఒకే అలజడి!
పోదాం పదా పద సరాసరి
యూనిఫాంతో మన విధి!


గురువులే మాకు వారధి,
విజ్ఞానానికి తొలి ఒరవడి!
చదువులతో పాటు నేర్పే,
పాటలు, ఆటలు, కబడ్డీ!

అమ్మ జ్ఞాపకాలతో పాటుగా,
జీవితాంతం నిలుచును
మా బడి!

– వెల్మజాల నర్సింహ
m : 9867839147

కథ

# ఊహించని విజయం



రామాపురం అనే ఊరిలో లక్ష్మణ్ అనే అబ్బాయి ఉండేవాడు. లక్ష్మణ్ తల్లిదండ్రులు కూలి, పనులు చేసుకుంటూ లక్ష్మణ్‌ను చదివించేవారు. అలా చూస్తూ చూస్తూనే లక్ష్మణ్ 8వ తరగతి రానే వచ్చిండు. తల్లిదండ్రులు లక్ష్మణ్‌ను పిలిచి - నువ్వు ఇప్పుడు 8వ తరగతి చదువుతున్నావు. నువ్వు బాగా చదువకపోతే ఇక నిన్ను చదివించడం అనేది ఉండదు అన్నారు. దీనిని మనసులో ఉంచుకొని దాని గురించే ఆలోచిస్తూ చదివేవాడు. అలా సగం ఆ ఆలోచన ఇటు చదువు. రెండింటిని భరించలేక పోయాడు. దాని వలన తను 8వ తరగతిలో కూడా సరిగ్గా చదవలేదు. కొన్ని రోజుల తరువాత లక్ష్మణ్ తండ్రి ఒక స్మార్ట్‌ఫోన్ కొనుకున్నాడు. లక్ష్మణ్ తన తోటి వారు చదువుతుండడం చూసి తను కూడా చదవాలని గట్టిగా అనుకున్నాడు. ఇంట్లోనే ఎలా చదవాలని ఆలోచించాడు. అప్పుడే తనకు ఒక ఆలోచన తట్టింది. ఫోన్‌లో కూడా పాఠాలుంటాయని నాన్న కొత్త ఫోనులో తన తరగతి పాఠాలు పెట్టుకుని ఆ సంవత్సరం మొత్తం విన్నాడు. అలా ఆ సంవత్సరం పూర్తి అయ్యాక ఎండాకాలం సెలవులు వచ్చాయి.

లక్ష్మణ్ ఒక రోజు తన మిత్రులతో రోడ్డుపై ఆడుతుండగా ఒక కరపత్రం చూసాడు. ఆ కరపత్రంలో ఈ సంవత్సరం 9వ తరగతి పిల్లలకు విజ్ఞాన పోటీలు నిర్వహించబడుతాయి అని ఉంది. దీన్ని చూసి లక్ష్మణ్ తన తల్లిదండ్రులను నేను ఇందులో పాల్గొంటానని అన్నాడు. కాని తల్లిదండ్రులు 9వ తరగతి చదువలేదు కదా ఈ పోటీలో పాల్గొని ఏం లాభం అన్నారు. కాని లక్ష్మణ్ నాన్నగారి ఫోన్‌లో పాఠాలు విన్నది తన తల్లిదండ్రులకు తెలియదు. కాని లక్ష్మణ్ చాలా మారాం చేసేసరికి ఆ పోటీ పట్టికలో పేరు రాయించారు. అలా పోటీలో పాల్గొనే రోజు రానే వచ్చింది. లక్ష్మణ్ తల్లిదండ్రులకు తను చివరి దాకా కొనసాగుతాడనే నమ్మకం కూడా లేదు. కాని లక్ష్మణ్ ధైర్యంగా అన్ని ప్రశ్నలకు సమాధానం ఇచ్చాడు. తరువాతి రోజు పోటీదారులను రామాపురం ప్రధాన కార్యాలయానికి పిలిచారు. అక్కడ పోటీ రిజల్టును చెబుతారు. అందుకోసం లక్ష్మణ్ మరియు తల్లిదండ్రులు అక్కడికి వెళ్లారు. వెళ్లగానే ముందు లక్ష్మణ్‌ను వేదిక పైకి పిలిచి తన గురించి చెప్పమన్నారు. తల్లిదండ్రులకు ఏమి జరుగుతుందో అర్థం కాలేదు. లక్ష్మణ్ తన గురించి మాట్లాడాడు.


ఆ తరువాత ఊరి సర్పంచ్ గారు వేదికపైకి వచ్చారు. చదువు గొప్పతనం గురించి మాట్లాడారు. సర్పంచ్ గారు లక్ష్మణ్ తల్లితండ్రులను వేదిక పైకి పిలిచి వారిని సత్కరించి ఈ విజ్ఞాన పోటీలో లక్ష్మణ్ మొదటి స్థానంలో నిలిచాడు అని చెప్పారు.

దానిని విన్నాక లక్ష్మణ్ తల్లిదండ్రులు ఆశ్చర్యానికి గురి అయ్యారు. వారికి ఏమి మాట్లాడాలో అర్థం కాలేదు. అప్పుడు లక్ష్మణ్ ముందుకు వచ్చి తను పాఠశాలలో చదువుకోక పోయినా తన నాన్నగారి ఫోనులో పాఠాలు పెట్టుకొని తన తల్లిదండ్రులు వ్యవసాయానికి వెళ్లినప్పుడు ఒక్కడే కూర్చొని - రోజు 4 నుంచి 5 గంటలు చదివేవాడిని అని చెప్పాడు. లక్ష్మణ్ తన జీవితాన్నే తీర్చిదిద్దే 10వ తరగతి చదివి ఉత్తీర్ణుడయ్యాడు.

**(బాలచెలిమి జాతీయ పోటీ కథలు-2025, 'పిల్లలు రాసిన పిల్లల కథలు-1'లో న్యాయనిర్ణేతలు ఎంపిక చేసిన ఉత్తమ కథ)**

**- సింహాచలం అమిత్ సూర్య**
9వ తరగతి, శ్రీ చైతన్య పాఠశాల,
వేములవాడ, రాజన్న సిరిసిల్ల జిల్లా.

# జలియన్ వాలా బాగ్ దురంతానికి కదిలిపోయిన బాల భగత్‌సింగ్




రౌలట్ చట్టానికి నిరసనగా జలియన్ వాలా బాగ్‌లో వేలాది మంది సమావేశం అయ్యారు వారి మీద జనరల్ డయ్యర్ మర ఫిరంగులతో కాల్పులు జరిపాడు. వందలాది మందిని ఆ సంఘటనతో దేశమంతా గగ్గోలెత్తింది పొట్టన పెట్టుకున్నాడు. ఎందరో గాయపడ్డారు.

ఆ మరునాడు బాల భగత్‌సింగ్ ఉదయమే పాఠశాలకు బయలు దేరాడు. జలియన్ వాలా బాగ్‌లో జరిగిన దారుణ మారణ కాండ గురించి ఇంట్లో చర్చించుకోవడం విన్నాడు. మనసు అలకల్లోలం అయింది. పాఠశాలకు వెళ్ళాలని అనిపించ లేదు. దారి మార్చి జలియన్ వాలా బాగ్‌కి వెళ్ళాడు. అక్కడి దృశ్యం చూసే సరికి భగత్‌సింగ్ హృదయం బాధతో విలవిల లాడింది. చిరిగిన గుడ్డలు, రక్తపు మరకలు, గోడలకు తుపాకీ గుళ్ళ రంధ్రాలు. అక్కడ ఎక్కువసేపు ఉండలేకపోయాడు. ఇంటికి వచ్చే సరికి బాగా ఆలస్యం అయింది. ఇంట్లో అందరూ కంగారుగా ఉన్నారు. ఇంటికి వచ్చిన భగత్‌సింగ్ ముఖం వాడిపోయి ఉంది.

'అన్నా! ఇంత ఆలస్యం అయిందేమిటి? ఇంట్లో అందరూ నీ కోసం కంగారు. పడుతున్నారు.' అంది అతని చెల్లెలు అమృత.

'ఏమి తెచ్చానో చూడు!' అన్నాడు భగత్ సింగ్.

'ఏమి తెచ్చావ్? చూపించు' అంది అమృత.

భగత్ జేబులోంచి ఎర్రటి సీసాను బయటికి తీశాడు.

'చూశావా? ఇందులో జలియన్ వాలాబాగ్ లోని మట్టి ఉంది. నెత్తురుతో తడిసిన మట్టి ఇది. నిరాయుధులైన మన దేశీయులను తెల్ల వాళ్ళు హతమార్చారు ఎంత మంది మరణించి ఉంటారో తెలియదు' అని అన్నాడు. అక్కడ ఏమి చూశాడో, ఏది విన్నాడో అది అంతా తడబడుతూ చెప్పాడు భగత్. ఆ రోజు ఆహారం ముట్టలేదు. తోటలో నుండి చాలా పూలు తెచ్చి ఆ సీసాను అలంకరించాడు. దానికి ప్రణమిల్లాడు. లోలోపల ఏవేవో గొణుక్కున్నాడు. మనసులోనే ఒక నిశ్చయం చేసుకున్నాడు.

చాలా రోజుల వరకు ఆ సీసాకి భక్తికుసుమాలు సమర్పించాడు భగత్. ఆహుతి అయిన ఆత్మల రక్తంతో భగత్ సింగ్‌కి సన్నిహిత సంబంధం ఏర్పడింది. అందుకే తాను కూడా విప్లవకారులకు నాయకుడై ఆత్మ బలి దానం చేశాడు.

– 'బాల కథా సౌరభం' నుండి...



చరిత్ర పాఠాలు-18

# వేయిన్నర సంవత్సరాల నాటి ఆర్థిక పరిస్థితులు

## విష్ణుకుండుల కాలం

విష్ణుకుండుల నాటి గ్రామాల్లో స్వయంసమృద్ధమైన ఆర్థిక వ్యవస్థ ఉండేది. అంటే, వ్యవసాయదారులు, వివిధ వృత్తుల ప్రజలు ఒకరిపై ఒకరు ఆధారపడి బతికేవారు. రాజులు వ్యవసాయాభివృద్ధికై చర్యలు తీసుకొన్నారు. బ్రాహ్మణులకు అగ్రహారాలతో పాటు, ఆ గ్రామంలో సాగు చేస్తున్న రైతులను, కొంత మంది దాసీ దాస జనాలను దానం చేశారు. రుతువుల గురించి పరిజ్ఞానం ఉన్న బ్రాహ్మణులు ఈ సేవకుల సహాయంతో వ్యవసాయ విస్తృతి చేశారు. అలా కొత్త భూములు సాగులోకి వచ్చాయి. విష్ణుకుండులు వ్యవసాయ బావులను, చెరువులను అనేకం తవ్వించారని వారి శాసనాలు తెలుపుతున్నాయి. వాటి ద్వారా మాగాణి పంటలు కూడా పండేవి. ఆనాడు భూమిని నివర్తనాల్లో కొలిచేవారు.

విష్ణుకుండులు రాజ్యంలో స్వదేశీ, విదేశీ వర్తక వాణిజ్యాలు కూడా కొనసాగాయి. వారి నాణేలు తెలంగాణలోని ఏలేశ్వరం, ఫణిగిరి, భువనగిరి, సుల్తానాబాద్ (పెద్దపల్లి జిల్లా)లో, ఆంధ్రలోని బొజ్జన్నకొండ, యలమంచిలి (విశాఖపట్నం జిల్లా)లలో, మహారాష్ట్ర లోని నాసిక్, ఖానాపూర్, నాగపూర్ లో, మధ్యప్రదేశ్లోని బ్రహ్మగిరి తదితర ప్రదేశాల్లో దొరికాయి. కాబట్టి ఈ ప్రాంతాల్లో వారి కాలంలో స్వదేశీ వర్తకం జరిగిందని చెప్పొచ్చు. శాలంకాయనుల నుంచి వేంగిని, కళింగుల నుంచి వారి రాజ్యాన్ని ఆక్రమించిన తరువాత విష్ణుకుండుల విదేశీ వాణిజ్యం విస్తరించింది. కోస్తాంధ్రలో వారివి ఎక్కువ నాణేలు దొరకడం, వాటిపై ఓడ గుర్తు ఉండటం, రెండో మాధవవర్మకు త్రిసముద్రాధిపతి అనే బిరుదు ఉండటం వారి కాలపు విదేశీ వాణిజ్య ప్రాముఖ్యాన్ని సూచిస్తున్నాయి. మోటుపల్లి, కోడూరు మొదలైన తూర్పు తీర పట్టణాల నుంచి బర్మా, సయాం, కంబోడియా, చైనా, జపాన్, సిలోన్, సుమత్రా, జావా, బోర్నియో, మలయా, ఆరకాన్ మొదలైన తూర్పు దేశాలతో, ఈజిప్ట్, రోమ్, గ్రీస్ మొదలైన పశ్చిమ దేశాలతో విదేశీ వాణిజ్యం జరిగేది.

కృష్ణానది పైన ఉన్న వాడపల్లి, బెజవాడ, అమరావతి, మోటుపల్లి, ఘంటసాల, కోడూరు, అలంపురం- కూడలిసంగం మొదలైన ప్రదేశాలు ప్రధానంగా స్వదేశీ వర్తక కూడళ్ళు గాను, తరచుగా విదేశీ వర్తక కేంద్రాలు గాను కూడా పని చేసేవి. అలంపురం దగ్గరి కూడలి సంగమేశ్వరంలో జరిపిన తవ్వకాల్లో రోమన్ చక్రవర్తి కాన్స్టాన్టిన్ (క్రీ.శ. 306-337) ది ఒక బంగారు నాణెంతో పాటు మరికొన్ని ఇతర నాణేలు దొరికాయి. వీటిని బట్టి కృష్ణా-తుంగభద్ర నదుల సంగమ ప్రదేశం విష్ణుకుండుల కంటే ముందు నుంచే విదేశీ వర్తక కేంద్రమని, అది విష్ణుకుండుల కాలంలోనూ కొనసాగిందని స్పష్టమౌతుంది. క్రీ.శ. 5వ శతాబ్దారంభ దశాబ్దాల్లో విష్ణుకుండుల రాజ్యంలో గవ్వలు కూడా ద్రవ్యంగా చెలామణి అయ్యాయని చైనా యాత్రికుడు ఫాహియాన్ రాశాడు. మరో చైనా యాత్రికుడు హ్యుయన్ త్సాంగ్ శ్రీపర్వతం మీద బంగారంతో చేసిన నిలువెత్తు బుద్ధ విగ్రహాలు ఉన్నాయని రాశాడు. అవి దొరకలేదు కాని, ఒకటి నుంచి ఐదు అంగుళాల ఎత్తు ఉన్న రాగి బుద్ధ విగ్రహాలు మాత్రం (క్రీ.శ. 4-5 శతాబ్దాలనాటివి) బుద్ధాంలో, అమరావతిలో దొరికాయి. వీటిని బట్టి, ఆనాడు కంసాలి వృత్తి పనివారు. మంచి నైపుణ్యం గలవారని తెలుస్తున్నది. కీసరగుట్ట పైన కుర్రా జితేంద్రబాబుకు దొరికిన ఒక నశం డబ్బి (పోత ఇనుముతో మామిడి పిందె ఆకారంలో చేసినది - 7 సెం.మీ.) ఇందుకు మరొక నిదర్శనం. మొత్తం మీద విష్ణుకుండుల కాలంలో బౌద్ధ భిక్షువులు, బ్రాహ్మణులు, అనాథలు, యాచకులు, వ్యాధిగ్రస్థులు, దీనులు, కృపణ జనులు అందరు కూడా అనుభవించేంతంగా, న్యాయంగా సంపాదించిన ధన సమృద్ధి ఉండేదని శాసనాలు చెప్తున్నాయి కాబట్టి, ఆనాటి ఆర్థిక వ్యవస్థ పటిష్టమైనదని చెప్పవచ్చు.

- డా. ద్యావనపల్లి సత్యనారాయణ
m : 9490957078

# లెక్కల పజిల్స్

ఆలోచించండి... సమాధానం కనుక్కోండి!

**1** ఈ సంఖ్యా శ్రేణిలో తర్వాత వచ్చే సంఖ్య ఏమిటి?

3, 6, 12, 24, 48, ?

A) 72 B) 84 C) 96 D) 108

**2** ఈ చిత్రాన్ని పరిశీలించి ఖాళీలో ఏ సంఖ్య వస్తుందో చెప్పండి?

| | | |
|---|---|---|
| 2 | 3 | 7 |
| 4 | 5 | 13 |
| 6 | 7 | ? |

A) 17
B) 15
C) 19
D) 21

**3** ఈ సమీకరణాలను పరిష్కరించి ★ విలువ ఎంత?

★ + ★ + ★ = 30
★ + ● + ● = 20
● + ▲ = 9
▲ + ★ = ?

A) 11 B) 13 C) 15 D) 17

**4** ఈ సంఖ్యలు గమనించి సరైన సంబంధాన్ని కనుక్కోండి.

2 | 6 = 8
3 | 9 = 12
4 | 12 = 16
5 | ? = ?

A) 18 B) 20 C) 22 D) 24

**సూచన:** శ్రద్ధగా ఆలోచించు... లెక్కల మంత్రాన్ని కనుక్కో!

# కలంచెలిమి



**నరేష్**
9వ తరగతి, జడ్.పి.హెచ్.ఎస్,
నర్సిపురం, పార్వతిపురం,
మన్యం జిల్లా.



**రామెల్లి తేజస్విని**
8వ తరగతి, జెడ్.పి.హెచ్.ఎస్,
వెల్మల్, బొప్పారం మండలం,
సోన్ నిర్మల్ జిల్లా



**ఎన్. తేజస్విని**
6వ తరగతి, జడ్.పి.హెచ్.ఎస్,
పెద్ద బోదనం, నంద్యాల (జిల్లా)
ఆంధ్ర ప్రదేశ్.




**వి. చందన ప్రియ**
10వ తరగతి, జడ్.పి.హెచ్.ఎస్,
మూడపల్లి, చందుర్తి.



**నేహ**
7వ తరగతి, టి.ఎస్.ఎం.ఎస్.
మోడల్ స్కూల్, చింతపల్లి



**ఎం. రాకేష్**
9వ తరగతి, జడ్.పి.హెచ్.ఎస్,
నర్మెట్ట, జనగామ జిల్లా




# చదువు విలువ

అనగనగా రామాపురం అనే ఒక గ్రామం ఉండేది. ఆ ఊరిలో రాజు అనే ఒక అబ్బాయి ఉండేవాడు. అతనికి రాము అనే ఒక మిత్రుడు ఉండేవాడు. రాము చాలా అసూయపరుడు.

రాజు రోజు బడికి వెళ్ళి బాగా చదువుకునేవాడు. అలా అతను చాలా బాగా చదువుకునేది చూసి తన మిత్రుడు అసూయపడతాడు.

ఒక రోజు రాజు వాళ్ళ మాస్టార్ రాజుని పిలిచి ఇలా అన్నాడు. రాజు నువ్వు ఒక పరీక్ష రాయి ఆ పరీక్ష పాస్ అయితే నీకు నెల నెలకు డబ్బులు వస్తాయి అని అన్నాడు.

అప్పుడు రాజుకు ఏం చేయాలి అర్థం కాక తన మిత్రుడు రాముని అడిగాడు.

అప్పుడు రాము రాజు మీద అసూయతో ఏదో అలా సరే అని చెప్పాడు.

రాజు, రాము చెప్పినట్టుగానే ఆ పరీక్ష రాసి పాస్ అవుతాడు.

అప్పుడు రాజు వాళ్ల మాస్టారు తనని మెచ్చుకున్నాడు. అది చూసిన రాము ఎంతో అసూయ పడ్డాడు. రాజు రాముని పిలిచి ఇలా అన్నాడు – నువ్వు నన్ను చూసి అసూయపడడం కన్నా నాలాగా మంచిగా చదువుకొంటే ఆ పరీక్షేదో పాస్ అయ్యేవాడివి కదా అని అన్నాడు. సరే రాజు ఇప్పటి నుంచీ మంచిగా చదువుకుంటా అని అంటాడు రాము. సరే రాము ఇప్పటికైనా చదువు విలువ తెలుసుకున్నావు అని రాజు సంతోషపడతాడు.

– బి. మనోహరి
8వ తరగతి.
జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల దాంతి.
m : 94916 75130

## మ్యాథ్స్ ట్రిక్స్

# ఫిబోనాకి శ్రేణి 10 సంఖ్యల మొత్తము

1. ఏవైనా రెండు సంఖ్యలను ఒకదాని క్రింద ఒకటి వేసుకోమనాలి.
2. ఆ రెండింటినీ కలపమనాలి. జవాబు 3వ సంఖ్య అవుతుంది.
3. రెండవ సంఖ్య, 3వ సంఖ్యలను కలపమనాలి.
4. ఈ విధంగా జవాబు పైనున్న సంఖ్యలను కూడుతూ 10 వరుసలు పూర్తి చేయాలి.
5. ఆ 10 సంఖ్యలను కూడి జవాబును సిద్ధంగా వుంచుకోవాలి.
6. ఇప్పుడు ఆ 10 వరులసలను క్రింది నుండి పైకి (10వ సంఖ్య నుండి 1వ సంఖ్య వరకు మీకు చెప్పమనాలి).
7. అది విని వెంటనే వారి 10 సంఖ్యల మొత్తాన్ని చెప్పాలి.

ఉదా:

| | | |
|---|---|---|
| 23 | 98 | 15 |
| 45 | 79 | 36 |
| 68 | 177 | 51 |
| 113 | 256 | 87 |
| 181 | 433 | 138 |
| 294 | 689 | 225 |
| 475 | 1122 | 363 |
| 769 | 1811 | 588 |
| 1244 | 2933 | 951 |
| 2013 | 4744 | 1539 |
| **5225** | **12342** | **3993** |

క్లూ : క్రింది నుండి 4వ సంఖ్యను 11తో గుణించాలి.

– అంకెల మామయ్య చంద్రయ్య
m: 9440926937

## బాలచెలిమి క్లబ్

### చెలిమి క్లబ్

చెలిమిక్లబ్‌లో సభ్యత్వం తీసుకోండి లాభాలు పొందండి.

1. చిల్డ్రన్స్ ఎడ్యుకేషనల్ అకాడమీ ప్రచురించే పుస్తకాలపై ప్రత్యేక తగ్గింపు.
2. మీ ప్రతి పుట్టిన రోజుకు అభినందనలతో అందమైన గ్రీటింగ్ కార్డు.
3. మీలో ఉన్న టాలెంట్‌ను అభివృద్ధి చేసుకోవడానికి క్లబ్ నిర్మాణాత్మక సహకారం అందిస్తుంది.
4. మీ స్కూల్లో, ఊర్లో పిల్లల కార్యక్రమాల వార్తలను చెలిమి సమాచార పత్రికకు పంపడానికి మీరు విలేఖరిగా ఉండవచ్చు.
5. అందమైన మెంబర్‌షిప్ బ్యాడ్జి.
6. మిమ్మల్ని ఆశ్చర్యపరచే బహుమతులు.

**చెలిమి క్లబ్**

పేరు : ---------------
తండ్రి పేరు : ---------------
పుట్టినతేదీ : ---------------
చిరునామా : ---------------
-------------------
-------------------
పిన్ : ---------------
హాబీలు : ---------------
మొబైల్ : ---------------
ఇ-మెయిల్ : ---------------

ఈ వివరాలతో మెయిల్ చేయండి.

బాల చెలిమి ఇ-మెయిల్ :
desk. chelimi@gmail. com






నేటి ప్రపంచంలో సాంకేతికత మన జీవితంలో ఒక ముఖ్యమైన భాగంగా మారింది. పరిశ్రమలు, వాహనాలు, విద్యుత్ వినియోగం పెరగడంతో మన జీవితం సులభమైనప్పటికీ పర్యావరణంపై ఒత్తిడి కూడా పెరిగింది. వాయు కాలుష్యం, నీటి కాలుష్యం, భూమి వేడెక్కడం, అడవుల తగ్గుదల, నీటి కొరత వంటి సమస్యలు తీవ్రమవుతున్నాయి. ఈ సమస్యలను తగ్గిస్తూ మన అవసరాలను తీర్చే సాంకేతిక పరిజ్ఞానమే గ్రీన్ టెక్నాలజీ (Green Technology). దీనిని పర్యావరణ సాంకేతికత (Environmental Technology) లేదా క్లీన్ టెక్నాలజీ (Clean Technology) అని కూడా అంటారు.

సరళంగా చెప్పాలంటే, ప్రకృతికి హాని తగ్గిస్తూ, శక్తి, నీరు, ఇతర సహజ వనరులను ఆదా చేసే సాంకేతికతే గ్రీన్ టెక్నాలజీ. మన అవసరాలను తీర్చుకోవడంతో పాటు భవిష్యత్ తరాలకు సహజ వనరులు అందుబాటులో ఉండేలా చూడటం దీని ప్రధాన లక్ష్యం.

## గ్రీన్ టెక్నాలజీ ఎలా మొదలైంది?

పారిశ్రామిక విప్లవం తరువాత బొగ్గు, పెట్రోలు, సహజవాయువు వంటి ఇంధనాల వినియోగం భారీగా పెరిగింది. పరిశ్రమలు అభివృద్ధి చెందాయి. అదే సమయంలో పొగ, వ్యర్థాలు, హానికర వాయువుల వల్ల కాలుష్యం కూడా పెరిగింది. దీంతో పర్యావరణాన్ని కాపాడాల్సిన అవసరాన్ని ప్రపంచం గుర్తించడం ప్రారంభించింది. 1962లో రాచెల్ కార్సన్ రాసిన Silent Spring పుస్తకం పురుగుమందుల వల్ల ప్రకృతికి కలిగే నష్టాన్ని ప్రపంచానికి తెలియజేసింది. 1970లో మొదటి Earth Day (భూమి దినోత్సవం) నిర్వహించారు. 1987లో Brundtland Report ద్వారా Sustainable Development – సుస్థిర అభివృద్ధి అనే భావనకు ప్రపంచవ్యాప్తంగా ప్రాధాన్యం పెరిగింది. అంటే నేటి అవసరాలను తీర్చుకుంటూనే భవిష్యత్ తరాల అవసరాలను దెబ్బతీయకుండా అభివృద్ధి చెందడం.

## గ్రీన్ టెక్నాలజీ రకాలు

సౌరశక్తి, పవనశక్తి, జలవిద్యుత్, బయోమాస్ వంటి పునరుత్పాదక శక్తి వనరులు గ్రీన్ టెక్నాలజీలో ముఖ్యమైనవి. సోలార్ ప్యానెల్ల ద్వారా సూర్యరశ్మి నుంచి విద్యుత్ తయారు చేయవచ్చు. గాలి ద్వారా విద్యుత్ ఉత్పత్తి చేయడానికి విండ్ టర్బైన్లు ఉపయోగిస్తారు.

గ్రీన్ బిల్డింగ్స్‌లో సహజ కాంతి, గాలి ఎక్కువగా వచ్చేలా నిర్మాణం చేస్తారు. సోలార్ ప్యానెల్లు, వర్షపు నీటి సేకరణ, విద్యుత్ పొదుపు పరికరాలను ఉపయోగిస్తారు.

గ్రీన్ ట్రాన్స్‌పోర్టేషన్‌లో ఎలక్ట్రిక్ కార్లు, బస్సులు, మెట్రో రైళ్లు, సైకిళ్లు వంటి కాలుష్యం తక్కువగా కలిగించే రవాణా పద్ధతులకు ప్రాధాన్యం ఇస్తారు.

### మన జీవితంలో గ్రీన్ టెక్నాలజీ

మన ఇంట్లో ఉపయోగించే LED బల్బులు, సోలార్ వాటర్ హీటర్లు, సోలార్ ప్యానెల్లు, విద్యుత్ పొదుపు పరికరాలు, వర్షపు నీటి సేకరణ కూడా గ్రీన్ టెక్నాలజీకి ఉదాహరణలే. వ్యవసాయంలో డ్రిప్ ఇరిగేషన్, సోలార్ పంపులు, నేలలో తేమను గుర్తించే సెన్సర్లు, డ్రోన్లు ఉపయోగించడం వల్ల నీరు, విద్యుత్ ఆదా అవుతాయి. అవసరమైనంత నీటిని మాత్రమే పంటలకు అందించడం వల్ల నీటి వృథాను తగ్గించవచ్చు. వ్యర్థాలను వేరు చేయడం, పాత వస్తువులను రీసైక్లింగ్ చేయడం, తడి వ్యర్థాలతో కంపోస్ట్ తయారు చేయడం కూడా పర్యావరణ పరిరక్షణకు ఉపయోగపడతాయి.

### భారతదేశంలో గ్రీన్ టెక్నాలజీ


భారతదేశంలో సౌర, పవన విద్యుత్ ప్రాజెక్టులు, ఎలక్ట్రిక్ వాహనాలు, గ్రీన్ బిల్డింగ్స్, వ్యర్థాల నుంచి శక్తి ఉత్పత్తి, నీటి సంరక్షణ, సుస్థిర వ్యవసాయం వంటి కార్యక్రమాలకు ప్రాధాన్యం పెరుగుతోంది. ఇవి కాలుష్యాన్ని తగ్గించడంతో పాటు కొత్త ఉపాధి అవకాశాలను కూడా సృష్టిస్తున్నాయి.

గ్రీన్ టెక్నాలజీ వల్ల కాలుష్యం తగ్గుతుంది, విద్యుత్–నీరు ఆదా అవుతాయి, సహజ వనరులు సంరక్షించబడతాయి, పర్యావరణం పరిశుభ్రంగా ఉంటుంది. అయితే కొన్ని గ్రీన్ టెక్నాలజీలకు ప్రారంభ ఖర్చు ఎక్కువగా ఉండటం ఒక సవాలు.

ప్రకృతిని కాపాడటం అంటే మన భవిష్యత్తును కాపాడుకోవడమే. గ్రీన్ టెక్నాలజీని విస్తృతంగా ఉపయోగించడం ద్వారా పరిశుభ్రమైన, పచ్చని, ఆరోగ్యకరమైన ప్రపంచాన్ని రాబోయే తరాలకు అందించవచ్చు.

– లత
e: ogshydcbse@gmail. com

## పల్లెకు పోదాం




1
పల్లెకు పోదాం
పొలాలు చూద్దాం
పంటలు వేద్దాం
పనులను చేద్దాం

2
అవ్వను చూద్దాం
తాతను కలుద్దాం
కథలనడుగుదాం
కథలను విందాం



3
కోడికూతతో
పోటీ పడదాం
వాకిట ముగ్గుల
అందం చూద్దాం

4
చెరువు గట్టున
హాయిగ నడుద్దాం
తామర పూవుల
సొగసులు చూద్దాం



5
పక్షుల అరుపులు
ఆస్వాదిద్దాం
కోకిల పాటకు
మారు పాడదాం





6
పండ్ల తోటల
ఆటలాడదాం
తీయని పండ్లను
కడుపారా తిందాం

7
చేను బావిలో
ఈత నేర్చుదాం
వాగుల వెంబడి
చేపలు పడదాం



8
వాన వాసన
మనసు నింపుదాం
పచ్చని పొలాల్లో
పరుగులు తీద్దాం





9
రచ్చబండపై
సేద తీరుదాం
ఊరి ముచ్చట్లు
తెలుసుకు వద్దాం

10
పట్నాలు వదిలి
పల్లెకు పోదాం
స్వచ్ఛమైన గాలిని
పీల్చి బ్రతుకుదాం



– ఆవుల చక్రపాణి యాదవ్
m : 9963350973

# చీమ - మిడత



ఒక అడవిలో రకరకాల చెట్లు, పూల మొక్కలు, మరియు రకరకాల జంతువులు తో పాటు ఒక చిన్న చీమ మరియు ఒక మిడత కూడా ఉండేవి.

చీమ చాలా చురుకైనది. ఉదయం సూర్యుడు ఉదయించగానే తన పుట్ట నుంచి బయటకు వచ్చి ఆహారం కోసం వెతికేది. అక్కడ దొరికిన చిన్న చిన్న ధాన్యపు గింజలు, పండ్ల ముక్కలును సేకరించి తన పుట్ట కి తీసుకెళ్లేది.

ఇలా పదేపదే తిరుగుతూ రోజంతా ఆహారాన్ని సేకరించేది. అదే సమయంలో, ఒక మిడత మాత్రం చెట్టు కొమ్మపై కూర్చుని ఆనందంగా పాటలు పాడుతూ ఉండేది.

ఒక రోజు మిడత చెట్టు కొమ్మపై కూర్చుని పాటలు పాడుతుండగా, కింద నుంచి ఒక చీమ చిన్న గింజను మోసుకుంటూ వెళ్లడం చూసింది.

మిడత నవ్వుతూ, "చీమా! ఆ చిన్న గింజ కోసం ఇంత దూరం ఎందుకు వెళ్తున్నావు? రోజంతా కష్టపడుతూ ఉంటావు. నాతో కలిసి పాటలు పాడుతూ, ఆడుకుంటూ ఆనందంగా ఉండొచ్చు కదా!" అని అడిగింది.

"మిడతా! ఇప్పుడు ఆహారం చాలా సులభంగా దొరుకుతోంది. కానీ ప్రకృతిలో ఎప్పుడూ ఒకే పరిస్థితి ఉండదు. వాతావరణం మారవచ్చు. వర్షాలు రావచ్చు. కొన్ని రోజులు ఆహారం దొరకకపోవచ్చు. అందుకే ఇప్పుడు దొరికిన ఆహారంలో కొంత భాగాన్ని భవిష్యత్తు కోసం దాచుకుంటున్నాను." చీమ అని చెప్పింది.

మిడత పెద్దగా నవ్వింది.

"అయ్యో! నువ్వు చాలా ఆలోచిస్తున్నావు. రేపటి గురించి రేపు చూసుకుందాం. ఈ రోజు మనకు ఆహారం ఉంది కదా! రా, నాతో కలిసి పాట పాడు!" అని చెప్పింది.

చీమ మాత్రం ఏమీ అనకుండా తన పని కొనసాగించింది.

రోజులు గడిచాయి. ఒక రోజు ఆకాశంలో నల్లటి మేఘాలు కమ్ముకున్నాయి. కొద్దిసేపటికి వర్షం మొదలైంది. వర్షం కారణంగా బయటకు వెళ్లి ఆహారం వెతకడం మిడతకు కష్టంగా మారింది.

ఒక రోజు గడిచింది. వర్షం ఇంకా పడుతూనే ఉంది. రెండు రోజులు గడిచాయి. మిడతకు ఆకలి వేసింది.

అప్పుడు దానికి చీమ గుర్తుకు వచ్చింది. మిడత చీమ పుట్ట దగ్గరకు వెళ్లింది.

మిడత కొంచెం సంకోచంతో, "చీమా... నేను నిన్ను చూసి నవ్వాను. నువ్వు చెప్పిన మాట వినలేదు. ఇప్పుడు నాకు చాలా ఆకలిగా ఉంది. అని చెప్పింది.

చీమ తన దగ్గర ఉన్న కొంత ఆహారాన్ని మిడతకు ఇచ్చింది.

మిడత ఆహారం తింటూ, "ధన్యవాదాలు చీమా! అని చెప్పింది. ఇద్దరూ మంచి స్నేహితులయ్యారు.

### కథలోని సైన్స్ ఏమిటి?

**1. చీమలు ఏమి తింటాయి?**

చీమలు జాతిని బట్టి వివిధ రకాల ఆహారాన్ని

తీసుకుంటాయి. చాలా చీమలు సర్వభక్షకులు (Omnivores), కాబట్టి పండ్ల రసాలు, పూలలోని nectar, చక్కెర పదార్థాలు, విత్తనాలు, చిన్న కీటకాలు, కీటకాల గుడ్లు, లార్వాలు మరియు ఇతర జీవుల అవశేషాలను ఆహారంగా తీసుకొంటాయి . కొన్ని చీమలు, ముఖ్యంగా Leafcutter ants, ఆకులను నేరుగా తినకుండా వాటితో ప్రత్యేకమైన ఫంగస్ను పెంచి, ఆ ఫంగస్ను ఆహారంగా తీసుకొంటాయి.

**2. చీమలు తమ బరువు కంటే ఎక్కువ బరువున్న ఆహారాన్ని ఎలా మోస్తాయి?**

చీమలకు శరీర పరిమాణంతో పోలిస్తే చాలా బలమైన కండరాలు ఉంటాయి. వాటి చిన్న శరీర బరువు కారణంగా, తమ బరువుకు అనేక రెట్లు ఎక్కువ బరువున్న ఆహారాన్ని మోయగలుగుతాయి. అంతేకాకుండా, వాటి ఆరు కాళ్లు బరువును సమంగా మోయడానికి సహాయపడతాయి.

**3. మిడతలు ఏమి తింటాయి?**

మిడతలు ప్రధానంగా గడ్డి, ఆకులు, మొక్కల కాండాలు, పంటల ఆకులు మరియు ఇతర మొక్కల భాగాలను తింటాయి. వాటి నోటి భాగాలు మొక్కలను కొరికి తినడానికి అనుకూలంగా ఉంటాయి. మిడతలు

**4. చీమలు తమ ఆహారాన్ని ఎలా భద్రపరుచుకుంటాయి?**

చీమలు ఆహారం దొరికినప్పుడు దాన్ని తమ పుట్టకు తీసుకెళ్లి భద్రపరుచుకుంటాయి. అవి ధాన్యాలు, విత్తనాలు, తీపి పదార్థాలు మరియు చిన్న పురుగులను సేకరిస్తాయి. కొన్ని జాతుల చీమలు ఆహారాన్ని పుట్ట లోని ప్రత్యేక గదుల్లో నిల్వ చేస్తాయి. వర్షం పడే సమయంలో లేదా ఆహారం దొరకని రోజుల్లో ఈ నిల్వ చేసిన ఆహారాన్ని ఉపయోగిస్తాయి. చీమలు తమ గూడు శుభ్రంగా మరియు పొడిగా ఉంచడం ద్వారా ఆహారం పాడవకుండా కూడా చూసుకుంటాయి.

**5. చీమలు వరుసగా ఎందుకు వెళ్తాయి?**

చీమలు ఒకదాని వెనుక ఒకటి వరుసగా వెళ్లడానికి ప్రధాన కారణం ఫెరోమోన్లు అనే ప్రత్యేకమైన రసాయన వాసనలు. ఆహారం దొరికినప్పుడు ఒక చీమ తన దారిలో



ఫెరోమోన్లను వదులుతుంది. ఇతర చీమలు ఆ వాసనను గుర్తించి అదే దారిని అనుసరిస్తాయి. అందుకే చీమలు ఒకే దారిలో వరుసగా నడుస్తూ కనిపిస్తాయి. ఆహారం దొరికే దారి మరియు గూటికి తిరిగి వెళ్లే దారిని గుర్తించడానికి కూడా ఈ వాసన సహాయపడుతుంది.

**వాస్తవం: మిడతలు తమ ఆహారాన్ని ఎందుకు నిల్వ చేసుకోవు?**

మిడతలు సాధారణంగా తమ ఆహారాన్ని నిల్వ చేసుకునే అవసరం ఉండదు. అవి గడ్డి, ఆకులు మరియు ఇతర మొక్కలను తాజాగా ఉన్నప్పుడే తింటాయి. అంతేకాకుండా, మిడతలు ఆహారాన్ని సేకరించి నిల్వ చేసుకునే జీవన విధానాన్ని కలిగి ఉండవు. ఆహారం అవసరమైనప్పుడు చుట్టుపక్కల ఉన్న మొక్కల నుంచి తింటాయి. అందుకే చీమల్లా భవిష్యత్తు కోసం ఆహారాన్ని దాచుకోవు.

– కె శ్రీకృష్ణ సాయి

రేవతి సైన్స్ ఫౌండేషన్ (రామచంద్రపురం)

m : 9866130320



కథ

# గురువు గారి కర్తవ్య బోధ



నరసింహపురం గ్రామ పొలిమేరలో సదానందుడు అనే గురువు ఆశ్రమం ఉండేది. అందులో అనేకమంది శిష్యులు వివిధ రకాల విద్యలను అభ్యసించేవారు. ఆ సదానందుడు శిష్యులను ఎంతో ప్రేమగా చూసుకునేవాడు.

ఇలా ఉండగా ఒకరోజు ఆ గ్రామ పెద్ద భూషయ్య ఆ గురువు ఆశ్రమానికి వచ్చాడు. అది వేసవికాలం. భూషయ్య వచ్చీ రాగానే "గురువర్యా! నాకు చాలా దాహంగా ఉంది. కొన్ని మంచినీళ్లు ఇప్పించండి" అని అన్నాడు. అప్పుడు గురువు గారు శిష్యుణ్ణి పిలిచి "అక్కడ బావిలోని నీటిని పట్టుకొని రా" అని ఒక పాత్రను ఇచ్చి పంపించాడు. ఆ శిష్యుడు మరలి వచ్చి "గురువర్యా! ఆ బావిలో ఒక్క చుక్క కూడా నీరు లేదు" అని అన్నాడు. అప్పుడు గురువుగారు "అదిగో! అక్కడ మరొక బావి ఉంది. అందులో నీరు ఉంటుంది వెళ్ళు" అని అన్నాడు. శిష్యుడు మరలి వచ్చి "గురువర్యా! అక్కడ కూడా నీరు లేదు. మళ్లీ ఎక్కడకు నన్ను వెళ్ళమంటారు? "అని ప్రశ్నించాడు. అప్పుడు గురువుగారు "అదిగో! దూరంగా చెట్టు కనిపిస్తున్నది చూడు. అక్కడ బావిలో తప్పకుండా నీరు ఉంటుంది. త్వరగా వెళ్లి తీసుకొని రా!" అని అన్నాడు. భూషయ్య గారికి గొంతు ఎండి పోతున్నది. అతడు "గురువర్యా! మీ వద్ద మంచి నీళ్లు లేవా!" అని అడిగాడు. "లేవు గ్రామపెద్ద గారు! మా శిష్యులు ఉదయం కొన్నింటిని పాత్రలో ఆ దూరాన ఉన్న బావిలో నుండి తెచ్చారు. అవి అయిపోయాయి. నేను నీటిని తెచ్చి పెట్టమని అందామని అనుకునే లోపలే మీరు వచ్చి మంచినీటిని అడిగారు. అందువల్ల మీకు వాటిని తొందరగా ఇవ్వలేకపోయాను "అని అన్నాడు.

ఇలా గురువుగారు మాట్లాడుతుండగానే ఆ శిష్యుడు వెంటనే వచ్చి భూషయకు మంచినీటిని అందించాడు. భూషయ్య ఆ నీటిని గడగడా త్రాగాడు. తర్వాత మరికొన్ని నీటిని పోయమన్నాడు. ఆ శిష్యుడు అలాగేనని ఆ పాత్రలోని నీటిని భూషయ్య గారికి అందించాడు. ఆయన గురువుగారి వద్ద సెలవు తీసుకొని వెళ్ళిపోయాడు.

తర్వాత శిష్యులు "గురువర్యా! మన ఆశ్రమంలో మంచినీరు ఉందిగా! దానిని గ్రామ పెద్ద గారికి ఎందుకు ఇవ్వలేదు? మంచి నీరు ఉండి కూడా మీరు ఎందుకు లేదన్నారు?" అని ప్రశ్నించారు? అప్పుడు గురువు గారు "శిష్యులారా! మన గ్రామ పెద్ద చాలా మంచివాడు. ఆయనకు మన నీటి ఇబ్బందులు తెలియవు. అతనికి మనం ఎంత దూరం నుండి నీటిని తెచ్చుకుంటున్నామో కూడా తెలియదు. ఆ విషయం తెలియాలనే నేను అలా చేశాను. ఇకపోతే మన ఆశ్రమంలో మీరు తెచ్చిన ఈ నీటిలో ఆ పాత్ర పైన మూత ఉంచకపోవడం వల్ల కొంత చెత్తాచెదారం పడింది. అలాంటి దాన్ని ఆ గ్రామ పెద్దకు ఇవ్వవద్దనే నేను ఆయనకు

మంచి నీరు లేదన్నాను. ఆ నీరు అపరిశుభ్రంగా ఉంది. అలాంటి నీరు గ్రామ పెద్దకు ఇస్తే ఆయనకు ఏమన్నా అయితే మనకు చెడ్డ పేరు వస్తుంది. అందుకే దానిని ఇవ్వలేదు. ఇప్పుడు గ్రామ పెద్ద మంచినీటి బావులను తవ్విస్తాడనే నమ్మకం నాకుంది. ఆయన ప్రత్యక్షంగా ఆ బాధను అనుభవించాడు కదా!" అని అన్నాడు.

మరికొన్ని రోజులకు భూషయ్య మళ్లీ వచ్చి "గురువర్యా! ఆకలి, ఆకలి. నేను చాలా దూరం నడిచాను ఉదయం నుండి ఏమీ తినలేదు. ఏమైనా ఆహారం ఉంటే పెట్టండి "అని అన్నాడు. గురువుగారు వెంటనే మంచి మంచి పండ్లను గ్రామ పెద్దకు ఇచ్చాడు. గ్రామ పెద్ద వాటిని తిని "ఆహా! ఈ పండ్లు చాలా రుచిగా ఉన్నాయి. ఎక్కడ నుండి తెప్పించారు?" అని ప్రశ్నించాడు. అప్పుడు గురువుగారు "అయ్యా! ఈ దగ్గర్లోనే మేము పండ్ల చెట్లను పెంచుతున్నాం. మా శిష్యులు, నేను వీటినే తింటాం. అవి సేంద్రియ ఎరువులతో పండించినవి తప్ప రసాయనిక ఎరువులతో కాదు. అందుకే అవి చాలా రుచిగా ఉన్నాయి. అవి ఆరోగ్యానికి మంచివి కూడా! అవి కల్తీ లేని ఆహారం" అని అన్నాడు. అప్పుడు ఆ గ్రామ పెద్ద "ఈ పండ్ల చెట్లు నేను గ్రామమంతటా పెంచే లాగున చర్యలను తీసుకుంటాను. నాకు ఆ పండ్ల చెట్ల విత్తనాలను ఇప్పించండి" అని అన్నాడు. వెంటనే గురువుగారు కొన్ని విత్తనాలు తెచ్చి గ్రామ పెద్దకు ఇచ్చాడు.

ఆయన వెంటనే ఆ విత్తనాలు తీసుకొని వెళ్లి గ్రామ ప్రజలకు పంచి ఇటువంటి మంచి పండ్ల చెట్లను పెంచాల్సిందిగా వారికి సూచించాడు. అంతేకాకుండా ఆశ్రమ పరిసరాలలో మంచినీటి బావులను తక్షణమే తవ్వించి మంచినీటి కొరత లేకుండా చేశాడు. తన దృష్టికి ఆ సమస్యలను తీసుకొని వచ్చినందుకు గురువుగారిని అభినందించి అతని సలహాలు, సూచనలు స్వీకరించి ప్రజలకు కావలసిన సౌకర్యాలు ఏర్పరిచాడు. అంతేకాదు. తనకు పారిశుధ్యం గురించి, మంచి విత్తనాల గురించి, తమ ఆశ్రమానికి కావాల్సిన సౌకర్యాల గురించి తగిన సలహాలను, సూచనలను ఇచ్చి తనకు కర్తవ్య బోధను గావించిన గురువు గారి గురించి ప్రజలకు తెలియజేశాడు. వారి సూచన మేరకు గురు పూజోత్సవం రోజున గ్రామంలోనికి ఆహ్వానించి ఘనంగా ప్రజల ముందు సత్కరించాడు. కొద్ది రోజుల్లోనే అతడు మంచి ప్రజా ప్రతినిధిగా పేరు తెచ్చుకున్నాడు.

– సంగనభట్ల చిన్న రామకిష్టయ్య
ధర్మపురి
m : 9908554535

## బాల రచయితలకు సాహిత్య అకాడమీ ఆహ్వానం...

బాలల దినోత్సవం సందర్భంగా తెలంగాణ సాహిత్య అకాడమి 6 నుంచి 10వ తరగతి విద్యార్థులకు కథ, కవిత్వం, పద్య కవితలు, గేయం/పాట, నాటికల రచనా పోటీలను నిర్వహిస్తోంది. తెలంగాణ సంస్కృతి, జనజీవన విధానం, చారిత్రక వ్యక్తులు, భాష తదితర అంశాలపై రచనలు ఉండాలి. పద్య కవితలు ఐదు పద్యాలకు, కవిత్వం 26 పంక్తులకు మించరాదు. కథానిక, నాటిక ఏ4 సైజులో మూడు పుటలకు మించకూడదు. రచనపై విద్యార్థి పేరు, పాఠశాల వివరాలు రాయకూడదు. రచనను పాఠశాల ప్రధానోపాధ్యాయులతో ధ్రువీకరించి, విద్యార్థి ఫోటో, పూర్తి పేరు, తండ్రి పేరు, పాఠశాల, తరగతి, ఫోన్ నంబర్, చిరునామా వివరాలను విడిగా జతచేయాలి.

రచనలను 2026 సెప్టెంబర్ 30లోగా కార్యదర్శి, తెలంగాణ సాహిత్య అకాడమి, కళాభవన్, రవీంద్రభారతి ప్రాంగణం, హైదరాబాద్-500004 చిరునామాకు పోస్టు లేదా కొరియర్ ద్వారా పంపాలి. హామీపత్రం లేని రచనలు తిరస్కరించబడతాయి. రచనల ఎంపికలో అకాడమిదే తుది నిర్ణయం. వివరాలకు: 9182445692.

– కార్యదర్శి, తెలంగాణ సాహిత్య అకాడమి, హైదరాబాద్




భారతదేశం మూడు వైపులా సముద్రంతో చుట్టబడి ఉంది. దేశానికి 7, 500 కి. మీ.కు పైగా పొడవైన తీరరేఖ ఉంది. నౌకలు వచ్చి సురక్షితంగా నిలిచే ప్రదేశాన్ని నౌకాశ్రయం (Port) అంటారు. నౌకాశ్రయాల ద్వారా పెట్రోలియం, బొగ్గు, ఇనుప ఖనిజం, ఎరువులు, ఆహార పదార్థాలు, యంత్రాలు, వాహనాలు వంటి అనేక వస్తువుల దిగుమతులు-ఎగుమతులు జరుగుతాయి. భారతదేశానికి పశ్చిమాన అరేబియా సముద్రం, తూర్పున బంగాళాఖాతం, దక్షిణాన హిందూ మహాసముద్రం ఉన్నాయి. 2026 నాటికి భారతదేశంలో 14 ప్రధాన నౌకాశ్రయాలు (Major Ports) ఉన్నాయి. దేశ వాణిజ్యం, రవాణా, పరిశ్రమల అభివృద్ధి, ఉపాధి కల్పనలో నౌకాశ్రయాలు ముఖ్యమైన పాత్ర పోషిస్తున్నాయి. నౌకాశ్రయాల నిర్వహణ, అభివృద్ధి, భద్రతకు చట్టాలు కూడా ఉన్నాయి. 2026 నాటికి అమల్లో ఉన్న ముఖ్య చట్టాలు :Major Port Authorities Act, 2021 మరియు Indian Ports Act, 2025. ఇవి నౌకాశ్రయాల సమర్థ నిర్వహణ, భద్రత, అభివృద్ధికి అవసరమైన చట్టపరమైన మార్గదర్శకాలను అందిస్తాయి.

| స. | నౌకాశ్రయం | రాష్ట్రం/కేంద్రపాలిత ప్రాంతం | సముద్ర తీరం | స్థాపన/ప్రారంభ సం. |
|---|---|---|---|---|
| 1 | దీన్‌దయాళ్ పోర్ట్ (కాండ్లా) | గుజరాత్ | అరేబియా సముద్రం | 1950 |
| 2 | ముంబై పోర్ట్ | మహారాష్ట్ర | అరేబియా సముద్రం | 1873 |
| 3 | జవహర్‌లాల్ నెహ్రూ పోర్ట్ (JNPA) | మహారాష్ట్ర | అరేబియా సముద్రం | 1989 |
| 4 | మోర్ముగావ్ పోర్ట్ | గోవా | అరేబియా సముద్రం | 1885 |
| 5 | న్యూ మంగళూరు పోర్ట్ | కర్ణాటక | అరేబియా సముద్రం | 1974 |
| 6 | కొచ్చిన్ పోర్ట్ | కేరళ | అరేబియా సముద్రం | 1928 |
| 7 | వి. ఓ. చిదంబరనార్ పోర్ట్ (తూత్తుకుడి) | తమిళనాడు | మన్నార్ గల్ఫ్ | 1974 |
| 8 | చెన్నై పోర్ట్ | తమిళనాడు | బంగాళాఖాతం | 1881 |
| 9 | కామరాజర్ పోర్ట్ (ఎన్నూర్) | తమిళనాడు | బంగాళాఖాతం | 2001 |
| 10 | విశాఖపట్నం పోర్ట్ | ఆంధ్రప్రదేశ్ | బంగాళాఖాతం | 1933 |
| 11 | పారాదీప్ పోర్ట్ | ఒడిశా | బంగాళాఖాతం | 1966 |
| 12 | శ్యామాప్రసాద్ ముఖర్జీ పోర్ట్ (కోల్‌కతా-హల్దియా) | పశ్చిమ బెంగాల్ | హుగ్లీ నది/బంగాళాఖాతం | 1870 |
| 13 | వధవన్ పోర్ట్ | మహారాష్ట్ర | అరేబియా సముద్రం | 2024-శంకుస్థాపన |
| 14 | గలాథియా బే పోర్ట్ | అండమాన్ & నికోబార్ దీవులు | హిందూ మహాసముద్రం | 2024- Major Portగా గుర్తింపు |

- బాలచెలిమి డెస్క్



# గడ్డిలో దాగి... గగనంలో మెరిసే

# బెంగాల్ ఫ్లోరికన్

బెంగాల్ ఫ్లోరికన్ (Bengal Florican) ప్రపంచంలో చాలా అరుదుగా కనిపించే గడ్డి మైదానాల పక్షి. దీని శాస్త్రీయ నామం Houbaropsis bengalensis. ఇది బస్టర్డ్ పక్షులకుటుంబానికి చెందినది. ఒకప్పుడు భారతదేశంలోని అనేక గడ్డి ప్రాంతాల్లో కనిపించే ఈ పక్షి, ఇప్పుడు గడ్డి మైదానాలు తగ్గిపోవడంతో కొన్ని ప్రాంతాల్లో మాత్రమే కనిపిస్తోంది. బెంగాల్ ఫ్లోరికన్ సుమారు 55-70 సెం. మీ. ఎత్తు, 1-2 కిలోల బరువు ఉంటుంది. మగ, ఆడ పక్షులు చూడటానికి కొంచెం భిన్నంగా ఉంటాయి. మగ పక్షి నలుపు రంగు శరీరం, తెల్లని రెక్కలతో అందంగా కనిపిస్తుంది. ఆడ పక్షి గోధుమ, బూడిద రంగుల్లో ఉంటుంది. ఈ రంగుల వల్ల అది గడ్డి మధ్య సులభంగా కలిసిపోయి శత్రువుల నుంచి రక్షణ పొందుతుంది. ఈ పక్షి ఎక్కువగా పొడవైన గడ్డి మైదానాలు, నదుల దగ్గర ఉండే తేమ గల గడ్డి ప్రాంతాల్లో నివసిస్తుంది. భారత దేశంలో ముఖ్యంగా అస్సాం, ఉత్తర ప్రదేశ్‌లోని తరాయి ప్రాంతాల్లో కనిపిస్తుంది. భారతదేశం వెలుపల నేపాల్, కంబోడియా దేశాల్లోని కొన్ని గడ్డి భూముల్లో కూడా బెంగాల్ ఫ్లోరికన్ కనిపిస్తుంది. ఎక్కువ సమయం నేలపైనే గడుపుతూ గడ్డి మధ్య సంచరిస్తుంది.

బెంగాల్ ఫ్లోరికన్‌కు మొక్కలు, చిన్న జీవులు రెండూ ఆహారమే. గడ్డి విత్తనాలు, లేత మొక్కల భాగాలను తినడంతో పాటు మిడతలు, కీటకాలు, ఇతర చిన్న అకశేరుక జీవులను కూడా ఆహారంగా తీసుకుంటుంది. ఇలా విభిన్నమైన ఆహారాన్ని స్వీకరిస్తూ గడ్డి మైదానాల జీవవైవిధ్యంలో తనదైన పాత్రను పోషిస్తుంది. సంతానోత్పత్తి సమయంలో మగ బెంగాల్ ఫ్లోరికన్ చేసే విన్యాసం చాలా ప్రత్యేకంగా ఉంటుంది. ఆడ పక్షిని ఆకర్షించడానికి మగ పక్షి పొడవైన గడ్డి మధ్య నుంచి ఒక్కసారిగా గాలిలోకి ఎగురుతుంది. తన నలుపు-తెలుపు రెక్కలను అందంగా విప్పి చూపిస్తుంది. కొంత ఎత్తుకు ఎగిరిన తర్వాత మళ్లీ గడ్డిలోకి దిగుతుంది. ఇలా పలుమార్లు ఎగురుతూ ఆడ పక్షిని ఆకర్షిస్తుంది. ఈ అందమైన విన్యాసం బెంగాల్ ఫ్లోరికన్ ప్రత్యేకతల్లో ఒకటి. ప్రస్తుతం బెంగాల్ ఫ్లోరికన్ అంతరించిపోయే ప్రమాదంలో ఉంది. ఈ పక్షి నివసించే సహజ గడ్డి మైదానాలు రోజు రోజుకూ తగ్గిపోతున్నాయి. గడ్డి భూములను వ్యవసాయానికి ఉపయోగించడం, కొత్త నిర్మాణాలు చేపట్టడం, పశువులను ఎక్కువగా మేపడం, గడ్డిని కాల్చడం వంటి కారణాల వల్ల దీనికి నివసించడానికి సరైన ప్రదేశాలు లేకుండా పోతున్నాయి. దీంతో బెంగాల్ ఫ్లోరికన్ పక్షుల సంఖ్య క్రమంగా తగ్గుతోంది.

బెంగాల్ ఫ్లోరికన్ చాలా అరుదైన పక్షి. అందుకే IUCN దీనిని “Critically Endangered” (అత్యంత ప్రమాదంలో ఉన్న జాతి)గా గుర్తించింది. ఈ పక్షిని కాపాడాలంటే అది నివసించే గడ్డి మైదానాలను రక్షించాలి. గుడ్లు పెట్టే ప్రాంతాల్లో మనుషుల రాకపోకలు తగ్గించాలి. ఈ అరుదైన పక్షిని కాపాడుకోవాల్సిన అవసరం గురించి ప్రజలకు తెలియజేయాలి. బెంగాల్ ఫ్లోరికన్‌ను కాపాడటం అంటే ఒక పక్షిని మాత్రమే కాదు, గడ్డి మైదానాల్లో జీవించే ఎన్నో జీవులను కూడా కాపాడటం. ఈ అందమైన పక్షిని భవిష్యత్తు తరాలు పుస్తకాల్లో మాత్రమే కాకుండా, ప్రకృతిలోనూ చూడగలిగేలా రక్షించడం మనందరి బాధ్యత.

- సచిన్ కోత్వాల్
m : 97010 01036

కథ

# చివరి మార్కు




"ఈసారి కూడ మొదటి ర్యాంక్ రాకపోతే నాతో మాట్లాడొద్దు" అని తండ్రి చెప్పిన మాటలు ఆరవ తరగతి విద్యార్థి అభి మనసులో పదే పదే వినిపించేవి.

అభి చాలా కష్టపడి చదివాడు. పరీక్షలు ముగిశాయి. ఫలితాలు వచ్చిన రోజున పాఠశాలలో అందరూ ఆసక్తిగా మార్కులు చూసుకుంటున్నారు. అభికి 99 మార్కులు వచ్చాయి. అతని స్నేహితుడు వినయ్‌కు 100 మార్కులు వచ్చాయి.

ఒక్క మార్కు తేడాతో అభికి రెండవ స్థానం వచ్చింది. అతని కళ్ళలో నీళ్ళు తిరిగాయి. "నేను ఓడిపోయాను" అని బాధపడుతూ ఇంటికి బయలు దేరాడు. మధ్యలో ఒక వంతెన దగ్గర జనాలు గుమికూడి ఉన్నారు. ఒక వృద్ధురాలు రోడ్డు దాటలేక భయపడుతోంది. అందరూ చూస్తున్నారు.... కానీ ఎవరూ ముందుకు రాలేదు. అభి వెంటనే ఆమె దగ్గరికి వెళ్ళి చేయి పట్టుకుని నెమ్మదిగా రోడ్డు దాటించాడు.

వృద్ధురాలు ఆశీర్వదిస్తూ "నువ్వు పరీక్షలో ఎన్ని మార్కులు తెచ్చుకున్నావో నాకు తెలియదు బాబూ... కానీ జీవితంలో మాత్రం వందకు వంద మార్కులు సాధించావు" అంది. ఆ మాటలు అభి మనసును కదిలించాయి.

ఇంటికి వెళ్ళి మార్కుల మెమోను తండ్రికి ఇచ్చాడు. తండ్రి చూసి "ఒక్క మార్కు ఎందుకు తగ్గింది?" అని అడిగాడు. అభి జరిగిన విషయం మొత్తం తన తండ్రితో చెప్పాడు.

తండ్రి కొద్ది సేపు మౌనంగా ఉన్నాడు. తర్వాత తన కుమారుని గట్టిగా హత్తుకుని ఇలా అన్నాడు. "బాబూ... ఈ రోజు నాకు తెలిసింది పరీక్షలో వచ్చే ఒక్క మార్కు కంటే, మనిషిగా సంపాదించే ఒక్క మంచి పేరు ఎంతో గొప్పది. నీ ఫలితం కాగితంపై 99 మాత్రమే. కానీ నా హృదయంలో మాత్రం 100 కాదు... 1000 మార్కులు సాధించావు."

అభి కళ్ళలో ఆనంద బాష్పాలు మెరిశాయి. మరుసటి రోజు పాఠశాల ప్రార్థనా సభలో ప్రధానోపాధ్యాయులు అభిని వేదిక పైకి పిలిచారు. "నిజమైన విజయం మార్కులతో కాదు, మంచి మనసుతో వస్తుంది. అభి మనందరికీ ఆదర్శం" అని అన్నారు. చప్పట్ల శబ్దంతో ఆ ప్రాంగణం మార్మోగి పోయింది.

ఆ రోజు అభి తెలుసుకున్న విషయం ఏమిటంటే... "జీవితంలో మొదటి మార్కు మన ప్రశ్నాపత్రం వేయదు. మన మంచి పనులే వేస్తాయి."

నీతి : విద్య మనకు మార్కులను మాత్రమే కాదు, మానవత్వాన్ని కూడా నేర్పాలి. మన మంచి మనసే జీవితంలో అత్యున్నత విజయం.


– ఎన్. నిహాన్
తండ్రి : దయాసాగర్
6వ తరగతి, హార్వేస్ట్ పబ్లిక్ స్కూల్, ఖమ్మం
me : 9440555708


**పదాల మేడ 4 సమాధానాలు (పేజి 30):**

**అడ్డం :** 1) వేసవి కాలం, 2) లవుడు, 3) కుక్క, 4) వసుధ, 9) కంచె, 10) కంఠం, 11) గానుగ. **నిలువు :** 1) వేకువ, 5) కాలచక్రం, 6) సుధ, 7) దగా, 8) ధగ ధగ, 9) కంటకం, 12) చెవుడు.

# ముడుమాల్ విద్యార్థులకు జ్ఞానవెలుగు -'బాలచెలిమి గ్రంథాలయం'






నారాయణపేట జిల్లా ముడుమాల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చిల్డ్రన్స్ ఎడ్యుకేషనల్ అకాడమీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 'బాలచెలిమి గ్రంథాలయం' విద్యార్థుల్లో పుస్తక పఠనంపై ఆసక్తిని పెంపొందిస్తోంది. కథలు, బాలసాహిత్యం, విజ్ఞాన విషయాలు, పజిల్స్, రంగురంగుల చిత్రాలతో కూడిన పుస్తకాలు అందుబాటులోకి రావడంతో విద్యార్థులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. "గ్రామీణ ప్రాంతాల విద్యార్థులకు నాణ్యమైన కథలు, చిత్రాల పుస్తకాలు, సృజనాత్మక సాహిత్యం తగినంతగా అందుబాటులో ఉండదు. బాలచెలిమి గ్రంథాలయం వల్ల పిల్లలకు పుస్తక పఠనం అలవాటవుతోంది. పాఠ్యపుస్తకాలకే పరిమితం కాకుండా సాధారణ జ్ఞానం, ఊహాశక్తి, భాషా నైపుణ్యాలు, సాహిత్యాభిరుచి పెంపొందుతాయి. ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు, గ్రామస్థుల సహకారంతో దీనిని జ్ఞానం, ఆనందం, మార్గదర్శకత్వం అందించే కేంద్రంగా తీర్చిదిద్దుతాం."

**- శ్రీ నిజాముద్దీన్,** ప్రధానోపాధ్యాయులు

"గ్రామీణ ప్రాంతంలోని మా పాఠశాలలో బాలచెలిమి గ్రంథాలయం ఏర్పాటు చేయడం ఎంతో ఆనందంగా ఉంది. పుస్తకాల్లోని సరళమైన పదాలు, చిన్న వాక్యాలు మాకు సులభంగా అర్థమవుతున్నాయి. కథలు, పజిల్స్, విజ్ఞాన అంశాలు చదవడం వల్ల సృజనాత్మకత పెరుగుతోంది. ముడుమాల్ నిలువురాళ్ల విశిష్టతను ప్రపంచానికి పరిచయం చేయడంతోపాటు మా కోసం గ్రంథాలయాన్ని ఏర్పాటు చేయించిన మణికొండ వేదకుమార్ సార్‌కు కృతజ్ఞతలు."

**- వైశాలి,** 10వ తరగతి

"మా పాఠశాలలో మంచి కథల పుస్తకాలు తక్కువగా ఉండేవి. ఇప్పుడు చిత్రాలతో కూడిన పుస్తకాలు అందుబాటులోకి వచ్చాయి. ఉపాధ్యాయులు పుస్తకాలను ఇంటికి కూడా ఇస్తుండటంతో కుటుంబ సభ్యులతో కలిసి చదువుతున్నాం. టీవీ, మొబైల్ ఫోన్‌కు బదులుగా పుస్తకాలు చదవడం ఎంతో ఆనందంగా ఉంది."

**- శిరీష,** 9వ తరగతి

"గ్రంథాలయం ద్వారా సైన్స్, చరిత్ర, సాహిత్యం గురించి మరింత తెలుసుకుంటున్నాం. పరీక్షల కోసమే కాకుండా సాధారణ జ్ఞానాన్ని పెంపొందించుకోవడానికి ఈ పుస్తకాలు ఎంతగానో ఉపయోగపడుతున్నాయి."

**- హన్మంత్,** 9వ తరగతి

"బాలచెలిమి పుస్తకాలు మాకు సులభంగా అర్థమయ్యేలా, ఆసక్తికరంగా ఉన్నాయి. కథలు చదవడం వల్ల ఊహాశక్తి పెరుగుతోంది. మేము కూడా సొంతంగా కథలు రాయడం, పజిల్స్ సాధించడం నేర్చుకుంటున్నాం."

**- సాయిరాం,** 10వ తరగతి

'బాలచెలిమి గ్రంథాలయం' ముడుమాల్ పాఠశాల విద్యార్థులతోపాటు పరిసర ప్రాంతాల పిల్లలకు కూడా ఉపయోగపడే విజ్ఞాన, సృజనాత్మక కేంద్రంగా రూపుదిద్దుకుంటోంది. పుస్తకాలతో పిల్లల అనుబంధాన్ని పెంచుతూ, వారిలో పఠనాసక్తి, ఆలోచనా శక్తి, భాషా సామర్థ్యాలను అభివృద్ధి చేయడంలో ఈ గ్రంథాలయం కీలక పాత్ర పోషిస్తోంది.

**- శ్రీ జనార్దన్ రెడ్డి**
బాలచెలిమి గ్రంథాలయ ఇన్‌చార్జి, స్కూల్ అసిస్టెంట్ (SA)
జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ముడుమాల్, నారాయణపేట.
m: 99856 46716

## స్వభావపూర్ణతే బాలసాహిత్యానికి భూమిక

కరీంనగర్‌లో జరిగిన డా. నలిమెల భాస్కర్ 'పిల్ల తెమ్మెరలు' పుస్తక ఆవిష్కరణ సభలో డా. పత్తిపాక మోహన్ మాట్లాడుతూ, స్వభావపూర్ణతతోనే బాలసాహిత్యం వర్ధిల్లుతుందన్నారు. పిల్లలకు ఆనందం, అనుభూతి ప్రధానమని, బోధన తరువాతేనని చెప్పారు. బాలసాహిత్యంలో సృజనాత్మకత, విజ్ఞానం, భాషా వైవిధ్యం అవసరమని వక్తలు పేర్కొన్నారు. రచయిత భాస్కర్‌ను అభినందించి, బాలల సాహిత్యాభివృద్ధికి మరిన్ని రచనలు రావాలని ఆకాంక్షించారు. సభలో పాల్గొన్న కవులు, రచయితలు పుస్తకాన్ని ప్రశంసించి, అతిథులను ఘనంగా సత్కరించారు.

## 'చింతకుంట చిన్నారులు' పుస్తకావిష్కరణ

చింతకుంట సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలకు చెందిన 38 మంది విద్యార్థులు రచించిన కథల సంకలనం 'చింతకుంట చిన్నారులు'ను జిల్లా సెక్టోరియల్ అధికారి అశోక్‌రెడ్డి ఆవిష్కరించారు. విద్యార్థుల సృజనాత్మకతను పెంపొందించడంలో కథారచన కీలకమన్నారు. కథలను పుస్తకరూపంలో తీసుకొచ్చిన తెలుగు ఉపాధ్యాయురాలు చిందం అన్నపూర్ణను అభినందించారు. ప్రిన్సిపల్ లక్ష్మి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో విద్యాధికారులు, సాహితీవేత్తలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## బాలల కథలకు ఆహ్వానం

పిల్లల్లో మంచి ఆలోచనలు, అలవాట్లు, పరిసరాల పరిశీలన, సృజనాత్మకత పెంపొందించే ఒకటి లేదా రెండు పేజీల కథలను 2026 సెప్టెంబర్ 30లోగా పంపండి. దెయ్యాలు, భూతాలు, రాజుల కథలు వద్దు.

ఈ-మెయిల్: nkbabu.publisher@gmail.com, వాట్సాప్: 8977732619, చిరునామా: ఎన్.కె. బాబు, 24-8-1, సమీరా రెసిడెన్సీ, విజయనగరం-535002.

## సూర్యగమన రహస్యాలను తెలిపే ముడుమాల్ శిలలు

నారాయణపేట జిల్లా కృష్ణ మండలంలోని ముడుమాల్ మెగాలిథిక్ మెన్హిర్స్ ప్రదేశాన్ని 2026 ఆగస్టు 18న ఆర్కియాలజికల్ సర్వే ఆఫ్ ఇండియా (ASI), డిపార్టుమెంట్ ఆఫ్ హెరిటేజ్ తెలంగాణ (DHT), దక్కన్ హెరిటేజ్ అకాడమీ ట్రస్ట్ (DHAT) అధికారులు, పురావస్తు నిపుణులు సంయుక్తంగా పరిశీలించారు. ASI హైదరాబాద్ సర్కిల్ సూపరింటెండింగ్ ఆర్కియాలజిస్ట్ డా. నిహిల్ దాస్ మాట్లాడుతూ, యునెస్కో ప్రపంచ వారసత్వ తాత్కాలిక జాబితాలో చోటుపొందిన ముడుమాల్‌కు అపారమైన పురావస్తు, ఖగోళ, సాంస్కృతిక ప్రాధాన్యం ఉందన్నారు. ఇక్కడి మెన్హిర్లు, మెగాలిథిక్ సమాధులు, శిలావలయాలు, సూర్యగమనంతో ముడిపడిన శిలా అమరికలు అత్యంత విశిష్టమైనవని పేర్కొన్నారు. ముడుమాల్ సంరక్షణ, అధ్యయనం, ప్రపంచస్థాయి గుర్తింపు కోసం నిరంతరం కృషిచేస్తున్న దక్కన్ హెరిటేజ్ అకాడమీ ట్రస్ట్ చైర్మన్ ప్రొఫెసర్ మణికొండ వేదకుమార్, సంబంధిత బృందాన్ని అభినందించారు. ASI అసిస్టెంట్ సూపరింటెండింగ్ ఆర్కియాలజిస్ట్ డా. రోహిణి పాండే అంబేకర్ మాట్లాడుతూ, కృత్రిమ నిర్మాణాలతో సహజ స్వరూపానికి భంగం కలిగించకుండా ఈ ప్రదేశాన్ని శాస్త్రీయంగా సంరక్షించాలని సూచించారు. దక్కన్ హెరిటేజ్ అకాడమీ ట్రస్ట్ చైర్మన్, 'బాలచెలిమి' మాసపత్రిక సంపాదకులు ప్రొఫెసర్ మణికొండ వేదకుమార్ మాట్లాడుతూ, యునెస్కో ప్రపంచ వారసత్వ గుర్తింపు ప్రక్రియలో ఈ సంయుక్త పరిశీలన కీలక ముందడుగని తెలిపారు. శాస్త్రీయ డాక్యుమెంటేషన్, సమగ్ర సైట్ మేనేజ్‌మెంట్ ప్రణాళికను సిద్ధంచేసి, డిపార్టుమెంట్ ఆఫ్ హెరిటేజ్ తెలంగాణ, డైరెక్టర్ ప్రొఫెసర్ అర్జున్‌రావు కుతాడి ద్వారా ప్రభుత్వానికి సమర్పిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి సహకరించిన ప్రొఫెసర్ కె.పి. రావు, క్షేత్ర ఆర్కిటెక్ట్ బృందం, జిల్లా యంత్రాంగం, స్థానిక అధికారులు, ముడుమాల్ గ్రామ ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం ముడుమాల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు నిజాముద్దీన్ (మండల విద్యాధికారి) అధ్యక్షతన విద్యార్థులకు వారసత్వ సంపద పరిరక్షణపై అవగాహన కల్పించారు.



వ్యక్తిత్వం

# అభినయానికి చిరునామా... 'షావుకారు' జానకి

## రేడియో కళాకారిణి నుంచి పద్మశ్రీ వరకు సాగిన ఏడు దశాబ్దాల అపూర్వ సినీ ప్రస్థానం

తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ చిత్రసీమల్లో సుమారు ఏడు దశాబ్దాలపాటు విభిన్న పాత్రలతో ప్రేక్షకులను అలరించిన సుప్రసిద్ధ నటి 'షావుకారు' జానకి. సహజమైన అభినయం, స్పష్టమైన సంభాషణ, పాత్ర స్వభావాన్ని లోతుగా అర్థం చేసుకొని నటించే సామర్థ్యం ఆమె ప్రత్యేకత. కథానాయికగా ప్రారంభమైన ఆమె ప్రయాణం సహాయ నటి, తల్లి, అమ్మమ్మ వంటి వైవిధ్యభరితమైన పాత్రల వరకు కొనసాగింది. ప్రతి పాత్రకూ ప్రత్యేకతను అందిస్తూ భారతీయ సినీ చరిత్రలో చిరస్థాయిగా నిలిచారు.

### బాల్యం-కళలపై ఆసక్తి

షావుకారు జానకి అసలు పేరు శంకరమంచి జానకి. ఆమె 1931 డిసెంబర్ 12న అప్పటి మద్రాస్ ప్రెసిడెన్సీలోని రాజమండ్రిలో జన్మించారు. చిన్నతనం నుంచే సంగీతం, సాహిత్యం, నటనపై ఆసక్తి పెంచుకున్నారు. పద్నాలుగేళ్ల వయసులోనే ఆకాశవాణి రేడియో కళాకారిణిగా కళారంగంలో ప్రవేశించారు. రేడియోలో పనిచేసిన అనుభవం ఆమె స్వరానికి, ఉచ్చారణకు, సంభాషణా నైపుణ్యానికి చక్కని పునాది వేసింది. కుటుంబ బాధ్యతలను నిర్వర్తించాలనే సంకల్పంతో ఆమె సినీరంగంలోకి అడుగుపెట్టారు. ఆ తరువాత తన ప్రతిభ, క్రమశిక్షణ, నిరంతర సాధనతో దక్షిణ భారతదేశంలోని ప్రముఖ నటీమణుల్లో ఒకరిగా ఎదిగారు. అలనాటి ప్రసిద్ధ నటి కృష్ణకుమారి ఆమె చెల్లెలు.



### 'షావుకారు'తో సినీ ప్రవేశం

1950లో విజయా సంస్థ నిర్మించిన 'షావుకారు' చిత్రం ద్వారా జానకి కథానాయికగా తెలుగు చిత్రసీమకు పరిచయమయ్యారు. ఎల్.వి. ప్రసాద్ దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో ఎన్టీఆర్ కథానాయకుడిగా నటించారు. జానకి పోషించిన 'సుబ్బులు' పాత్ర ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంది. గ్రామీణ జీవితం, కుటుంబ సంబంధాలు, ఆర్థిక అసమానతలు, మానవీయ విలువల నేపథ్యంలో రూపొందిన ఈ చిత్రంలో ఆమె ప్రదర్శించిన సహజ నటనకు మంచి గుర్తింపు లభించింది. ఈ సినిమా విజయంతో 'షావుకారు' అనే పేరు జానకి పేరులో భాగమైపోయింది. అప్పటి నుంచి ఆమె 'షావుకారు జానకి'గా ప్రసిద్ధి చెందారు. 1952లో 'వలయాపతి' చిత్రంతో తమిళ చిత్రసీమలో ప్రవేశించారు. అనంతరం తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ, హిందీ భాషల్లో సుమారు 400 చిత్రాల్లో నటించి బహుభాషా నటిగా విశిష్ట గుర్తింపు పొందారు.

### విలక్షణమైన నటనా ప్రస్థానం

తెలుగులో 'రోజులు మారాయి', 'కన్యాశుల్కం', 'జయం మనదే', 'పాండురంగ మహాత్మ్యం', 'డాక్టర్ చక్రవర్తి', 'అక్కాచెల్లెలు', 'బడిపంతులు', 'తాయారమ్మ బంగారయ్య', 'సంసారం ఒక చదరంగం', 'దేవి', 'ఏవడే సుబ్రమణ్యం', 'కంచె', 'అన్నీ మంచి శకునములే' తదితర చిత్రాలు ఆమెకు విశేషమైన గుర్తింపును తెచ్చిపెట్టాయి. తమిళంలో 'పుదియ పరవై', 'నీర్‌కుమిళి', 'ఎదిర్ నీచల్', 'ఉయర్న్ద మనిదన్', 'ఇరు కోడుగళ్', 'కావియ తలైవి', 'తిల్లు ముల్లు' వంటి చిత్రాల్లో ఆమె నటన ప్రేక్షకులు, విమర్శకుల ప్రశంసలు అందుకుంది. ఎన్టీఆర్, అక్కినేని నాగేశ్వరరావు, శివాజీ గణేశన్, ఎంజీఆర్, జెమినీ గణేశన్, డా. రాజ్‌కుమార్, రజనీకాంత్, కమల్‌హాసన్ తదితర ప్రముఖ నటులతో కలిసి ఆమె నటించారు. కథానాయికగా మాత్రమే కాకుండా ఆత్మగౌరవం, హాస్యం, హుందాతనం, కుటుంబ అనుబంధాలు, భావోద్వేగాలతో కూడిన పాత్రలకు జీవం పోశారు. ముఖ్యంగా 'సంసారం ఒక చదరంగం' చిత్రంలో ఆమె నటన తెలుగు ప్రేక్షకుల మదిలో ప్రత్యేక స్థానం సంపాదించింది. సినిమాలతోపాటు నాటకరంగం లోనూ ఆమె విశేషంగా రాణించారు. మూడు వందలకు పైగా రంగస్థల ప్రదర్శనల్లో పాల్గొన్నారు. టెలివిజన్ ధారావాహికల్లో నటించి కొత్తతరం ప్రేక్షకులకు కూడా చేరువయ్యారు. 2023లో విడుదలైన 'అన్నీ మంచి శకునములే' ఆమె చివరి తెలుగు చిత్రంగా నిలిచింది.

### పురస్కారాలు-గౌరవాలు

షావుకారు జానకి కళాసేవకు అనేక ప్రతిష్ఠాత్మక పురస్కారాలు లభించాయి. తమిళనాడు ప్రభుత్వం 1969లో 'కళైమామణి' పురస్కారంతో సత్కరించింది. 'ఇరు కోడుగళ్' చిత్రానికి తమిళనాడు రాష్ట్ర ఉత్తమ నటి పురస్కారం అందుకున్నారు. 'సంసారం ఒక చదరంగం', 'అమూల్యం' చిత్రాల్లోని నటనకు ఉత్తమ సహాయ నటిగా నంది పురస్కారాలు లభించాయి. ఫిల్మ్‌ఫేర్ జీవిత సాఫల్య పురస్కారం-దక్షిణాది, ఎంజీఆర్ పురస్కారం, ఎస్ఐఐఎంఏ జీవిత సాఫల్య పురస్కారం, కర్ణాటక రాజ్యోత్సవ పురస్కారం తదితర గౌరవాలను అందుకున్నారు. భారతీయ కళారంగానికి అందించిన విశిష్ట సేవలకు గుర్తింపుగా కేంద్ర ప్రభుత్వం 2022లో దేశ నాలుగో అత్యున్నత పౌర పురస్కారమైన 'పద్మశ్రీ'తో ఆమెను సత్కరించింది.

ఏడు దశాబ్దాలకు పైగా సాగిన అపూర్వ కళాప్రస్థానాన్ని మిగిల్చిన షావుకారు జానకి 2026 ఆగస్టు 21న చెన్నైలో 94 ఏళ్ల వయసులో కన్నుమూశారు. ఆమె భౌతికంగా దూరమైనప్పటికీ, వందలాది చిత్రాలు, విలక్షణమైన పాత్రలు, సహజమైన అభినయం భారతీయ సినిమా చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతాయి.

– సువేగా

# CENTRAL® BOOKS

SINCE 1947

## Your trusted Academic Partner - Then, Now & Forever

**DIAMOND JUBILEE**

**CELEBRATING 75 YEARS OF KNOWLEDGE, TRUST & LEADERSHIP**



| | | | | | |
|---|---|---|---|---|---|
| 12 lakhs + Customers | 700+ Schools | 15 Business Awards | Online Services | Library Solutions & Cambridge Assesment | Books and Stationery Supplies |

## CBS HUB PRIVATE LIMITED

**Head Office :** Head Office : Hans Tech Park Building, 5th Floor, Kondapur, Hyderabad - 500 084.

Regd. Office : Central Book Shop #5-9-186, Chapel Road, Abids, Hyderabad.

Warehouses: Plot No. P9/20, Sy. No. 81, IDA, Nacharam, Uppal Mandal, Medchal, Malkajgiri Dist.
Plot No: 1/5B, TSIIC Industrial Development Area, Nacharam, Medchal Dist., Hyderabad.

www.centralbooks.in


Printed at : Deccan Press, Azamabad, Hyderabad-20, Ph : 90599 50055

BALA CHELIMI, Telugu Children's Monthly Magazine
Date of Publication: 23rd Every Month
Postal Dates: 24th & 26th Every Month
Posting at BPC IV, Patrika Channel, Nampally, Hyderabad-500001.

PRGI Regn. No. 52828/1992, TC No. TELTEL01232
Postal Regn.No.HCD-5022/2024-2026



# బాల చెలిమి
పిల్లల వికాస పత్రిక
ప్రచురణలు



**46 పుస్తకాల ధర రూ.2320 • తగ్గింపు ధర రూ. 2100**

## తెలంగాణ బడి పిల్లల కథలు
10 పుస్తకాల సెట్ ధర రూ.330 తగ్గింపు ధర రూ. 300



## పెద్దలు రాసిన పిల్లల కథలు (ఉమ్మడి పది జిల్లాలు)
10 పుస్తకాల సెట్ ధర రూ.350 • తగ్గింపు ధర రూ. 300



## చిల్డ్రన్స్ ఎడ్యుకేషనల్ అకాడమీ ప్రచురించిన ఇతర పుస్తకాలు
18 పుస్తకాల ధర రూ.950 • తగ్గింపు ధర రూ. 850





పిల్లలకు అత్యంత ఆనందానిచ్చేది ఆట బొమ్మలు, కథల పుస్తకాలే. పాఠ్యపుస్తకాలు అందించే జ్ఞానానికి సమాంతరంగా మరెంతో లోకజ్ఞానాన్ని అందించేది బాల సాహిత్యమే. పుస్తకాలు పిల్లల ఆలోచనా నైపుణ్యాలను పెంచుతాయి. వారి ఊహలకు ప్రాణం పోస్తాయి. వారిలో సృజనాత్మకతను పెంచుతాయి. చరిత్ర, సంస్కృతి, కళలు, సైన్స్, మానవ స్వభావాలు, జంతు స్వభావాలు, ఆరోగ్య సంబంధిత అంశాలు - ఒకటేమిటి ప్రాథమిక విజ్ఞానఖని బాలసాహిత్యం, పిల్లలో నైతికతను, ఆధ్యాత్మికతను, సక్రమమైన ప్రవర్తనను, మంచి చెడుల అవగాహనను పెంచే బాధ్యతను బాలసాహిత్యమే నెరవేర్చగలదు.

–మణికొండ వేదకుమార్
చైర్మన్, చిల్డ్రన్స్ ఎడ్యుకేషన్ అకాడమీ

**చిల్డ్రన్స్ ఎడ్యుకేషనల్ అకాడమీ**
హైదరాబాద్ (Regd. 720/1982)

**Account Details :**
Account Name : Bala Chelimi
Bank Name : Canara Bank
A/c. No. : 30101010003714
Branch : Ashoknagar, Hyderabad.
IFSC Code : CNRB0013010

ప్రతులకు
అన్ని ప్రముఖ పుస్తక కేంద్రాలు. మరియు
'భూపతి సదన్' 3-6-716, స్ట్రీట్ నెం.12,
హిమాయత్‌నగర్, హైదరాబాద్-500029
ఫోన్ : 9030 6262 88

SCAN & PAY

email: edit.chelimi@gmail.com website : www.balachelimi.com

Printed at : Deccan Press, Azamabad, Hyderabad-20, Ph : 90599 50055

Edited, printed, published and owned by Manikonda Vedakumar,
Printed at Deccan Press, H.No.1-9-1126/B, Azamabad, Musheerabad, Hyderabad-500020, Telangana State.
Published at "CHANDRAM", # 3-6-712/2, 12th Street, Himayatnagar, Hyderabad-500029, Telangana.
Editor: Manikonda Vedakumar. RNI Reg No. 52828/92, Tc No: TEL Tel01232.
Cell : 9030626288, Mail ID : edit.chelimi@gmail.com